PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 329 | విజయవాడ, శుక్రవారం 30 జూన్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Friday 30 June 2023 | Rs

కోల్ ఇండియాతోనే ధరల స్థిరత్వం

- పిఐఎస్‌యుగానే కొనసాగించాలి
- ఛైర్మన్ ప్రమోద్ అగర్వాల్ వెల్లడి

లోపలి పేజీలో..

పోరుకేక @ 200 కి.మీ.

పోలవరం పోరుకేక పాదయాత్ర గురువారం ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం రెడ్డి గణపవరంలో200 కిలోమీటర్లు పూర్తి చేసుకుంది. నెల్లిపాక నుంచి ఈ నెల 20న ప్రారంభమైన యాత్ర గురువారం పదో రోజుకు చేరుకుంది.

ఆర్ఎన్ రవి

సెంథిల్ బాలాజీ

‘నైరుతి’ అంతంతమాత్రం

- జూన్ ఆఖరొచ్చినా మారని పరిస్థితి • రెండొంతుల రాష్ట్రంలో వర్షాభావం • స్తంభించిన ఖరీఫ్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఈ ఏడాది జూన్ నెలాఖరొచ్చినా నైరుతి రుతుపవనాల ప్రభావం అంతంతమాత్రంగానే ఉంది. రాష్ట్రంలో దాదాపు రెండొంతుల భూభాగం వరాషాభావాన్ని ఎదుర్కొంటోంది. ఎపిలో 26 జిల్లాలకుగాను గురువారంనాటికి 19 జిల్లాల్లో సాధారణ స్థాయి కంటే తక్కువ వర్షం నమోదైంది. నెల్లూరులో అత్యధికంగా 68.2 శాతం వర్షపులోటు నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా 679 మండలాలుండగా 431 మండలాలు (64 శాతం) వర్షాభావంతో సతమతమవుతున్నాయి. నెల్లూరు జిల్లా దుత్తలూరు, అన్నమయ్య జిల్లా నందలూరు మండలాల్లో చినుకు పడలేదు. ఇంకా 150 మండలాలు అత్యల్పస్థాయి వర్షం (60 శాతంపైన లోటు) కేటగిరిలో ఉన్నాయి. తొలకరి వానల్లేక ఖరీఫ్ పనులు స్తంభించాయి. ఏరువాక సజావుగా సాగట్లేదు. జూన్ నెలాఖరునాటికి సాగు కావాల్సిన విస్తీర్ణంలో సగమే సాగైంది. కాల్వల కింద ఇప్పుడిప్పుడే రైతులు సాగు పనులు చేపడుతున్నారు. వర్షాధారంపైనే ఆధారపడ్డ

ప్రాంతాల్లో సేద్యం నిలిచిపోయింది.

-31 శాతం తక్కువ

ఈ మారు రుతుపవనాలు ఆలస్యమయ్యాయి. కేరళలోకి జూన్ 8న ప్రవేశించగా మన రాష్ట్రంలోకి 11న వచ్చాయి. వాతావరణ అననుకూలత వలన 19 తర్వాత కాస్తంత పుంజుకున్నా ఆశించినంతగా వర్షాలు పడలేదు. జూన్‌లో ఇప్పటి వరకు నార్మల్‌గా 94.5 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా 64.4 మిమీ మాత్రమే పడింది.

31 శాతం తక్కువ వర్షం కురిసింది. అల్లూరి, కృష్ణా, గుంటూరు, పల్నాడు, నంద్యాల, చిత్తూరులో నార్మల్, బాపట్లలో నార్మల్ కంటే కొంచెం ఎక్కువ వర్షం నమోదైంది. మిగతా రాష్ట్రమంతటా వర్షాభావం తిష్టవేసింది.

నెల గడిచిపోయింది

ఖరీఫ్‌లో జూన్ కీలకమైనది. తొలకరి వానలకు రైతులు సాగు పనులు ప్రారంభిస్తారు. నెలాఖరొచ్చినా తగిన వర్షాల్లేకపోవడంతో సేద్యపు పనులు నిలిచిపోయాయి. సాధారణంగా జూన్ మాసంలో 8 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కావాలి. కానీ 4 లక్షల ఎకరాల్లోనే పంటలేశారు. కావాల్సిన సేద్యంలో సగమే జరిగింది. నిరుడు ఈపాటికి 5.3 లక్షల ఎకరాల్లో పంటలేశారు. ఈ తడవ ప్రధాన జలాశయాల్లో ఒక మేరకు నీటి నిల్వలుండటంతో కాల్వలకు ముందుగానే సాగునీరు విడుదల చేశారు. జూన్ 1న గోదావరి డెల్టా, 7న కృష్ణా డెల్టా, 10న పెన్నా కింద అన్ని రిజర్వాయర్లకూ నీళ్లొదిలారు. పెన్నా కింద నెల్లూరు, తిరుపతిలోనే వరి నాట్లు కొద్దిగా సాగుతున్నాయి. కృష్ణా, గోదావరిలో సాగు బాగా నెమ్మదిగా సాగుతోంది. ఖరీఫ్‌లో ముందస్తుగా పంటలు సాగు చేసే ఉత్తరాంధ్రలో సైతం సాగు నెమ్మదిగా సాగుతోంది. వర్షాల్లేనందున వేరుశనగ, పత్తి, అపరాలు, చిరుధాన్యాల సాగు పరిస్థితీ అలాగే ఉంది.

రాజ్‌భవన్ ఇష్టారాజ్!

- తమిళనాడు మంత్రి డిస్మిస్
- విమర్శల వెల్లువతో వెనక్కి
- 5 గంటలకు పైగా హైడ్రామా

చెన్నై : చెన్నై : అసాధారణమైన రీతిలో తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీని డిస్మిస్ చేస్తూ గురువారం సాయంత్రం ఉత్తర్వులిచ్చిన ఆ రాష్ట్ర గవర్నరు ఆర్ఎన్ రవి విమర్శలు వెల్లువెత్తడంతో అర్ధరాత్రి సమయంలో ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. మంత్రిని తొలగిస్తూ గవర్నరు తీసుకున్న చర్య ప్రజాస్వామ్య విరుద్ధమని పలు రాజకీయ పార్టీలు, రాజ్యాంగ నిపుణుల నుంచి విమర్శలొచ్చాయి. గవర్నరు నిర్ణయాన్ని న్యాయస్థానాల్లో సవాలు చేస్తామని ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ప్రకటించారు. ఈ పరిణామాల నేపథ్యంలో అర్ధరాత్రి వేళ గవర్నరు తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి సందేశం చేరవేశారు. అటార్నీ జనరల్‌ను సంప్రదిస్తున్నందున తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకూ దీనిని నిలిపివేస్తున్నట్లు గవర్నరు ఆ సందేశంలో పేర్కొన్నారు. అంతకు ముందు ఈ అంశంపై నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కనీసం సంప్రదించకుండానే రాష్ట్ర మంత్రి సెంథిల్ బాలాజీని ఒక్క కలం పోటుతో గవర్నర్ డిస్మిస్ చేయడంపై పలువురు విస్మయం వ్యక్తం చేశారు.

కరడుగట్టిన ఆరెస్సెస్‌వాది, వివాదాస్పదుడైన గవర్నరు ఆర్ ఎన్ రవి వ్యవహార తీరు మొదటి నుంచి విమర్శలకు గురౌతూనేవుంది. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను తొక్కిపెట్టి కోర్టులతో చీవాట్లు తిన్నా కూడా ఆయన ధోరణిలో మార్పులేదు. ఇంతకుముందు కేరళలో కూడా గవర్నరు ఆరిఫ్ మహ్మద్ ఖాన్ ఇటువంటి పిచ్చి పనికే యత్నించగా అక్కడి ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం దీటుగా జవాబిచ్చింది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో గవర్నర్ల తీరుపై ఇప్పటికే విమర్శలు వెల్లువెత్తుతున్న సంగతి తెలిసిందే. ప్రతిపక్షాల పాలిత రాష్ట్ర ప్రభుత్వాలను వేధించడమే పనిగా పెట్టుకున్న మోడీ సర్కార్.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్‌ను ఉసిగొలిపి సెంథిల్ బాలాజీపై మనీ లాండరింగ్ కేసులో అరెస్టు చేసింది. ముఖ్యమంత్రి సిఫారసు లేకుండా రాష్ట్ర మంత్రివర్గం నుంచి ఎవరినీ తొలగించే అధికారం గవర్నరుకు లేదని లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ పిడిటి ఆచారి స్పష్టం చేశారు. గవర్నరు ముఖ్యమంత్రిని మాత్రమే నియమిస్తారు. మంత్రులను ముఖ్యమంత్రి సిఫారసు మేరకు గవర్నరు నియమిస్తారు. అలాంటప్పుడు మంత్రులను గవర్నరు తొలగించాలంటే ముఖ్యమంత్రి సిఫారసు తప్పనిసరి అని ఆయన వివరించారు.

13,14 తేదీల్లో బెంగళూర్‌లో ప్రతిపక్షాల భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రతిపక్ష పార్టీల నేతల తదుపరి సమావేశం జూలై 13, 14 తేదీల్లో బెంగళూర్ లో నిర్వహించనున్నట్లు నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధినేత శరద్ పవార్ వెల్లడించారు. “పాట్నాలో ప్రతిపక్ష పార్టీల సమావేశం తరువాత ప్రధాని మోడీకి కంటిమీద కునుకులేకుండా పోయిందని” ఆయన అన్నారు. ఈ నెల 23న బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నివాసంలో సమావేశమైన 15 ప్రతిపక్ష పార్టీల నేతలు జూలై 10-12 తేదీల్లో సిమ్లాలో సమావేశం



శరద్ పవార్

కానున్నట్టు వెల్లడించారు. అయితే, ఆ సమావేశ స్థలి, సమయాల్లో మార్పులు చేయాల్సి వచ్చిందని పవార్ తెలిపారు. 2024 ఎన్నికల్లో బిజెపిపై ఐక్యంగా పోరాడేందుకు అనుసరించాల్సిన వ్యూహం గురించి బెంగళూరు సమావేశంలో చర్చించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. పాట్నా సమావేశం ఒక మంచి పరిణామంగా విశ్లేషకులు భావిస్తున్నారు. భారత దేశ లౌకిక, ప్రజాస్వామ్య స్వభావాన్ని, పౌర స్వేచ్ఛ, ప్రాథమిక హక్కులకు మన రాజ్యాంగం ఇస్తున్న హామీలను కాపాడుకోడానికి ప్రతిపక్ష పార్టీల మధ్య సహకారం మరింత పెరగాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.

బ్రెజిల్ పునరాగమనం !

- బహుళ ధ్రువ ప్రపంచం సాకారం దిశగా అడుగులు
- బ్రిక్స్ సదస్సుకు ముందు మిత్రకూటమి ఏర్పాటుకు సన్నాహాలు

లోపలి పేజీలో..

బిజెపి కుట్ర నుండి రాష్ట్రాన్ని కాపాడాలి

- అధికార, ప్రతిపక్షపార్టీల అండతో బలపడే ప్రయత్నం
- 500 మంది మేధావుల సంతకాలతో ప్రకటన

విజయవాడ ప్రెస్‌క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రానికి హోదా ఇవ్వకుండా, విభజన హామీలు అమలు చేయకుండా ద్రోహం చేసిన బిజెపి అధికార, ప్రతిపక్ష పార్టీల అండతో బలపడేందుకు ప్రయత్నిస్తోందని ఈ కుట్రలను తిప్పికొట్టి బిజెపి కుయుక్తుల నుండి రాష్ట్రాన్ని కాపాడాలని మేధావులు రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివిధ రంగాలకు చెందిన మేధావులు మాట్లాడారు. ‘బిజెపిని ఒంటరి చేసి రాష్ట్రాన్ని కాపాడండి.. రాష్ట్ర పౌరులకు వివిధ రంగాలకు ప్రముఖుల విజ్ఞప్తి’ పేరుతో రచయితలు, వైద్యులు, ప్రొఫెసర్లు, వేర్వేరు హక్కుల వేదికలు, అభ్యుదయ వాదులు సుమారు 500 మంది సంతకాలు చేసిన విజ్ఞాపన పత్రాన్ని వారు విడుదల చేశారు.

బిజెపి చేస్తున్న మోసాలు, దానికి రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు వత్తాసు పలకడం వంటి అనేక అంశాలపై వారు స్పందించారు. ఈ సందర్భంగా ప్రముఖ రైతు నాయకులు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని మోడీ దేశాన్ని అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నారని అన్నారు. విభజన సమయంలో ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయడం లేదని, అటువంటి బిజెపి ప్రభుత్వానికి రాష్ట్రంలో ఉన్న వైసిపి, టిడిపి, జనసేన ఎందుకు మద్దతు తెలుపుతున్నాయో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల్లో బలం లేని బిజెపికి రాష్ట్రపతి ఎన్నికల్లో బిజెపి పాలిత రాష్ట్రాల్లో కూడా రానన్ని ఓట్లు ఇక్కడ వచ్చాయని, ఇంతకంటే దిగజారుడుతనం మరొకటి లేదని అన్నారు. పార్లమెంటులో పెట్టే ప్రజావ్యతిరేక బిల్లులు ముఖ్యంగా వ్యవసాయ చట్టాలు, విద్యుత్ సంస్కరణల బిల్లులకు వైసిపి, టిడిపి సంపూర్ణ మద్దతు ఇచ్చాయని విమర్శించారు. ప్రధాని మోడీకి ప్రజాస్వామ్యం అన్నా, ఫెడరల్ వ్యవస్థ అన్నా గౌరవం లేదని మతం పేరుతో బిజెపి పాలిత రాష్ట్రాల్లో నరమేధం జరుగుతోందని అన్నారు. ఉపా చట్టాన్ని దుర్వినియోగం చేస్తోందని, వారి దోపిడీకి అడ్డు వచ్చిన వారందరిపై ఉపా చట్టాన్ని పెట్టి జైల్లోనే చనిపోయేలా చేస్తోందని విమర్శించారు. మణిపూర్‌లో గిరిజన ప్రాంతాల్లో దోపిడీ కోసం తెగల మధ్య ఘర్షణ రెచ్చగొట్టిందని పేర్కొన్నారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అరాచక పాలన సాగుతోందని వివరించారు. కేంద్ర మాజీ మంత్రి ప్రఖ్యాత ఇంజనీరు డాక్టర్ కె.ఎల్.రావు కుమారుడు కె.విజయరావు మాట్లాడుతూ దేశంలో ఘర్షణలు పెంచుతూ బిజెపి తన దోపిడీని కొనసాగిస్తోందని తెలిపారు. సామాజిక వ్యవస్థను దెబ్బతీస్తున్నారని, గుజరాత్‌లో చిన్న ఘటన జరిగితే వెళ్లే ప్రధానికి మణిపూర్‌లో అంత ఘర్షణలు జరుగుతున్నా పట్టడం లేదని అన్నారు. హిందూ వ్యతిరేకులనే పేరుతో అనేకకులాల వారిపై దాడులకు పాల్పడటంతోపాటు హత్యలు కూడా చేస్తున్నారని విమర్శించారు. ముస్లిం వ్యతిరేకతను రెచ్చగొడుతున్న ఎంపిలు, కేంద్ర మంత్రులపై ఇప్పటి వరకూ ఎటువంటి చర్యలూ లేవని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని విమర్శించారు. పిఎంకేర్, ఎలక్టోరల్ బాండ్స్ పేరుతో పచ్చి దోపిడీ జరుగుతోందని అన్నారు. దేశంలో ప్రశాంతత లేదని, ఇక అభివృద్ధి ఎక్కడ నుండి వస్తుందని ప్రశ్నించారు. దేశం అభివృద్ధి చెందాలంటే బిజెపి పోవాలన్నారు.

మరిన్ని వివరాలు లోపల పేజీలో

విద్యుత్ షాక్‌తో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-కలిగిరి (నెల్లూరు జిల్లా)

విద్యుత్ షాక్‌తో ఇద్దరు మృతిచెందిన విషాద సంఘటన నెల్లూరు జిల్లా కలిగిరి మండలం కుమ్మర కొండూరు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమ్మర కోండూరుకు చెందిన రైతు కంచెంరెడ్డి మల్లికార్జునరెడ్డి తన పొలంలోని వ్యవసాయ పంపుసెట్‌కు మరమత్తులు చేసేందుకు ఎలక్ట్రిషియన్ వేల్పుల నారాయణతో కలిసి పొలానికి వెళ్లారు. పంపుసెట్‌కు మరమత్తులు చేసిన అనంతరం విద్యుత్ వైరును స్తంబానికి తగిలించే క్రమంలో 11కెవి లైన్ తగిలి రైతు మల్లికార్జున రెడ్డి (45), వేల్పుల నారాయణ (37) అక్కడికక్కడే మృతిచెందారు. ఎస్ఐ సూర్య ప్రకాష్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వ సాయం అందించాలని స్థానికులు కోరారు.

రైతులు, ఇతర పేదలపై భారం మోపే విద్యుత్ సంస్కరణలను రాష్ట్రం తిరస్కరించాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అదనపు రుణాల కోసం కేంద్రప్రభుత్వం ప్రతిపాదించిన విద్యుత్ సంస్కరణలు అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించరాదని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. రైతులపై పెనుభారంగా మారే షరతులను తిరస్కరించాలని కోరింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు గురువారం ప్రకటన విడుదల చేశారు. కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి ఏడువేల కోట్లు అదనపు రుణం మంజూరు చేయాలంటే తాను ప్రతిపాదించిన విద్యుత్ సంస్కరణలు అమలు చేయాలని షరతులు పెట్టిందని పేర్కొన్నారు. ఈ షరతుల వల్ల ఇప్పటివరకు ఉచిత, రాయితీ విద్యుత్‌ను పొందుతున్న రైతులు, ఇతర పేదలు విద్యుత్ బిల్లులను ముందుగానే చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. చెల్లించిన ప్రతిసారీ ప్రభుత్వానికి సబ్సిడీ కోసం నివేదించాలని, ఆ తరువాతనే రాష్ట్రప్రభుత్వం వారి అకౌంట్లకు నగదు జమ చేస్తుందని వివరించారు. ఇప్పటికే గిట్టుబాటు ధర లేక కుంగిపోతున్న రైతులు ఈ విద్యుత్ ఛార్జీలను భరించలేరని, నేటి సంక్షోభ పరిస్థితుల్లో రైతులకు, పేదలకు తగిన సహాయం చేసి ఆదుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారిపై భారాలు వేయడం గర్హనీయమని పేర్కొన్నారు. ఇది క్రమంగా సబ్సిడీలను ఎత్తివేయడానికి చేస్తున్న కుట్ర తప్ప మరొకటి కాదని తెలిపారు. కేంద్రప్రభుత్వం చేస్తున్న ఈ కుటిల ప్రయత్నాలను వ్యతిరేకించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం డిమాండ్ చేసింది. ఉచిత, రాయితీ విద్యుత్ విధానాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరింది.

జైళ్లలో పెరుగుతున్న మరణాలు

- సిబ్బంది కొరతే కారణం.. వైద్యాధికారుల ఖాళీలు అధికం
- ఎన్‌హెచ్ఆర్‌సి ఆందోళన

లోపలి పేజీలో..

మణిపూర్‌లో రాహుల్

- పర్యటనను అడ్డుకున్న పోలీసులు

ఇంఫాల్/న్యూఢిల్లీ : సుమారు రెండు నెలల నుంచి హింసతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో పర్యటనకు వెళ్లిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి మణిపూర్ ప్రభుత్వం అడుగడుగునా అడ్డుకునే యత్నం చేసింది. ఇంఫాల్‌కు 20 కిలోమీటర్ల దూరంలో బిష్ణుపూర్ వద్ద రాహుల్ కాన్వాయ్‌ను పోలీసులు గురువారం అడ్డగించారు. చురాచాంద్‌పూర్‌కు రోడ్డు మార్గంలో కాకుండా హెలికాప్టర్‌లో వెళ్లాలని సూచించారు. రాహుల్ పర్యటనను అడ్డుకోవడం అప్రజాస్వామికమని కాంగ్రెస్ పార్టీ ఖండించింది. మణిపూర్ ప్రజలు తనను ఎంతో ఆత్మీయంగా స్వాగతించారనీ, కానీ బిజెపి ప్రభుత్వమే ఆటంకాలు సృష్టించేందుకు యత్నిస్తోందని రాహుల్ విమర్శించారు. హింసాకాండలో గాయాలపాలైన మణిపూర్ తక్షణ ఊరట కోరుకుంటున్నదని రాహుల్ ట్వీట్ చేశారు. శాంతిస్థాపనే ప్రధానమని పేర్కొన్నారు. రెండు రోజుల పర్యటన కోసం గురువారం ఉదయం మణిపూర్ రాజధాని ఇంఫాల్‌కు చేరుకున్న రాహుల్‌గాంధీ హింసాకాండలకు కేంద్ర బిందువైన చురాచాంద్‌పూర్ జిల్లాకు బయల్దేరిన కొద్ది సేపటికే ఆయన కాన్వాయ్‌ను పోలీసులు అడ్డుకున్నారు. భద్రతా కారణాలను సాకుగా చూపారు. కాన్వాయ్‌పై గ్రెనేడ్ల దాడి జరిగే అవకాశం ఉందని, మిగతా 7లో

తిరుపతి కేంద్రంగానే తెలుగు అకాడమీ

- ఛైర్ పర్సన్ లక్ష్మీ పార్వతి వెల్లడి

ప్రజాశక్తి - తిరుపతి అర్బన్

ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ కేంద్ర కార్యాలయం తిరుపతి నుంచే పని చేస్తోందని, ఎలాంటి అనుమానం వద్దని తెలుగు అకాడమీ ఛైర్ పర్సన్ లక్ష్మీపార్వతి అన్నారు. శాశ్వత భవనం కోసం శ్రీకాళహస్తి ఆర్‌డిఒ రామారావుతో కలిసి ఏర్పేడు మండలంలోని రెండు ప్రాంతాల్లో ప్రభుత్వ భూమిని గురువారం ఆమె పరిశీలించారు. అనువైన స్థలాన్ని ఎంపిక చేసుకుని కార్యాలయం నిర్మాణం చేపడతామని లక్ష్మీపార్వతి తెలిపారు. ఆమె వెంట రాయలసీమ మేధావుల ఫోరం సమన్వయ కర్త మాకిరెడ్డి పురుషోత్తమ రెడ్డి, తెలుగు భాషోద్యమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సాకం నాగరాజు ఉన్నారు.

నల్ల జాతీయుడిని కాల్చి చంపిన పోలీసుల కిరాతక చర్యపై పారిస్‌లో రెండో రోజు నిరసనల హోరు

ఫ్రాన్స్‌లో ఆగని నిరసనలు

నాన్‌టెరె, ఫ్రాన్స్ : పోలీసుల దుశ్చర్యను ఖండిస్తూ ఫ్రాన్స్‌లో మంగళవారం రాత్రి నుండి కొనసాగుతున్న నిరసనలు తాజాగా మరిన్ని పట్టణాలకు, నగరాలకు విస్తరించాయి. న్యాయం కావాలని కోరుతూ వేలాదిమంది ప్రదర్శన చేపట్టారు. ఇదిలావుండగా, ఒక్కసారిగా తలెత్తిన ఈ ఉద్రిక్త పరిస్థితులను, సంక్షోభాన్ని నియంత్రించేందుకు అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ కృషి చేస్తున్నారు. సంయమనం పాటించాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రెండో రోజూ పోలీసులు 180మందిని అరెస్టు చేశారని హోం మంత్రి గెరాల్డ్ డార్మానిన్ తెలిపారు. కాల్పుల ఘటనపై సీనియర్ మంత్రులతో మాక్రాన్ సమావేశం జరిపారు. ఈ నేపథ్యంలో దేశంలో అత్యవసర పరిస్థితి విధించాలంటూ కొంతమంది రాజకీయ ప్రత్యర్థులు పిలుపివ్వడాన్ని ప్రధాని ఎలిజబెత్ బార్నె తోసిపుచ్చారు. దేశవ్యాప్తంగా దాదాపు 40వేల మంది పోలీసులను మోహరించినట్లు హోం మంత్రి తెలిపారు.

ఎపి రైతు సంఘం నేతల ముందస్తు అరెస్టులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి/ అచ్యుతాపురం (అనకాపల్లి)

రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విజయవాడలో శుక్రవారం జరగనున్న మహాధర్నాలో పాల్గొనకుండా పోలీసులు ముందస్తు అరెస్టులకు పాల్పడ్డారు. గురువారం రాత్రి నుంచే ఎపి రైతు సంఘం నేతలను ఎక్కడికక్కడ అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌లకు తరలించారు. కొందరు నేతలను గృహ నిర్బంధం చేశారు. ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా బకాయిలు, వడ్డీ రాయితీ, పంటలకు మద్దతు ధర వంటి డిమాండ్లతో ఎపి రైతు సంఘం మహాధర్నాకు పిలుపునిచ్చింది. ధర్నాలో పాల్గొనే నేతలకు పోలీసులు నోటీసులు అందజేశారు. శ్రీకాకుళంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహన రావు, ఎచ్చెర్లలో టి.నందోడు ఇళ్లకు వెళ్లి నోటీసులందించారు. ధర్నాకు ఎటువంటి అనుమతుల్లేవని, ధర్నాలో పాల్గొంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనకాపల్లిలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు ను ఆయన స్వగ్రామమైన తిమ్మరాజుపేటలో గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సమస్యలపై మాట్లాడేందుకు వెళ్తున్న తనను ఇలా నిర్బంధించడం దారుణమన్నారు.

ఒపిఎస్‌కు ప్రత్యామ్నాయం లేదు

- ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్‌టిసి ఉద్యోగులకు ఒపిఎస్ అమలు చేయకుండా హయ్యర్ పెన్షన్ విధానాన్ని తీసుకొచ్చామని ప్రభుత్వం చెబుతుండటం సమస్యను పక్కదారి పట్టించేందుకేనని, ఒపిఎస్‌కు ప్రత్యామ్నాయం లేదని ఎపిపిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ పేర్కొంది. ఈ మేరకు గురువారం ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలాని బాషా, అధ్యక్షులు సిహెచ్ సుందరయ్య, ప్రధాన కార్యదర్శి అయ్యపురెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. హయ్యర్ పెన్షన్ పేరుతో చెబుతున్నట్లుగా ఆర్‌టిసి ఉద్యోగులకు న్యాయం జరగదని అన్నారు. ఇప్పటికే ఆర్‌టిసిలో ఏళ్లతరబడి పని చేసి రిటైర్డు అయినా చివరకు చనిపోయాక కూడా పెన్షన్ ఆర్డర్లు రావడం లేదన్నారు. 2001లో అనారోగ్యంతో చనిపోయిన తణుకు డిపోకు చెందిన డ్రైవర్ పెన్షన్ కేసు ఇప్పటి వరకు అమలు కాలేదని తెలిపారు. 2020 తర్వాత చనిపోయిన ఉద్యోగుల కుటుంబ పెన్షన్ ఇప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. హయ్యర్ పెన్షన్ విధానం కేవలం ప్రైవేటు రంగంలోని ఉద్యోగులకు మాత్రమే ప్రయోజ నకరమని అన్నారు. ఆర్‌టిసి ఉద్యోగులకు ఒపిఎస్ అమలు చేయాలని కోరారు.

నీటి సంపులో పడి బాలుడి మృతి

ప్రజాశక్తి - రాయదుర్గం

జస్వంత్ (ఫైల్)

ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి మూడేళ్ల బాలుడు మరణించిన ఘటన అనంతపురం జిల్లా రాయదుర్గం పట్టణం చంద్రబాబు కాలనీలో గురువారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు... చంద్రబాబు కాలనీకి చెందిన దంపతులు మంజునాథ్, సరిత కుమారుడు జస్వంత్(3) బుధవారం సాయంత్రం నుంచి కనిపించకుండాపోయాడు. దీంతో మంజునాథ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం అదే కాలనీలోని నిర్మాణంలో ఉన్న ఓ ఇంటి సంపుగుంతలో బాలుడు మృతదేహం లభ్యమైంది. ఆడుకుంటూ వెళ్లి సంపులో పడి బాలుడు మృతిచెందినట్లు స్థానికులు భావిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

టిడిపి బస్సు యాత్రలో అపశృతి

- కుర్మా పాత్రలో పడిపోయి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల (పల్నాడు జిల్లా)

భవిష్యత్‌కు గ్యారెంటీ చైతన్య రథయాత్ర పేరుతో పల్నాడు జిల్లాలో టిడిపి నిర్వహిస్తున్న బస్సు యాత్రలో అపశృతి చోటుచేసుకుంది. బస్సు యాత్ర బుధవారం రాత్రి పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామంలో బహిరంగ సభ అనంతరం భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి జనం భారీగా తరలిరావడంతో భోజనాల సమయంలో తొక్కిసలాట జరిగింది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన యరగాని కోటేశ్వరరావు (60) వేడిగా ఉన్న కుర్మా పాత్రలో పడి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆయనను గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందారు. మృతుడు కోటేశ్వరరావుకు భార్య, కుమారుడు ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ ఆంజనేయులు తెలిపారు.

అంకిత భావంతో విధులు నిర్వహించాలి

- రాష్ట్ర డిజిపి కెవి.రాజేంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

శిక్షణ పొందుతున్న ట్రైనీ డిఎస్‌పిలతో గురువారం ముఖాముఖి సమావేశం నిర్వహించారు. సమాజం, వృత్తిపరంగా, వ్యక్తిగతంగా ఎలా వ్యహరించాలి.. ప్రజలకు అందించాల్సిన సేవలు.. విధినిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావం, పారదర్శకత, క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని అన్నారు. ఇటీవల పెరిగిపోతున్న సైబర్ నేరాల కట్టడికి కృషి చేయాలని తెలిపారు. మహిళల రక్షణే ధ్యేయంగా ప్రభుత్వం, పోలీసుశాఖలు కృషి చేస్తున్నాయని, ఆ దిశగా మహిళల రక్షణ కవచంగా దిశ యాప్ పని చేస్తోందని చెప్పారు. గంజాయి, తదితర మాదక ద్రవ్యాల నియంత్రణపై ఇప్పటికే పోలీసు శాఖ ఉక్కుపాదం మోపిందన్నారు. మత్తుపదార్థాల అనర్థాలపైనా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజలకు సత్వర న్యాయం జరగడమే ధ్యేయంగా పోలీసులు విధులు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఐజిపి వెంకట్రామిరెడ్డి, ఎస్‌పి కె.శ్రీనివాసరావుతో పాటు ట్రైనీ డిఎస్‌పిలు పాల్గొన్నారు.

వత్తాసు మాని.. ఎదిరించండి

- బిజెపికి మద్దతుపై రాష్ట్రంలోని పార్టీలకు మేధావుల సూచన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బిజెపిని ఐక్యంగా ఎదిరించి, దాని కుయుక్తుల నుండి రాష్ట్రాన్ని కాపాడాలని మేధావులు వివిధ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలంతా ఆ విధంగా పార్టీలపై ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు. విజ్ఞాపనపత్రంపై సంతకాలు చేసిన వారిలో ప్రముఖకవి రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, గంటాడ గౌరునాయుడు, జి.నరుసునాయుడు, గోళ్ల నారాయణరావు, కె.ఎస్.మల్లేశ్వరి, అరుణ గోగులమండ, ప్రొఫెసర్ ఎస్.అంజయ్య, ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జార్జి విక్టర్, ఐవి సుబ్బారావు, ఎ.అజశర్మ తదితరులు ఉన్నారు.

అంబటి ఆంజనేయులుకు నివాళి

విలేకరుల సమావేశానికి ముందు ఎపియుడబ్ల్యుజె నాయకులు అంబటి ఆంజనేయులు మృతికి సంతాపంగా మేధావులు నిముషంపాటు మౌనం పాటించారు. జర్నలిస్టుగా అందరితోనూ సహృదయంతో మెలిగేవారని పేర్కొన్నారు.

విశాఖస్టీలును అమ్మేస్తుంటే నోరెత్తరేం ?
చలసాని శ్రీనివాస్

ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్రుల ఆత్మగౌరవమైన విశాఖస్టీలును అమ్మేస్తుంటే వైసిపి, టిడిపి, జనసేన నోరెత్తడం లేదని అన్నారు. ఇస్తానన్న హోదాను ఇవ్వలేదని, రామయపట్నం పోర్టును రాష్ట్రంపై వదిలేశారని విమర్శించారు.

రాజకీయనాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలి?
పాపారావు

ప్రముఖ ఆర్థికవేత్త పాపారావు మాట్లాడుతూ రాష్ట్రంలో బిజెపి లేకపోయినా రాజకీయ పక్షాల్లో ఉందని, అలా ఎందుకు జరుగుతుందో రాజకీయ నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు.

పార్టీలు బిజెపికి ఎందుకు మద్దతు ఇస్తున్నాయి.
ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ దేశంలో అరాచకం జరుగుతోందని, ఒక్కరికీ కూడా న్యాయం జరిగిందన్న మాట లేదని తెలిపారు. రాష్ట్రంలో ఒక్క సీటు కూడా లేకపోయినా పార్లమెంటులో బిజెపికి పూర్తి మెజార్టీ వచ్చే రాష్ట్రాల్లో ఎపి తొలిస్థానంలో ఉందని, అన్నిసార్లు గెలిచిన గుజరాత్‌లోనూ బిజెపికి పూర్తి మెజార్టీ లేదని తెలిపారు. పలువురు ప్రముఖులు కూడా ఈ వేదికపై మాట్లాడారు.

.రాష్ట్ర పార్టీల వత్తాసు
డివివిఎస్ వర్మ, జాతీయ స్ఫూర్తి సంపాదకులు



వచ్చే ఎన్నికల్లో బిజెపికి సీట్లు వస్తాయన్న రాష్ట్రం ఒక్కటీ కనిపించడం లేదు. రాష్ట్రంలో మాత్రం ఎగబడి ఎందుకు బిజెపి వెనుక వెళ తున్నారో తెలపాలి. అభివృద్ధి అనే పదానికంటే అవినీతి అనే పదం ఎక్కువగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో బిజెపికి వెంటబడుతున్న వారు ముందు ప్రజలకు సమాధానం చెప్పాలి.

ఓట్లు లేకపోయినా పెత్తనం
ప్రముఖ రచయిత్రి డాక్టర్ వసుంధర

రాష్ట్రంలో బిజెపి లేకపోయినా వైసిపి, టిడిపి, జనసేన మద్దతుతో బలమైన వ్యవస్థగా ఉంది. ఇలా ఎందుకు జరుగుతుందో అర్థం కావడం లేదు. ఎక్కడైనా ఓట్లు ఉంటే బలమైన రాజకీయ పార్టీ అంటారు. నోటాకంటే తక్కువ ఓట్లు వచ్చినా బిజెపి రాష్ట్రంలో బలంగా ఉండటానికి కారణం ఇక్కడ పార్టీలే.

ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయాలి
భారత్ బచావో నాయకులు భాస్కరరావు

దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉంది. బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజాస్వామ్యం అనే మాటకు విలువ లేకుండా చేస్తున్నారు. మాట్లాడితే కేసులు పెట్టి జైల్లో వేస్తున్నారు. దోపిడీ చేస్తున్నారు. దీనిపై ప్రశ్నించేందుకు ఒక వేదిక అవసరం.

అంతర్జాతీయ క్రీడాకారులకే న్యాయం లేదు
ప్రముఖ వ్యాపారవేత్త మలినేని నారాయణప్రసాద్

అంతర్జాతీయంగా దేశానికి అవార్డులు తెచ్చిపెట్టిన క్రీడాకారులు అన్యాయం జరుగుతోందని చెబితే బాధ్యుడైన ఎంపిపై కనీస చర్యలు తీసుకోని దుర్మార్గ పాలన దేశంలో ఉంది. దేశానికి ఎంతో పేరు ప్రతిష్టలు తెచ్చినవారు చెబుతున్న అభిప్రాయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోలేని అన్యాయమైన పాలన సాగుతోంది. ముడి చమురును అతి తక్కువ ధరకు కొంటూ ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. దీన్ని ప్రశ్నించాల్సిన అవసరం ఉంది.

ప్రపంచంలో ఎక్కడా నిలబడలేని పరిస్థితి
రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్రప్రసాద్



విశ్వగురువు అని ప్రచారం చేసుకుంటూ ప్రపంచంలో ఎక్కడా నిలబడలేని పరిస్థితి ఏర్పడింది. ఏ రంగంలోనూ ముందుకు వెళ్లడం లేదు. మోడీ ప్రచారం తప్ప దేశానికి ఆదరణ లేని స్థితిని బిజెపి పాలకులు తీసుకొచ్చారు.

విదేశాలకు వెళ్లినా అదానీ, అంబానీకి దోచిపెట్టే పనే తప్ప ప్రజలకు ఏం చేద్దామనే ఆలోచన కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో బిజెపిని సాగనంపాల్సిన అవసరం ఉంది.

అన్యాయంపై ప్రశ్నిస్తే సస్పెన్షన్లు
అభివృద్ధి వేదిక నాయకులు నేతి మహేశ్వరరావు

దేశంలో జరుగుతున్న అన్యాయంపై పార్లమెంటులో గళమెత్తితే ఎంపిలను సస్పెండ్ చేస్తున్నారు. రక్షణ రంగంలోకి తీసుకు రాకూడని సాఫ్ట్‌వేర్‌ను తీసుకొచ్చారు. అదానీకి లక్షల కోట్లు అప్పగించారు. వీటిని ప్రశ్నించినందుకు కాంగ్రెస్ ఎంపి రాహుల్‌ని సస్పెండ్ చేశారు. లక్షల కోట్లు దోచుకుంటున్నా ప్రశ్నించకూడదనే నియంతృత్వ పాలన బిజెపి చేస్తోంది. మోడీని గద్దె దించకపోతే దేశం అదోగతి పాలవుతుంది.

ప్రజాస్వామ్యమంటే బిజెపికి విలువ లేదు
జర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకులు ఎస్.వెంకట్రావు

ప్రజాస్వామ్యం పట్ల మోడీ ప్రభుత్వానికి విలువలేదు. ప్రశ్నించిన వారిని అన్యాయంగా జైల్లో పెడుతున్నారు. బలవంతంగా కేసులు బనాయిస్తున్నారు. ప్రజలను ప్రజాస్వామ్య విలువలను పట్టించుకోని బిజెపిని గద్దె దించాల్సిన అవసరం ఉంది.

ఘర్షణపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదు
కృష్ణాజిల్లా పరిషత్ మాజీ వైస్‌ఛైర్మన్
గొట్టిపాటి వెంకట రామకృష్ణ

బిజెపికి మత ఘర్షణలు సృష్టించడంపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదు. ఘర్షణల చాటున దేశాన్ని దోచుకుంటున్నారు. వాళ్లు ఎక్కడ దోపిడీ చేయాలనుకుంటే అక్కడ కులపరమైనవో, మతపరమైనవో, జాతుల మధ్యో ఘర్షణలు సృష్టిస్తున్నారు. మణిపూర్లో ఘర్షణలు కూడా ఇందులో భాగమే. వాటిని నివారించే పని కేంద్రం చేయడం లేదు. దీనివెనుక ఏదో కుట్ర ఉంది.

అందరూ ఐక్యమైతేనే న్యాయం
రైతు నాయకులు ఎర్నేని నాగేంద్రనాథ్

ప్రజా వ్యతిరేకమైన బిజెపిని గద్దె దించేందుకు అన్ని పక్షాలూ ఐక్యమవ్వాలి. పార్లమెంటులో పూర్తి అధికారం ఉందనే పేరుతో బిజెపి ఏకపక్షంగా వ్యవహరిస్తోంది. దేశంలో అదానీ, అంబానీ తప్ప మోడీకి మరెవరూ కనిపించడం లేదు.

పార్లమెంటులో మోడీ భజన తప్ప మరోపనిలేని విధంగా సభలు జరుపుతున్నారు. రైతులకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించాలి. పోలవరానికి న్యాయం చేయలేని పార్టీని గద్దె దించాలి.

కూనవరం మండలంలో వరద తాకిడికి గురైన

అన్నిటినీ ముంపు గ్రామాలుగా గుర్తించాలి

- ముఖ్యమంత్రికి సిపిఎం లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అల్లూరి సీతారామరాజు (ఎఎస్‌ఆర్ రంపచోడవరం) జిల్లా కూనవరం మండలంలో వరద తాకిడికి గురైన అన్ని గ్రామాలనూ ముంపు గ్రామాలుగా గుర్తించి నష్టపరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్రకటించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ రాశారు.

ఈ నెల 21, 22, 23 తేదీల్లో కూనవరం మండలంలో పాదయాత్ర చేస్తున్న సమయంలో ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడితే అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయని శ్రీనివాసరావు లేఖలో పేర్కొన్నారు. 2022 జులై నెలలో వచ్చిన వరదలకు ఈ మండలంలో 48 గ్రామాలు నీట మునిగాయని, పోలవరం నిర్వాసితుల లిస్టులో మొదటి దశలో ఒక గ్రామాన్ని ప్రాధాన్యతగా గుర్తించారని తెలిపారు. పెదర్కూర్, పంద్రజుపల్లి గ్రామాలను పాక్షికంగా (సగం) గుర్తించారని పేర్కొన్నారు. అయితే పూర్తిగా మునుగుతున్న 31 గ్రామాలను, పాక్షికంగా మునుగుతున్న ఏడు గ్రామాలను ప్రభుత్వం గుర్తించలేదని అన్నారు. ప్రాజెక్టు ముంపులో ఉన్న 12 గ్రామాల రైతుల భూములకు ఇంకా నష్టపరిహారం ఇవ్వలేదని, దీనివల్ల రైతులు వ్యవసాయం చేయలేకపోతున్నారని పేర్కొన్నారు. 41.15లో మొదటి విడత ఆర్ఆర్ఆర్ చేర్చిన బొజ్జరాయిగూడెం గ్రామానికి ఎటపాక మండలం రాయనపేటలో పునరావాస కాలనీ కట్టించారని, 2022 జులైలో వచ్చిన వరదలకు అది కూడా మునిగిపోయిందని తెలిపారు. గత వరదల్లో పోలవరం ప్రాజెక్టు 36.37 మీటర్ల వద్దే మండలం అంతా మునిగిపోయిందని వివరించారు. మునగని ఎనిమిది గ్రామాల చుట్టూ నీరు చేరడంతో మౌలిక వసతులు, రోడ్లు, విద్యుత్ ఉండటం లేదని తెలిపారు. నిత్యావసర సరుకుల కొనుగోలుకు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించారు. దాంతోపాటు వైద్య సదుపాయం కూడా అందడం లేదని వివరించారు. మొత్తం 56 రెవెన్యూ గ్రామాలు గోదావరి వరదతోపాటు పోలవరం బ్యాక్‌వాటర్ వల్ల ముంపునకు గురవుతున్నాయని అన్నారు. ప్రభుత్వం ఇవేవీ పట్టించుకోకుండా రెండో దశలో 10 గ్రామాలను మాత్రం ప్రస్తుతం ప్రకటించిందని, 48 గ్రామాలను ఆర్‌ఆండ్‌ఆర్‌లో చేర్చాలని కోరారు. కూనవరం మండలంలో వరద తాకిడికి గురైన, వరద చుట్టుముట్టిన అన్ని గ్రామాలనూ నిర్వాసిత గ్రామాలుగా గుర్తించి వారికి నష్టపరిహారం పునరావాస, పునర్నిర్మాణ ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇంటికి ఇల్లు, అందరికీ నష్టపరిహారం చెల్లించి ముంపు లేనిచోట ఇల్లు కట్టించి ఇవ్వాలని కోరారు. ఈ సంవత్సరం వరదలు రాకముందే ముందస్తు చర్యలు చేపట్టాలని, అన్ని సౌకర్యాలూ సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఆర్‌అండ్‌ఆర్ విభాగంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ముఖ్యమంత్రిని కోరారు.

'సిలికా'తో కోట్లు దోచుకుంటున్న వైసిపి నేతలు

యువగళం పాదయాత్రలో లోకేష్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, చిల్లకూరు

అక్రమ సిలికా విక్రయాల ద్వారా జగన్ అండ్ కో ఇప్పటివరకూ రూ. ఐదు వేల కోట్లు దోచుకున్నారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ ఆరోపించారు. బిల్లులు లేకుండా పెద్దఎత్తున సిలికాను చెన్నయ్‌కు తరలిస్తూ వైసిపి నేతలు దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. యువగళం పాదయాత్ర గురువారం నెల్లూరు జిల్లా గూడూరు నియోజకవర్గం కోట, చిల్లకూరు మండలాల్లోని కాకువారి పాలెం, వేలపాలెం, తూర్పు కనుమూరు, చింతవరం, ఏలూరు మెమోడి, వరిగలి గ్రామం వరకూ కొనసాగింది. ఆకువారిపాలెం గ్రామస్తులు లోకేష్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. 'చిల్లకూరు, కోట మండలాల్లో తీరప్రాంత గ్రామాల్లో సిలికాను తవ్వుకునేందుకు 84 మందికి ప్రభుత్వం అనుమతులిచ్చిందని, సిలికా వ్యాపారాన్ని పంచాయతీ తీర్మానం లేకుండా వైసిపి నేత శేఖర్‌రెడ్డికి అప్పజెప్పి మా పొట్ట కొట్టారు' అని లీజుదారులు, గ్రామస్తులు వాపోయారు. శేఖర్‌రెడ్డి 'వామన ఎంటర్‌ప్రైజెస్' ద్వారా దళిత లీజుదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. పేద రైతులు భూములు ఇవ్వాలని ఒత్తిడి చేసి బెదిరిస్తున్నారని వాపోయారు. నిలదీసిన 33 మంది రైతులపై అక్రమ కేసులు పెట్టారని, నిబంధనలకు మించి సిలికాను తవ్వడం వల్ల పంటకు నీరు, తాగునీరు దొరికే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే వాస్తవ లీజుదారులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. లోకేష్ వెంట మాజీ ఎమ్మెల్యే పి. సునీల్, మండల నాయకులు వెంకటేశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు. రాత్రి వరగలిలో బస చేయనున్నారు.

వచ్చే ఎన్నికల్లో గెలవాలి

- టిడిపి అధినేత చంద్రబాబు
- పార్టీలో చేరిన ఎస్‌సివి నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాబోయే ఎన్నికల్లో పులివెందులతో సహా అన్ని స్థానాల్లో టిడిపి గెలవాలని ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఆయన సమక్షంలో శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్‌సివి నాయుడు గురువారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన కంటే జగన్ వల్ల ఎక్కువ నష్టపోయామని విమర్శించారు. టెక్నాలజీతో భూములను 22-ఎలో పెడుతున్నారని, ఆస్తులు అమ్ముకోవాలన్నా వైసిపి ఎమ్మెల్యే అనుమతివ్వాలని అన్నారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు పూర్తిగా పడిపోయాయని అన్నారు. జాబ్ కేలండరు లేదని, ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ కళాశాలలన్నిటినీ నాశనం చేశారని విమర్శించారు. నాలెడ్జ్ ఇంగ్లీష్‌తోనే రాదని, చదువుతో పాటు వస్తుందని అన్నారు. తెలుగులో చదివిన సత్య నాదెళ్ల, తమిళంలో చదివిన సుందర్ పిచాయ్ ఉన్నత స్థానానికి వెళ్లారని వివరించారు. రాష్ట్రంలో నేరాలు, కబ్జాలు జరుగుతున్నా సిఎం జగన్ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అన్ని పెట్టుబడులనూ తరిమేశారని ఆరోపించారు. ఎనిమిదిసార్లు కరెంట్ ఛార్జీలు పెంచారన్నారు. అకాల వర్షాలు వస్తే కనీస సాయం చేయకుండా, పలకరించకుండా రైతు ప్రభుత్వం అంటారని విమర్శించారు. ఇసుక మొత్తం దోచేసి, పేదలకు ఉపాధి లేకుండా చేసి పేదల పక్షం అంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలపై కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. పవన్‌కళ్యాణ్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే.. అతనిపై దాడి

ఎస్‌సివి నాయుడుకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

చేస్తున్నారని విమర్శించారు. తన ఇంటిపక్కన ప్రజావేదిక కూల్చేసి నాలుగేళ్లు అయ్యిందని, ఇప్పటివరకు ఆ చెత్తను తీయలేదన్నారు.

ఓటర్ లిస్టులో అక్రమాలపై పోరాటం

ఓటర్ లిస్టులో అక్రమాలపై నిరంతరం అప్రమత్తంగా ఉండి పోరాటం చేయాలని పార్టీ నేతలకు చంద్రబాబు సూచించారు. ఓటర్ వెరిఫికేషన్‌పై రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడుతో కలిసి ఎన్నికల కమిటీ సభ్యులతో పార్టీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. టిడిపి అధికారంలోకి రాగానే ఎరుకుల కార్పొరేషన్ ఏర్పాటుచేసి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని చంద్రబాబు అన్నారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో ఏకలవ్యుడి జయంతిని నిర్వహించారు. ఆత్మ విశ్వాసంతో ఏదైనా సాధించవచ్చని ఏకలవ్యుడు నిరూపించాడని చంద్రబాబు అన్నారు.

దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న ఐద్వా కార్యకర్తలు

స్టీల్‌ప్లాంట్ రక్షణకు ఐక్య పోరాటం : ఐద్వా నేతలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకునేందుకు ముున్ముందు ఐక్య పోరాటాలు నిర్వహిస్తామని ఐద్వా విశాఖ జిల్లా కార్యదర్శి వై.సత్యవతి అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు గురువారానికి 819వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఐద్వా కార్యకర్తలు, మహిళలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆమె మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగా, 32 మంది ప్రాణ త్యాగంతో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటైందన్నారు. 22 వేల మంది రైతులు సుమారు 26 వేల ఎకరాల భూములను కారుచౌకగా స్టీల్‌ప్లాంట్‌కు ఇచ్చారన్నారు. నిర్వాసితుల్లో ఈనాటికీ 8,500 మందికి ఉపాధి లభించలేదని తెలిపారు. వారందరికీ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. దేశంలోని పలు ప్రభుత్వ, ప్రయివేటు స్టీల్ ప్లాంట్లకు సొంత గనులు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం.. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు మాత్రం ఎందుకు ఇవ్వదని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసే కుట్రలకు కేంద్ర ప్రభుత్వం పాల్పడితే రానున్న కాలంలో ప్రజలే తగిన బుద్ధిచెబుతారని హెచ్చరించారు. దీక్షల్లో సంఘం పెందుర్తి జోన్ కార్యదర్శి బి.రమణి, మద్దిలపాలెం జోన్ కార్యదర్శి కె.కుమారి, ఆరిలోవ జోన్ కార్యదర్శి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న అచ్యుతరావు, గడ్డెన్న

ప్రజాశక్తి ఉద్యోగి పవన్‌కు మాతృ వియోగం

ఆత్మకూరు : ప్రజాశక్తి హెడ్డాఫీస్‌లో అటెండర్ జి పవన్‌కుమార్ తల్లి గుర్రం లక్ష్మి (70) గురువారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆమెకు భర్త, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపతున్న లక్ష్మి ఆరోగ్యం క్షీణించడంతో బుధవారం గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆసపత్రిలో ఆమెను చేర్పించారు. ఐసియులో పెట్టినా ఫలితం లేకపోయింది. ఆమె అంత్యక్రియలు శుక్రవారం ఉదయం 11 గంటలకు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రజాశక్తి ఎడిటర్ బి తులసీదాస్ ఆమె మృతికి తన సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. ప్రజాశక్తి చీఫ్ జనరల్ మేనేజర్ వై అచ్యుతరావు, అసిస్టెంట్ ఎడిటర్ కె. గడ్డెన్న, హెచ్‌ఆర్ విభాగానికి చెందిన ఆర్ నాగరాజు, పి.రాము ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

మేనిఫెస్టో అమలుపై చర్చకు సిద్ధమా?

- సిఎంకు 'అచ్చెన్న' సవాల్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో సిఎం బహిరంగ చర్చకు సిద్ధమా? అని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు. జగన్ ప్రధానంగా 9 హామీలిచ్చి 40 అంశాలను పొందుపరిచారని, వాటిలో నాలుగేళ్లలో నేరవేర్చింది ఒక్క హామీనే అని చెప్పారు. 'ప్రకాశించని నవరత్నాలు,-జగన్ రెడ్డి మోసపు' హామీల ('పాలనలో రివర్స్ గేర్, పలుకుల్లోనూ రివర్స్ గేర్') వాస్తవ పత్రం పేరుతో టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో ఆ పార్టీ నేతలతో కలిసి గురువారం అచ్చెన్నాయుడు విడుదల చేశారు. పాదయాత్రలో 650కు పైగా హామీలిచ్చిన జగన్ వాటిలో 10 శాతం కూడా అమలు చేయలేదని ఆరోపించారు. టిడిపి ప్రభుత్వం 74 లక్షల సామాజిక పింఛన్లు ఇస్తే జగన్ 62 లక్షలు ఇచ్చారని పేర్కొన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్‌కు కోతపెట్టి 6 లక్షల మందికి ద్రోహం చేశారన్నారు. ఇరిగేషన్ రంగాన్ని, పోలవరాన్ని సర్వనాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్తీమద్యం విక్రయాలు జరుపుతున్న ప్రభుత్వంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మనీలాండరింగ్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య డిమాండ్ చేశారు. జగన్ ప్రభుత్వంలో ఉపాధి, ఉద్యోగాలు లేక యువత పూర్తిగా మద్యం, గంజాయి, డ్రగ్స్‌కు బానిసలైందని పొలిట్‌బ్యూరో సభ్యులు బోండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, దేవినేని ఉమామహేశ్వరరావు, నక్కా ఆనందబాబు, అశోక్‌బాబు, నసీర్ అహ్మద్, అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు.

చర్చిద్దాం రండి..

- టిడిపికి మంత్రి జోగి రమేష్ సూచన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 2014 నుంచి 2019 వరకు టిడిపి ప్రభుత్వం వున్నప్పుడు వారి పార్టీ మేనిఫెస్టో అమలు, వైసిపి మేనిఫెస్టో అమలుపై చర్చకు సిద్ధమా అని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ప్రశ్నించారు. కుప్పంలో చంద్రబాబైనా, టెక్కలిలో అచ్చెన్నాయుడైనా, అసెంబ్లీలోనైనా చర్చకు రావాలని పేర్కొన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ నాలుగేళ్ల కాలంలో 99 శాతం హామీలు అమలు చేసిందని తెలిపారు. చంద్రబాబు 2014లో మేనిఫెస్టోను అమలు చేయకపోవడం వల్లే 2019 ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. అమరావతిలోని జోన్-5లో తమ ప్రభుత్వం చేపట్టిన 50 వేల ఇళ్లల్లోకి త్వరలో ప్రజలు గృహ ప్రవేశాలు చేయబోతున్నారని అన్నారు. 2014లో టిడిపి మేనిఫెస్టోను అమలు చేయలేక చివరకు వెబ్‌సైట్ నుంచి తొలగించారని విమర్శించారు. దేశంలో ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ పథకాన్ని ఏ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయని రీతిలో జిపిఎస్‌ను తీసుకొచ్చి ఉద్యోగుల మెప్పు పొందామని తెలిపారు.

కృత్రిమ పద్ధతిలో మేలుజాతి ఆవుల వృద్ధికి చర్యలు

- సిఎస్ జవహర్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఐవిఎఫ్ సాంకేతిక విధానంలో మేలుజాతి ఆవుల సంతతిని వృద్ధి చేసి తద్వారా పాలు ఉత్పత్తిని మరింత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని పశు సంవర్ధకశాఖ అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు రాష్ట్రీయ గోకుల్ మిషన్‌కు రూ.73 కోట్లతో ప్రతిపాదనలను కేంద్రానికి పంపినట్లు తెలిపారు. విజయవాడలోని సిఎస్ క్యాంపు కార్యాలయంలో గురువారం పశుసంవర్ధకశాఖ అధికారులు, శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం అధికారులతో పాలవెల్లువ తదితర కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ.. అధిక పాల ఉత్పత్తిని ఇచ్చే సాహివాల్, ముర్రా, గిర్ తదితర మేలు జాతి ఆవుల పిండాలను సేకరించి ఐవిఎఫ్ టెక్నాలజీతో కృత్రిమ విధానంలో రాష్ట్రంలో మేలు జాతి ఆవుల సంతతిని మరింత వృద్ధి చేసేందుకు కృషి చేయాలన్నారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ ప్రాజెక్టు మంజూరైతే రాష్ట్రంలోని తిరుపతి, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో కృత్రిమ గర్భధారణ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ విధానంపై పాడి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పశుసంవర్ధకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, ఆర్థికశాఖ కార్యదర్శి సత్యనారాయణ, శ్రీవెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయం ఉప కులపతి వి పద్మనాభ రెడ్డి, డీన్ కె వీరబ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నీళ్లు లేవు.. ఉపాధి లేదు

- నిర్వాసిత గ్రామాలు, పునరావాస కాలనీల్లో దుర్భర పరిస్థితి
- ఆరు నెలల్లో సమస్యలు పరిష్కరించకపోతే గుణపాఠం తప్పదు
- రెడ్డిగణపవరం సభలో వి.శ్రీనివాసరావు

రెడ్డిగణపవరం సభలో మాట్లాడుతున్న వి. శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం

'ముంపు గ్రామాల్లో తిరిగాం.. పునరావాస కాలనీలను చూశాం.. తాగడానికి నీరు లేదు.. బతకడానికి ఉపాధి లేక పోలవరం నిర్వాసితులు దుర్భర జీవనాన్ని అనుభవిస్తున్నారు' అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలపై చేపట్టిన పోలవరం పోరుకేక పాదయాత్ర గురువారం పదో రోజు ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం కొరుటూరు పునరావాస కాలనీలో ప్రారంభమైంది. ములగలంపల్లి, రౌతుగూడెం, రెడ్డిగణపవరం మీదుగా బుట్టాయగూడెం వరకు సాగింది. ఈ సందర్భంగా రెడ్డిగణపవరంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ... పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించడం చేతకాకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గద్దె దిగిపోవాలని విమర్శించారు. నిర్వాసితులను బలవంతంగా తరలించడం దుర్మార్గమన్నారు. వసతులు లేని పునరావాస కాలనీల్లో నిర్వాసితులు దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు, విద్యుత్, రోడ్లు, డ్రెయినేజీ వంటి కనీస సౌకర్యాలు లేక తీవ్ర అవస్థలు పడుతున్న నిర్వాసితులకు కనీస చిరునామా కూడా కరువైందని తెలిపారు. కొందరు నిర్వాసితులు పునరావాస కాలనీలకు వచ్చినప్పటికీ గతంలో నివాసం ఉన్న గ్రామ చిరునామాతో ఉంటున్నారన్నారు. పోలవరం ప్రాజెక్టుకు కేటాయించిన ప్రతి పైసా ముందుగా నిర్వాసితులకే కేటాయించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టప్రకారం భూమికి భూమి, పరిహారం, నివాస ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించకపోతే తిరిగి తమ గ్రామాలకు వెళ్లిపోతామని నిర్వాసితులు చెప్పడం ప్రభుత్వాలకు చెంప పెట్టని అని అన్నారు. సమస్యలను వెల్లడిస్తే ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రేషన్ కార్డులు రద్దు చేస్తామని నీచమైన బెదిరింపులు చేయడం తగదన్నారు. 'నేను కన్నాను.. విన్నాను' అంటూ జగన్ చెబుతున్నారని, అయితే పోలవరం నిర్వాసితుల సమస్యలపై కళ్లుండి చూడని కబోదిలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నిర్వాసితులకు పూర్తిస్థాయి పరిహారం ఇస్తారో.. గోదావరిలో ముంచుతారో తేల్చాలని అన్నారు. కక్కలేక మింగలేక నిర్వాసితులు బాధపడుతున్నారని అన్నారు. సామాన్యులు చెబితే వినపడదా.. కాంట్రాక్టర్ల మాటలే వింటారా అని మండిపడ్డారు. నాలుగేళ్ల పాలనలో జగన్ నిర్వాసితుల గోడు పట్టించుకోలేదని, బిల్లులు రాక ఇళ్ల నిర్మాణం ఆగిపోయిందని అన్నారు. వేల కోట్ల పోలవరం నిధులు ఎవరి జేబుల్లోకి వెళుతున్నాయో చెప్పాలని ప్రశ్నించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అంబానీ, అదాని భజన చేస్తూ నిర్వాసితుల సమస్యలను పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఇచ్చిన మాట కోసం అడవులకు వెళ్లిన రాముడు పుట్టిన గడ్డపై ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని హితవు పలికారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో 26 జిల్లాల ప్రజలకు మేలు చేయడానికి లక్షా ఆరువేల మంది నిర్వాసిత కుటుంబాలు సర్వం కోల్పోయాయని తెలిపారు. గతేడాది గోదావరి వరదలకు 196 గ్రామాలు మునిగిపోతే కేవలం 36 గ్రామాలకు వరద ముంపు ఉందని కాకి లెక్కలు చెబుతున్న ప్రభుత్వానికి సరైన బుద్ధి చెప్పాలన్నారు. నిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ అవసరమైతే ప్రాజెక్టు నిర్మాణం ఆపాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు నిర్మాణ డిజైన్లను మారుస్తూ వేల కోట్లు ఖర్చు చూపుతున్న ప్రభుత్వాలకు సిగ్గులేదన్నారు. కాంటూరు, డ్యామ్ డిజైన్లు అన్నీ పనికిమాలిన చెత్తగా అభివర్ణించారు. ముంపునకు గురైన నిర్వాసితులకు రూ.పది వేలు పరిహారం చెల్లిస్తానని మాట ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్ మాట తప్పారని ఎద్దేవా చేశారు. భూమికి భూమి ఇవ్వాల్సిన ప్రభుత్వం వివాదాస్పద భూములను నిర్వాసితులకు కట్టబెట్టి వారి జీవితాలతో ఆటలాడుతున్నారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను దుయ్యబట్టారు. భూములకు రూ.5 లక్షల పరిహారం చెల్లిస్తామని మాట తప్పారన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్రం చేస్తున్న కుట్రను తిప్పి కొట్టాలని నిర్వాసితులకు సూచించారు. నిర్వాసిత కాలనీలో ఉపాధి లేక దిక్కుతోచని స్థితిలో కాలం గడుపుతున్నారని అన్నారు. మోడీ ఉపాధి చట్టాన్ని తీసివేస్తే ప్రజలు ఇంటికి పంపుతారని హెచ్చరించారు. రాజకీయాలకు అతీతంగా నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం సిపిఎం చేపట్టిన పోరుకేక మహాపాదయాత్రకు అన్ని రాజకీయ పార్టీలు సంఘీభావం తెలుపుతున్నాయన్నారు. అధికారం కోసమో.. రాజకీయ లబ్ధి కోసమో కాకుండా ప్రజల ప్రయోజనాల కోసం చేపడుతున్న సిపిఎం పాదయాత్రను జయప్రదం చేయాలని అన్నారు. జులై 4న నిర్వాసితుల సమస్యలపై నిర్వాసితులంతా విజయవాడ తరలిరావాలని పిలుపునిచ్చారు. 95 శాతం హామీలు పూర్తి చేసినట్లు జగన్ చెబుతున్నారని, నిర్వాసితులకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ పూర్తి చేయలేదని అన్నారు. ఈ ఆరు నెలల్లో హామీల అమలు పూర్తి చేయకపోతే జగన్ ఇంటిదారి పట్టాల్సిందే అన్నారు. ఈ సభకు తెల్లం రామకృష్ణ అధ్యక్షత వహించగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు విక్రమ్‌సింగ్, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, కె.సుబ్బరావమ్మ, సిపిఎం నాయకులు బి.బలరాం, ఎ.రవి, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వై.రాము, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు పి.మంగరాజు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు ప్రసన్నకుమార్, మొడియం నాగమణి, వాణిశ్రీ, పిల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిద్రపోతున్న ప్రభుత్వాల మెడలు వంచాలి

- నిర్వాసితుల ఖర్చుపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- పలువురు నేతల డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం

పోలవరం నిర్వాసితుల సమస్యలపై మొద్దు నిద్రలో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచాలని, నిర్వాసితుల ఖర్చుపై శ్వేతపత్రం విడుదల చేయాలని పలువురు నేతలు డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన పోలవరం నిర్వాసితుల పోరు కేక పాదయాత్రకు టిడిపి నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ములగలంపల్లి వద్ద నిర్వహించిన సభలో టిడిపి పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో సర్వం కోల్పోయిన నిర్వాసితులకు పరిహారం పూర్తిస్థాయిలో అందించాలన్నారు. గతేడాది గోదావరి వరదల్లో సర్వం కోల్పోయిన నిర్వాసితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో వైసిపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు కళ్లు తెరిచి నిర్వాసితుల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని అన్నారు ఈ క్రమంలో రాజకీయాలకు అతీతంగా పోలవరం పోరుకేక పేరిట సిపిఎం చేపట్టిన పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్నామని అన్నారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారంలో టిడిపి తరఫున ఏ సహకారానికైనా ముందుంటామని బొరగం శ్రీనివాస్ తెలిపారు.

అంతా నిర్వాసితులకు అండగా నిలబడితేనే ఫలితం : సీతారాం

రెడ్డి గణపవరం ఉద్యమాల పురిటిగడ్డ అని, 1995లో ఇక్కడ ఆదివాసీల పోరాటం పెద్దఎత్తున సాగిందని సీతారాం తెలిపారు. కొమరం బాబూరావు, గౌరమ్మ వంటి ఉద్యమకారులు పుట్టిన గడ్డ అన్నారు. పోలవరం నిర్వాసితులు ఇప్పుడు ఈ ప్రాంతంలో ఉంటున్నారని, మనమంతా అండగా నిలబడితేనే ఫలితం వస్తుందన్నారు. గత ఉద్యమాల చరిత్రను అంతా గుర్తు తెచ్చుకోవాలన్నారు. పోరాటం తీవ్రతరమైతే పోలీసులు, ప్రభుత్వాలు తోక ముడుస్తాయన్నారు.

నిర్వాసితుల సమస్యలపై బిజెపిని నిలదీయాలి : వి.వెంకటేశ్వర్లు

పోలవరం నిర్వాసితుల సమస్యలపై రాష్ట్రంలో రాజకీయ పార్టీలన్నీ బిజెపి ప్రభుత్వాన్ని నిలదీయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం జీలుగుమిల్లి మండలం ములగలంపల్లిలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సిపిఎం మహా పాదయాత్రకు ప్రత్యేకత ఉందని తెలిపారు. 2013 భూ సేకరణ చట్టప్రకారం భూమికి భూమి, ఉపాధి అవకాశాలు, 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం, ఇళ్ల నిర్మాణం మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఇవేమీ లేకుండా నిర్వాసితులను గోదావరిలో ముంచేయాలని కేంద్రంలో బిజెపి రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడం దారుణం అన్నారు.

నిర్వాసితుల ఖర్చుపై శ్వేతపత్రం విడుదల చేయాలి : ధనలక్ష్మి

ఇప్పటివరకు పోలవరం నిర్వాసితులకు చేసిన ఖర్చుపై ప్రభుత్వం శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. పోలవరం పోరుకేక యాత్రలో భాగంగా పదోరోజు గురువారం ఆశావర్కర్స్ యూనియన్ సంఘీభావం తెలిపేందుకు జీలుగుమిల్లి మండలం ములంగలంపల్లి తరలివచ్చారు. ఈ పాదయాత్రలో కె.ధనలక్ష్మితో పాటు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.పోశమ్మ, రాష్ట్ర కోశాధికారి ఎ.కమల, పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి పి.జ్యోతి, నాయకులు కుమారి పాల్గొని పాదయాత్రలో నడిచారు. ఈ సందర్భంగా రెడ్డిగణపవరంలో జరిగిన సభలో ధనలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం నిర్వాసితుల సమస్యలపై స్పందించాలన్నారు. పోలవరం బాధ్యత కేంద్రానిది అంటూ మోడీ చెప్పారని, నిర్వాసితుల సమస్యలు కూడా అందులో అంతర్భాగమేనని అన్నారు.

పోలవరం పోరుకేక మహాపాదయాత్రకు స్వాగతం పలుకుతున్న టిడిపి పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్

పాదయాత్రకు వెల్లువెత్తిన మద్దతు

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కరమే ప్రధాన ఎజెండగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వంలో సాగుతున్న పోలవరం పోరుకేక పాదయాత్రకు పెద్దఎత్తున సంఘీభావం వెల్లువెత్తుతుంది. పదోరోజు గురువారం సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దాదాపు 50 మంది పాదయాత్రకు సంఘీభావంగా తరలివచ్చారు. విశాఖపట్నం నుంచి సిఐటియుకు చెందిన గిరిజన ఉద్యోగుల సంఘం, గిరిజన సంఘం నాయకులు సంఘీభావంగా తరలివచ్చారు. బుట్టాయగూడెం మండలంలోని రెడ్డి గణపవరం చేరుకున్న పాదయాత్రకు జనసేన మండల అధ్యక్షులు తెల్లం రవిప్రకాష్, గురజాల వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్, వెంకటవరప్రసాద్, సురేష్‌బాబు, కూనం రాజా, తెల్లం పున్నయ్య, ముత్యాలరావు, జోగిరాజు, సురేష్ తదితరులు ఘనస్వాగతం పలికారు.

అభివాదం చేస్తున్న కవులు, రచయితలు

కవులు, కళాకారులు నిర్వాసితుల గోడు వినిపించాలి

- సాహితీ స్రవంతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యరంజన్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్ (ఏలూరు జిల్లా)

పోలవరం నిర్వాసితులకు కవులు, రచయితలు, కళాకారులు అండగా నిలబడి వారి సమస్యలను కవితలు, పాటల ద్వారా ప్రభుత్వాలకు వినిపించే విధంగా కృషి చేయాలని సాహితీ స్రవంతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యరంజన్ అన్నారు. సాహితీ స్రవంతి, జిల్లా రచయితల సంఘం సంయుక్తంగా పోలవరం నిర్వాసితులకు సంఘీభావంగా జనకవనం (జనం కోసం సాహిత్యం) కార్యక్రమాన్ని ఏలూరులోని సిఐటియు కార్యాలయంలో సాహితీవేత్త డాక్టర్ లంకా వెంకటేశ్వర్లు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యరంజన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పక్షాన కవులు, కళాకారులు నిలబడి వారికి మద్దతుగా కవితలు, పాటలు వినిపించడం అభినందనీయమన్నారు. జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి నాగాస్త్ర మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు వల్ల ఒకపక్క అభివృద్ధి జరుగుతుందన్న విషయం ఎంత నిజమో మరో పక్క గిరిజనుల సంస్కృతి, నాగరికత, అస్థిత్వం నాశనమవుతున్నాయన్నదీ అంతే నిజమన్నారు. పోలవరంలో లక్షలాది గిరిజనుల త్యాగాలున్నాయని, కనీసం వారు ఉండటానికి చోటు ఇవ్వడం, వారికి భూమి, నష్టపరిహారం కల్పించడం సహజ న్యాయమని తెలిపారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాల్సిందే

- ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకునేందుకు ఐక్య ఉద్యమం
- ఫ్యాప్టో చైర్మన్ నక్కా వెంకటేశ్వర్లు

విద్యా సదస్సులో మాట్లాడుతున్న ఫ్యాప్టో రాష్ట్ర చైర్మన్ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాల్సిందేనని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఫ్యాప్టోరాష్ట్ర చైర్మన్ ఎన్ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. జిఒ 117 వల్ల ప్రభుత్వ పాఠశాలలు మూత పడనున్నాయని, వాటిని కాపాడుకునేందుకు అందరూ ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో గురువారం జిల్లా చైర్మన్ ఉమామహేశ్వరరావు అధ్యక్షతన విజయనగరం ఎన్‌జిఒ హోంలో జిల్లా విద్యా సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిఒ నెంబర్ 117 వల్ల ప్రభుత్వ పాఠశాలలు మూతపడితే ఎస్‌జిటి పోస్టులు రద్దయ్యే అవకాశాలు ఉన్నాయని, కావున ఈ జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బోధనేతర పనులనుంచి మినహాయింపు ఇస్తామని హామీ ఇచ్చినా అమలు చేయలేదన్నారు. ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. 12వ పిఆర్ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించాలని కోరారు. గతంలో 11వ పిఆర్‌సికి చట్టబద్ధత లేకపోవడం వల్ల ప్రభుత్వం ఇష్టానుసారమైన నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కోసం, విద్యా రంగాన్ని కాపాడు కునేందుకు ఉపాధ్యాయులు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఉద్యోగులకు ఇచే పెన్షన్ విషయంలో జిపిఎస్ పేరుతో మళ్లీ మోసం చేయాలని చూస్తోందని అన్నారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాశ్ వైఖరి మార్చుకోవాలన్నారు. సదస్సులో అనంతరం భాగస్వామ్య సంఘాల రాష్ట్ర నాయకులు భానుమూర్తి (ఎపిటిఎఫ్ 257), గణపతి (ఆప్టా), సదాశివరావు (ఎపిటిఎఫ్ 1938), జోగారావు (ఎస్‌టియు), డి.రాము (యుటిఎఫ్), ఫ్యాప్టో జిల్లా సెక్రటరీ జనరల్ వెంకట రమణ, డిప్యూటీ సెక్రటరీలు రమేశ్ చంద్ర పట్నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోల్ ఇండియాతోనే ధరల స్థిరత్వం

- పిఎస్‌యుగానే కొనసాగించాలి
- ఛైర్మన్ ప్రమోద్ అగర్వాల్ వెల్లడి

న్యూఢిల్లీ : కోల్ ఇండియాను ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగించాలని ఆ కంపెనీ ఛైర్మన్ ప్రమోద్ అగర్వాల్ అన్నారు. భవిష్యత్తులోనూ బొగ్గు ధరల్లో స్థిరత్వం ఉండాలంటే కోల్ ఇండియా లిమిటెడ్ (సిఐఎల్) పిఎస్‌యుగానే ఉండాలని ఆయన ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. తద్వారా భవిష్యత్తులో బొగ్గు ధరల కోసం ప్రత్యామ్నాయ పద్ధతి అందుబాటులో ఉంటుందన్నారు. జూన్ 30న (నేటి)తో ఆయన పదవీకాలం ముగియనుంది. ప్రభుత్వ యాజమాన్యంలోని సంస్థగా, బొగ్గు ఉత్పత్తి ప్రయోజనాలను ప్రజలకు పంపిణీ చేసే బాధ్యత కోల్ ఇండియాపైనే ఉందన్నారు. సిఐఎల్ ఇంధన రంగానికి పర్యాయపదంగా ఉందన్నారు. ప్రస్తుతం సంస్థ బలంగా, స్థిరంగా ఉందన్నారు. "గత సంవత్సరం అంతర్జాతీయంగా బొగ్గు ధరల్లో తీవ్రమైన ధరల పెరుగుదలను చూశాము. అటువంటి పరిస్థితిలో ప్రయివేటు కంపెనీలు కూడా తమ ధరలను పెంచేవి. అయితే, కోల్ ఇండియా వంటి పిఎస్‌యుకు అలాంటి పరిస్థితి వచ్చే అవకాశం లేదు" అని అగర్వాల్ అన్నారు.

ఇటీవల మోడీ సర్కార్ కోల్ ఇండియాలో 3 శాతం వాటాను ప్రయివేటు శక్తులకు విక్రయించడం ద్వారా రూ.4,185 కోట్లు తన ఖాజానాలో వేసుకుంది. దీంతో సిఐఎల్‌లో ప్రభుత్వ వాటా 63.1 శాతానికి తగ్గింది. 2022-23 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-సెప్టెంబర్ మధ్య కాలంలో దిగుమతి చేసుకున్న బొగ్గు టన్నుకు సగటు ధర రూ.19,324గా ఉండగా.. అదే సమయంలో దేశీయ బొగ్గు టన్ను సగటు ధర కేవలం రూ.2,662గా ఉంది. దీంతో పోల్చితే విదేశీ, ప్రయివేటు బొగ్గు ధర ఎంత భారీ స్థాయిలో ఉందో స్పష్టం అవుతోంది. బొగ్గు ధర పెరిగితే విద్యుత్, అనేక లోహాల ధరలు అమాంతం పెరగనున్నాయి. దీంతో ద్రవ్యోల్బణం ఎగిసిపడటంతో ప్రజల కొనుగోలు, పొదుపు శక్తి పడిపోనుంది. అది ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపనుంది. 2019-20 నుండి మూడేళ్లలో అగర్వాల్ నాయకత్వంలో కోల్ ఇండియా ఉత్పత్తి 101 మిలియన్ టన్నులు, 113 మిలియన్ టన్నులు పెరిగాయి, అదే సమయంలో విద్యుత్ రంగానికి సరఫరాలు 121 మిలియన్ టన్నులు పెరిగాయి. 2022-23లో కోల్ ఇండియా లాభాలు, నికర అమ్మకాలతో పాటుగా మూడు పారామీటర్‌లు వాటి అత్యధిక స్థాయికి చేరుకోవడంలో తనవంతు ప్రయత్నం చేశానని అగర్వాల్ పేర్కొన్నారు. దేశంలోని మొత్తం బొగ్గు ఉత్పత్తిలో దాదాపు 80 శాతం కోల్ ఇండియేదే కావడం విశేషం. కోల్ ఇండియా సామర్థ్యాన్ని మెరుగుపరుచుకోవడంతో ఆత్మవిశ్వాసంతో పోటీని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని అగర్వాల్ పేర్కొన్నారు.

పోలవరం ప్రాజెక్టు భద్రతపై వాస్తవాలు చెప్పాలి

ఉపయాత్రలో నేతలు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు వాస్తవాలు చెప్పాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై సిపిఎం చేపట్టిన 'పోలవరం పోరుకేక' ఉపయాత్ర రెండో రోజు గురువారం ఉత్సాహంగా సాగింది. ఏలూరు జిల్లా పోలవరం మండలంలోని కోండ్రుకోట పునరావాస కాలనీ నుండి ప్రారంభమైన యాత్రకు గిరిజనులు సాంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. ఎల్ఎన్‌డిపేట మీదుగాకొయ్యలగూడెం, బుట్టాయగూడెం మండలాల మీదుగా... బుట్టాయగూడెంలో నెల్లిపాక నుంచి ప్రారంభమైన మహాపాదయాత్రలో కలిసింది. కోండ్రుకోట పునరావాస గ్రామం, ఎల్ఎన్‌డి పేట, కన్నాపురం తదితర గ్రామాల్లో జరిగిన సభలో సిపిఎం మండల కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు అధ్యక్షతన సభలు జరిగాయి సభలో జిల్లా నేతలు కె.శ్రీనివాస్, తామా ముత్యాలమ్మ మాట్లాడారు. బుట్టాయగూడెం మండలం రేగులకుంట గ్రామం లో జరిగిన సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుత..ా పోలవరం నిర్వాసితుల సమస్యలపై పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రశ్నించేవారిపై దాడులు హేయం

- పౌర ప్రజా సంఘాల నేతలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ప్రశ్నించేవారిపై ఆర్ఎస్ఎస్, బిజెపి విద్వేషమూకలు చేస్తోన్న బెదిరింపులను ఖండించాలని, అందుకు బాధ్యులైన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ పౌర ప్రజా సంఘాల నేతలు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నేతలు మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై, బిజెపి మతోన్మాద పోకడలపై నిరంతరం ప్రశ్నిస్తున్న భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్‌పై కాల్పులకు, స్వతంత్ర జర్నలిస్టు తులసీ చందుపై బెదిరింపులకు దిగడం హేయమైన చర్య అన్నారు. మోడీ హయాంలో దేశ ప్రజలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రశ్నించేవారిని చంపుతామనే స్థాయికి మతోన్మాద శక్తులు వెళ్లడం ఆందోళనకర విషయమని తెలిపారు. అజాద్‌పై ఈ నెల 28న మతోన్మాద శక్తులు దాడికి తెగబడటాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో పిఒడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, పౌర ప్రజా సంఘాల కన్వీనర్ పి.చంద్రశేఖర్, సిఆర్‌పిపి నాయకులు కె.పద్మ, ఐఎఫ్‌టియు నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, సిపిఎస్ నాయకులు డి.లలిత, మహిళా సమాఖ్య నాయకులు ఎ.విమల, డిటిఎఫ్ నాయకులు కెఎస్.రాజు పాల్గొన్నారు.

అశోక్‌బాబూ మా ఇంటికి రావొద్దు

- నిరసన తెలిపిన మిట్టపాలెం గ్రామస్తులు

ప్రజాశక్తి-కొండపి (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లా కొండపి మండలంలోని మిట్టపాలెం గ్రామంలో వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. మిట్టపాలెంలో టిడిపి కోవర్టుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసిపి నేత గ్రూపుతో వరికూటి అశోక్‌బాబు గడపగడపకూ.. కార్యక్రమాన్ని నిర్వహించారు. 'అశోక్‌బాబు మా ఇంటి రావొద్దు.. జగనే మాకు ముద్దు' అంటూ.. వాల్‌పోస్టర్లతో గ్రామానికి చెందిన సీనియర్ వైసిపి నేతలు నిరసన కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని ఎస్‌సి కాలనీలో కార్యక్రమం నిర్వహిస్తుండగా కాలనీవాసులు నుంచి అశోక్‌బాబుకు తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. గ్రామానికి చెందిన తమ నాయకుడు లేకుండా టిడిపి కోవర్టులతో కార్యక్రమం నిర్వహించడం సరైన చర్య కాదని నిలదీశారు. తమకు సమాధానం చెప్పి తమ నాయకుడి సమక్షంలోనే ఈ కార్యక్రమం నిర్వహించాలని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనను టివి 5 ప్రతినిధి చిత్రీకరించే క్రమంలో అశోక్‌బాబు అనుచరులు గొడవకు దిగారు. అతని నుంచి వీడియో తీస్తున్న సెల్‌ఫోన్‌ను లాక్కున్నారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో పోలీసులు రెండు గ్రూపులనూ చెదరగొట్టారు.

వైసిపి గృహ సారథి దారుణ హత్య

- కోడుమూరు ఎమ్మెల్యేకు అనుచరుడు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అనుచరుడు, వైసిపి గృహ సారధి ఆంజనేయులు గౌడ్ (35) బుధవారం రాత్రి ఎదురూరు గ్రామ పొలాల్లో దారుణ హత్యకు గురయ్యారు. కుటుంబ సభ్యులకు గురువారం ఉదయం స్థానికులు సమాచారం అందజేయడంతో ఈ దారుణం బయటపడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కర్నూలు తాలూకా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. కర్నూలు మండలం ఎదురు గ్రామానికి చెందిన ఈడిగ ఆంజనేయులు గౌడ్ (35) గురువారం తన సొంత పొలానికి వెళ్ళాడు. ఎంతసేపటికి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు బంధువుల ఇళ్ల వద్ద ఆరా తీశారు. మరుసటి రోజు ఉదయం పొలం వైపు వెళ్లిన గ్రామస్తులకు ముళ్లపొదల్లో ఆంజనేయులు శవమై కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని చుట్టుపక్కల పరిసరాలను పరిశీలించారు. వివాహేతర సంబంధమే ఈ హత్యకు దారి తీసి ఉండవచ్చని గ్రామంలో పలువురు చర్చించుకుంటున్నారు. మృతుని కుటుంబ సభ్యులను కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్ పరామర్శించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని పోలీసులను ఆదేశించారు.

రెట్టింపైన క్రెడిట్ కార్డ్‌ల ఎన్‌పిఎలు

- 18 శాతానికి చేరిన నిరర్థక ఆస్తులు
- చెల్లింపుల్లో భారీగా విఫలం • ఆర్‌బిఐ వెల్లడి



న్యూఢిల్లీ : క్రెడిట్ కార్డ్‌లపై ఆధారపడే సంస్కృతి బాగా పెరిగింది. బ్యాంక్‌లు కూడా అడగ్గానే క్రెడిట్ కార్డ్‌లను జారీ చేస్తున్నాయి. తీరా వాడుకున్న తర్వాత ఆదాయాలు లేక, అధిక వడ్డీ రేట్ల బెంబేలుతో అనేక మంది తిరిగి చెల్లించలేకపోతున్నారు. దీంతో క్రెడిట్ కార్డ్‌ల నిరర్థక ఆస్తులు భారీగా పేరుకుపోతున్నాయి. ఈ రంగంలో కేవలం ఒక్క ఏడాదిలోనే రెట్టింపు ఎన్‌పిఎలు నమోదు కావడం ఆందోళకరం. 2022-23 ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి ప్రభుత్వ రంగ బ్యాంకుల క్రెడిట్ కార్డ్ ఎన్‌పిఎలు 18 శాతానికి ఎగిశాయని ఆర్‌బిఐ గణంకాలు వెల్లడించాయి. గతేడాది ఇదే కాలంలో దాదాపు 9 శాతంగా ఉంది. 2022 సెప్టెంబర్ నాటికి 15 శాతంగా నమోదయ్యాయి. ఈ వివరాలను ఆర్‌బిఐ తన ఆరు మాసాల ఆర్థిక స్థిరత్వ నివేదికలో వెల్లడించింది.

క్రెడిట్ కార్డ్‌లు, వ్యక్తిగత రుణాలు, మైక్రోఫైనాన్స్ సహా అసురక్షిత రుణాలపై ఆర్‌బిఐ గణంకాలు హెచ్చరికలను జారీ చేశాయి. మరోవైపు ప్రయివేటు రంగ బ్యాంక్‌ల క్రెడిట్ కార్డ్‌ల ఎన్‌పిఎలు యథాతథంగా 1.9 శాతంగా, విదేశీ బ్యాంక్‌ల కార్డ్‌ల ఎన్‌పిఎలు 1.8 శాతంగా చోటు చేసుకున్నాయి. భారత బ్యాంకింగ్ వ్యవస్థలో 2023 మార్చి ముగింపు నాటికి మొత్తం ఎన్‌పిఎలు 3.9 శాతం తగ్గి.. పదేళ్ల కనిష్ట స్థాయి వద్ద నమోదయ్యాయి. 2024 మార్చి ముగింపు నాటికి 3.6 శాతానికి తగ్గొచ్చని అంచనా. అధిక ద్రవ్యోల్బణం, రుణ ఖర్చులు పెరగడం వల్ల కుటుంబాల ఆర్థిక స్థితి, వారి రుణాల చెల్లింపు సామర్థ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆర్‌బిఐ విశ్లేషించింది. ఇది రుణాలు ఇచ్చే బ్యాంకులపై ఒత్తిడి పెంచనుందని పేర్కొంది.

ఫారం G

గుంటూరు వద్ద ఐరన్ అండ్ స్టీల్ ఇండస్ట్రీలో సాయిభాస్కర్ ఐరన్స్ లిమిటెడ్ ఆపరేటింగ్ కొరకు ఆసక్తి వ్యక్తీకరణకు ఆహ్వానం

(ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఇన్‌సాల్వెన్సీ రిజొల్యూషన్ ప్రాసెస్ ఫర్ కార్పొరేట్ పర్సన్స్) రెగ్యులేషన్స్, 2016 యొక్క రెగ్యులేషన్ 36ఏ(1) క్రింద)

సంబంధిత వివరాలు

1.	కార్పొరేట్ డెటార్ పేరు	సాయి భాస్కర్ ఐరన్స్ లిమిటెడ్ (CIN - U27100TG2007PLC056809)
2.	రిజిష్టర్డు ఆఫీసు చిరునామా	ప్లాట్ నెం.73, లేన్ నెం.5, రోడ్ నెం.72, ప్రశాసన్ నగర్, ఆంధ్రాబ్యాంక్ దగ్గర, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500086
3.	వెబ్‌సైట్ యొక్క యూఆర్‌ఎల్	www.saibhaskarironslimited.in
4.	స్థిర ఆస్తులు మెజారిటీ ఉన్న స్థలం వివరాలు	నాగరాజుపల్లి గ్రామం, మర్తూరు మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్ర ప్రదేశ్.
5.	ప్రధాన ఉత్పత్తులు/ సర్వీసుల ఇన్‌స్టాల్‌చేసిన సామర్థ్యం	వర్తించదు
6.	గత చివరి సంవత్సరంలో విక్రయించిన ప్రధాన ఉత్పత్తులు/ సర్వీసుల పరిమాణం & విలువ	గత ఆర్థిక సంవత్సరంలో ఏలాంటి ఉత్పత్తులు/సర్వీసులు విక్రయించలేదు.
7.	ఉదోగ్యులు/ కార్మికుల సంఖ్య	ఎంప్లాయిలు/ వర్క్‌మెన్ లేరు
8.	రెండు సంవత్సరాల చివరిగా అందుబాటులోగల ఆర్థిక నివేదికలు(షెడ్యూళ్లతో)సహామరిన్ని వివరాలు, రుణదాతల జాబితా, ప్రక్రియ యొక్క తదుపరి ఈవెంట్లకు సంబంధిత తేది ఇక్క లభించును.	www.saibhaskarironslimited.in
9.	కోడ్‌లోని సెక్షన్ 25(2) (హెచ్) క్రింద రిజొల్యూషన్ దరఖాస్తులకు అర్హత ఇక్కడ లభించును	ఐబిబిఐ వెబ్‌సైట్: ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఇన్‌సాల్వెన్సీ రిజొల్యూషన్ ప్రాసెస్ ఫర్ కార్పొరేట్ పర్సన్స్) రెగ్యులేషన్స్, 2016.
10.	ఆసక్తి వ్యక్తీకరణకు స్వీకరణకు చివరి తేది	15-07-2023
11.	నిర్ణీత రిజొల్యూషన్ దరఖాస్తుదారుల ప్రొవిజినల్ జాబితా జారీ తేది	25-07-2023
12.	ప్రొవిజినల్ లిస్ట్ అభ్యంతరాలను సమర్పించుటకు చివరి తేది	30-07-2023
13.	ఇఓఐ సమర్పించుటకు ప్రాసెస్ ఇమెయిల్ ఐడి	cirp.sbil@gmail.com

డా.కొండపల్లి వెంకట్ శ్రీనివాస్
Reg. No. IBBI/IPA-001/IP-P00520/2017-18/10945
ఏఎఫ్ఏ 19 డిసెంబర్, 2023 వరకు చెల్లుబాటు
402, 4వ అంతస్తు, 6-3-249/6, అల్మాజర్ ప్లాజా & టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-500034
మెసర్స్ సాయిభాస్కర్ ఐరన్స్ లిమిటెడ్ కొరకు రిజొల్యూషన్ ప్రొఫెషనల్

తేది: 30-06-2023
ప్రదేశం: హైదరాబాద్

సంపాదకీయం

సేద్యంపై సమ్మెట!

ఎరువుల విధానం, చెరకు ధర విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు సేద్యానికి సమ్మెట పోటుగా ఉన్నాయి. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువుల (బయో ఫెర్టిలైజర్స్) వైపు మళ్లించడమే లక్ష్యంగా కేంద్ర మంత్రివర్గం బుధవారంనాటి సమావేశంలో కొత్త విధానానికి ఆమోదముద్ర వేసింది. రసాయనిక ఎరువుల వాడకానికి బదులు సేంద్రీయ ఎరువులను వాడడం వల్ల శ్రీలంకలో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పడిపోయి తీవ్ర ఆహార సంక్షోభంలో ఎలా చిక్కుకున్నదీ జగమెరిగినదే! విఫలమైన ఆ విధానాన్నే మోడీ ప్రభుత్వం దేశంలో అమలు చేయడానికి ఆతృత ప్రదర్శించడం ప్రమాదకరం. భూమాతను రసాయనిక కాలుష్యం బారి నుండి కాపాడవచ్చని, పంటల్లో పోషక విలువలు పెరుగుతాయని సర్కారు సెలవిస్తోంది కానీ ఆహార భద్రతకు ఏర్పడే ముప్పును గమనించడం లేదు. పాలకుల అసలు లక్ష్యం ఎరువుల సబ్సిడీని తగ్గించుకోవాలన్నదే! రైతుల కోసం మూడేళ్లలో రూ.3,70,128 కోట్లతో ప్రత్యేక ప్యాకేజీని ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సిసిఇఎ) ఆమోదించిందని మంత్రులు ప్రకటించారు. భారీగా చెప్పిన ఈ మొత్తంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఖర్చు చేసిన మొత్తాన్ని కూడా కలిపి చెప్పారంటే రైతాంగాన్ని, దేశ ప్రజలను సర్కారు ఎంతలా బురిడీ కొట్టిస్తోందో విదితమవుతోంది.

కేంద్ర ప్రభుత్వం టన్ను చెరకుకు ఫెయిర్ రెమ్యూనరేటివ్ ప్రైస్ (ఎఫ్ఆర్‌పి) కేవలం రూ.3150 గా ప్రకటించడం చెరకు రైతుకు మళ్లీ మొండిచెయ్యి చూపడమే. చెరకు పంటకు అవసరమైన అన్ని ఇన్‌పుట్స్ ధరలు పెరిగిన నేపథ్యంలో ఈ ఏడాది టన్నుకు రూ.100 మాత్రమే పెంచడం రైతులను వంచించడమే! దేశవ్యాప్తంగా ఐదు కోట్ల మంది చెరకు రైతులు, మరింతమంది వ్యవసాయ కార్మికులు, కౌలుదార్లు ఈ నిర్ణయంవల్ల తీవ్రంగా నష్టపోతారు. బేసిక్ రికవరీ రేటు 10.25 శాతంగా నిర్ణయించడమూ దారుణం. సరళీకరణ విధానాలు రాకముందు కనీస రికవరీ శాతం 8.5 శాతంగా ఉన్నదాన్ని తొలుత 9.5 శాతానికి, 2018-19లో 10 శాతానికి, గత ఏడాది 10.25 శాతానికీ పెంచారు. కనీస రికవరీని పెంచడం ద్వారా కూడా రైతుకు చెల్లించవలసిన సొమ్ముకు కోత పడుతోంది. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పంట ఉత్పత్తికి అయ్యే మొత్తం ఖర్చు (సి2) కు మరో 50 శాతం అదనంగా వచ్చే విధంగా మద్దతు ధరల్ని ప్రకటిస్తామని చెప్పిన బిజెపి చెరకు రైతును నిలువునా మోసగించింది. మరోవైపున చక్కెర పరిశ్రమాధిపతులకు మాత్రం ప్రోత్సాహకాల పేరిట సర్కారు ఖజానాను దోచిపెడుతోంది. ఆధునీకరణకు వడ్డీ లేని రుణం మొదలు ఇథనాల్ తయారీ అమ్మకాల్లో భారీ రాయితీలిస్తోంది. చక్కెర విధానం కూడా దేశ విదేశీ కార్పొరేట్లకు అనుకూలంగానే ఉంటోంది. కాకుల్ని కొట్టి గద్దలకు వేయడమంటే ఇదే కదా!

మోడీ సర్కారు అనుసరిస్తున్న విధానాల మూలంగా ఏడాదికేడాది చెరకు సాగు తగ్గిపోతూ వస్తోంది. చక్కెర ఉత్పత్తి కూడా తగ్గి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. రైతుకు గిట్టుబాటయ్యేలా ధర నిర్ణయించడం తొలి చర్యగా ఉండాలి. అతిగా రసాయనిక ఎరువుల వాడకంవల్ల కలిగే నష్టాలను రైతాంగానికి వివరించి, ఆయా భూముల స్వభావం, పంటల సరళికి అనుగుణంగా ఎరువుల వినియోగం, మరోవైపు భూసారాన్ని కాపాడేందుకు పచ్చిరొట్ట ఎరువులు, పంటల మార్పిడి వంటివాటిని శాస్త్రీయ పద్ధతుల్లో అమలు చేసేలా రైతులను విజ్ఞానవంతుల్ని చేయాలి. సమగ్రమైన ప్రణాళికాబద్ధమైన వ్యవసాయ విధానం, పంటల సరళి, సస్యరక్షణ, మార్కెటింగ్ వంటివాటిని సన్న చిన్నకారు రైతాంగాన్ని దృష్టిలో ఉంచుకొని రూపొందించాలి. కానీ కేంద్రానికి అదానీ అంబానీల్లాంటి కార్పొరేట్లు, వాణిజ్య పంటల్లో సాగించే కాంట్రాక్టు వ్యవసాయాన్ని లక్ష్యంగా చేసుకొని సేద్య విధానాలు రూపొందించడం నష్టదాయకం. ఒకవైపు ఆత్మనిర్భర్ భారత్ అని గొప్పలు చెబుతూ ఇంకోవైపున వ్యవసాయ రంగాన్ని కునారిల్లజేయడం మోడీ సర్కారుకే చెల్లింది. చారిత్రాత్మక సుదీర్ఘ పోరాటంతో నల్ల వ్యవసాయ చట్టాలను తిప్పికొట్టిన రైతాంగం మోడీ సర్కారు వ్యవసాయ విధానాల్ని గట్టిగా ప్రతిఘటించాలి. మరిన్ని ఐక్య పోరాటాలు సాగించాలి. అదే మన ముందున్న మార్గం.

మంచి మాట

స్త్రీల జీవిత లక్ష్యం ప్రేమ, పెళ్లి, పిల్లల్ని కనడం మాత్రమే కాదు. మహిళలు తమ కాళ్ల మీద తాము నిలబడాలి. అందుకు వారికి ఉద్యోగం కావాలి. పని చేయడానికి వీలుగా మహిళల వేషధారణ లోనూ మార్పు రావాలి.

- బార్బరా బోడికన్,
ఆంగ్ల విద్యావేత్త,
మహిళల హక్కుల కార్యకర్త.

జూనియర్ భాగస్వామిగా అమెరికాతో బలపడిన బంధం!

వ్యాఖ్య

ఇటీవల అమెరికాలో మోడీ జరిపిన పర్యటనతో ఒక విషయం చాలా స్పష్టంగా అర్థమైంది-వ్యూహాత్మకంగా, సైనిక సంబంధాల పరంగా అమెరికాతో భారత్ బంధం మరింత బలపడింది.

"ఇరు ప్రజాస్వామిక దేశాల మధ్య భాగస్వామ్యం", పంచుకుంటున్న విలువలు అంటూ వాక్చాతుర్యాన్ని ప్రదర్శించినా, చైనాను ఆర్థికంగా, సైనికంగా కట్టడి చేయడానికి ప్రస్తుతం జరుగుతున్న ప్రయత్నాల్లో భారత్‌ను ధృఢమైన భాగస్వామిగా తన జాబితాలో చేర్చుకునేందుకు అమెరికాకు గల అవసరమే ఈ లోతైన, సమగ్ర సంబంధాలకు పురిగొల్పిన ఒత్తిళ్ళని స్పష్టమవుతోంది.

2002లో పెంటగన్ చేపట్టిన అధ్యయనంలోనే భారత్ పట్ల అమెరికా వైఖరి ఏమిటనేది వెల్లడైంది. చైనాను ప్రతిఘటించే శక్తిగా భారత్‌ను పెంటగన్ చూసింది. గత కొన్నేళ్ళుగా చైనాను కట్టడి చేసేందుకు, ఏకాకిని చేసేందుకు అన్ని ప్రయత్నాలు చేసినా అవి ఆశించిన ఫలితాలు ఇవ్వలేదని బైడెన్ ప్రభుత్వం గ్రహించిన నేపథ్యంలోనే, నరేంద్ర మోడీ అమెరికా పర్యటనలో ప్రభుత్వ విందు, రెండోసారి అమెరికన్ కాంగ్రెస్ ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించే అవకాశం వచ్చాయి.

మోడీ అమెరికాలో పర్యటించడానికి ముందుగానే అమెరికా కొన్ని సన్నాహక చర్యలు చేపట్టింది. అందులో భాగమే, అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సులివాన్ భారత్‌లో పర్యటించడం. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో-హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారత్‌కు ముఖ్యమైన పాత్ర ఇచ్చే ఉద్దేశ్యంతో రూపొందించిన పథకం ఇది-భారత్‌ను కీలక భాగస్వామిగా చేయాలన్నది ముఖ్యమైన అంశమని చివరగా ఉభయ పక్షాలు జారీ చేసిన సంయుక్త ప్రకటనతో రుజువైంది. ఉభయ పక్షాల సంయుక్త ప్రకటనలో క్వాడ్‌కు కీలకమైన ప్రాధాన్యత లభించింది. ప్రకటన మొదటి పేరాగ్రాఫ్ లోనే దీని గురించి ప్రస్తావించారు. రక్షణ రంగ ఉత్పత్తిలో సహకారం, ఉన్నత సాంకేతికతల గురించి చర్చలనేవి క్వాడ్‌ను భద్రతా కూటమిగా మార్చడంలో భాగమే.

2005లో పౌర అణు ఒప్పందంలో చేరాలని కోరడమే భారత్‌ను వ్యూహాత్మక మిత్రపక్షంగా చేయడానికి అమెరికా తీసుకున్న తొలి ప్రధాన చర్యగా వుంది. పౌర అణు సాంకేతికత అనేది భారత్‌కు అమెరికా ఇస్తున్న ఒక రాయితీ వంటిదే. అందుకు ప్రతిఫలంగా భారత్ రక్షణ రంగ ఒప్పందం చేసుకుంది. అణు ఒప్పందానికి నాందిగా 2005 జూన్‌లో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. అయితే, వామపక్షాలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేయడంతో రక్షణ రంగ చట్ర పరిధి ఒప్పందంలోని వివిధ లాజిస్టిక్స్ (వసతి సదుపాయాలు), ఇంటరాపరబిలిటీ (పరస్పర కార్యకలాపాలు లేదా చర్యల) ఒప్పందాల అమలుకు ఆటంకం కలిగింది. అందువల్లే, గత కొద్ది సంవత్సరాలుగా ఇరుదేశాల సాయుధ బలగాల మధ్య అవసరమైన వివిధ రంగాల్లో మద్దతు, సహకారానికి హామీ కల్పిస్తూ నాలుగు ప్రాథమిక ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. సైనిక సంబంధాల్లో-సంయుక్త విన్యాసాలు, భారత ఓడరేవుల్లో అమెరికా నౌకల మరమ్మతులు, నిర్వహణకు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం, ఇరు దేశాల సైనిక సంస్థల్లో లైజాన్ అధికారుల నియామకాలు, రెండు దేశాల సాయుధ బలగాల మధ్య పరస్పర కార్యకలాపాల నిర్వహణకు చర్యలు తీసుకోవడం-సాధించిన పురోగతిని ఉభయ పక్షాల సంయుక్త ప్రకటన నమోదు చేసింది. వీటన్నింటితో ఇరు దేశాల మధ్య సంబంధాలు ఒక స్థాయికి చేరాయి. ఈ సంబంధాలను 'ఒక రకమైన పొత్తు'గా అమెరికా వ్యూహాత్మక నిపుణుడు వ్యాఖ్యానించారు. అంటే ఒక దేశంపై దాడి చేయడమంటే మరో దేశంపై దాడిగా కూడా పరిగణించే నాటో ఒప్పందంలోని ఐదవ అధికరణ వంటి క్లాజు మినహా అమెరికా-భారత్ సైనిక సంబంధాల్లో పొత్తుకు సంబంధించిన అంశాలన్నీ వున్నాయి.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

ఉన్నత సాంకేతికత రంగంలో సహకరిస్తామన్న హామీ గురించి ముందుగా చాలా తతంగం జరిగింది. "మన భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో సాంకేతికత అనేది నిశ్చయాత్మక పాత్ర పోషిస్తుంది" అని ఆ సంయుక్త ప్రకటన పేర్కొంది. రోదసీ సాంకేతికత నుండి క్వాంటమ్ పరిశోధన, ముఖ్యమైన ఖనిజాలు, కృత్రిమ మేధస్సు వరకు అనేక రంగాల్లో సంయుక్త పరిశోధనలు, సహకారానికి ప్రతిపాదనలు రూపొందించారు. అయితే, ఆ ప్రకటనను నిశితంగా చదివితే వాస్తవికంగా సాంకేతికత బదిలీ అనేది లేకపోవడం కనిపిస్తుంది. అయితే అన్నింటికీ మించి, అటువంటి ఉద్దేశ్యం వుందన్న ప్రకటన వెలువడింది.

రక్షణ రంగ ఉత్పత్తిలో సహకారానికి సంబంధించి, పెద్ద తతంగమే జరిగింది. ఎఫ్-414 జెట్ ఇంజన్లను జనరల్ ఎలక్ట్రిక్, హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌లు కలిసి ఉత్పత్తి చేయడానికి అవగాహనా ఒప్పందం కుదిరింది. అలాగే తేలికపాటి యుద్ధ విమానాలు ఎంకె 2 కోసం కూడా ఒప్పందంపై సంతకాలు జరిగాయి. అయితే, దీనివల్ల అమెరికా జెట్ ఇంజను సాంకేతిక పరిజ్ఞానమంతా గొప్పగా బదిలీ కావడానికి దారి తీస్తుందని చెప్పడం తప్పు దారి పట్టించడమే. హెచ్ఎఎల్‌లో జెట్ ఇంజను విడిభాగాల కూర్పులో చాలా పరిమితమైన సాంకేతికత బదిలీనే వుంది. పెద్ద మొత్తంలో కీలకమైన సాంకేతికతలన్నీ కూడా అమెరికా తన వద్దనే అట్టిపెట్టుకుంది.

> మోడీ అమెరికా పర్యటన ఫలితంగా భారత్ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి మరింతగా తుడిచిపెట్టుకుపోయింది. తన స్వతంత్ర విదేశాంగ విధానానికి తనకు తానే సంకెళ్లు వేసుకుంది. న్యూఢిల్లీలో జులైలో జరగాల్సిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఓ) సదస్సు ఇప్పటికే ఆన్‌లైన్ సమావేశంగా మారిపోయింది. మోడీ ప్రభుత్వం అనుసరించిన అమెరికా అనుకూల వైఖరి... బహుళధృవ ప్రపంచంలో సృజనాత్మకమైన, స్వతంత్ర పాత్ర పోషించడం ద్వారా భారత్‌కు అందివచ్చిన మహత్తర అవకాశాన్ని కాలదన్నేలా వుంది.

> సైనిక సంబంధాల్లో-సంయుక్త విన్యాసాలు, భారత ఓడరేవుల్లో అమెరికా నౌకల మరమ్మతులు, నిర్వహణకు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం, ఇరు దేశాల సైనిక సంస్థల్లో లైజాన్ అధికారుల నియామకాలు, రెండు దేశాల సాయుధ బలగాల మధ్య పరస్పర కార్యకలాపాల నిర్వహణకు చర్యలు తీసుకోవడం-సాధించిన పురోగతిని ఉభయ పక్షాల సంయుక్త ప్రకటన నమోదు చేసింది. వీటన్నింటితో ఇరు దేశాల మధ్య సంబంధాలు ఒక స్థాయికి చేరాయి. ఈ సంబంధాలను 'ఒక రకమైన పొత్తు'గా అమెరికా వ్యూహాత్మక నిపుణుడు వ్యాఖ్యానించారు.

ఇక్కడ అమెరికా ఉద్దేశ్యం, లక్ష్యం రెండు రకాలుగా వుంది. - రష్యా రక్షణ పరికరాల సరఫరా నుండి భారత్‌ను వేరు చేయడం మొదటి లక్ష్యం కాగా, రెండోది, భారత్‌కు తానే ప్రధాన ఆయుధ సరఫరాదారుగా వుండడం. క్వాడ్‌లో, హిందూమహా సముద్ర ప్రాంతంలో భారత సైన్యం పోషించాల్సిన పాత్ర కోసం ఆయుధాలను సమకూర్చడం, పరస్పర కార్యకలాపాలు, చర్యలను పెంపొందించడానికి ఈ రక్షణ పారిశ్రామిక సహకారం ఉద్దేశించబడింది. అందుకోసమే దాదాపు 300 డాలర్లకు ఎంక్యూ-9బి గార్డియన్ సాయుధ డ్రోన్‌లను కొనుగోలు చేయాలని భారత్‌పై అమెరికా ఒత్తిడి తెచ్చింది. ఈ ప్రిడేటర్ డ్రోన్‌లను చాలా ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తుంది. పైగా కొత్త తరం డ్రోన్‌ల కన్నా నెమ్మదిగా కదులుతాయి. హిందూ మహాసముద్ర ప్రాంతంలో సముద్ర జలాలపై అవగాహన (మారిటైమ్ డొమైన్ అవేర్‌నెస్ -ఎండిఎ) కింద నిఘా, ఇంటెలిజెన్స్ సమాచారం రాబట్టడానికి భారత్ వీటిని ఉపయోగించాలని అమెరికా భావిస్తోంది. గుజరాత్‌లో సెమీ కండక్టర్ యూనిట్ ఏర్పాటు చేయడానికి అమెరికా ప్రైవేట్ కంపెనీ మైక్రాన్ టెక్నాలజీ పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెడుతోందనడాన్ని చూసినట్లైతే వాస్తవానికి అమెరికా కార్పొరేట్ల కోసం భారత్ ఇచ్చిన రాయితీ ఇది. సెమీ కండక్టర్ల విడిభాగాలను కూర్చేందుకు, పరీక్షించడానికి ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి 82.5 కోట్ల డాలర్లను మైక్రాన్ ఖర్చు పెట్టాల్సి వుంది. అంతేకానీ సెమీ కండక్టర్ల రూపకల్పన కోసం కాదు. ఈ ప్రాజెక్టు మొత్తం విలువ 275 కోట్ల డాలర్లు. కేంద్ర ప్రభుత్వానికి 50 శాతం వరకు సబ్సిడీ ఇచ్చారు. అంటే రూ.11 వేల కోట్లు అవుతోంది. గుజరాత్ ప్రభుత్వం మరో 20 శాతం మొత్తం సమకూర్చాల్సి వుంటుంది. అమెరికా కంపెనీ లాభాలు సమకూర్చుకోవడానికి ఇదొక పబ్లిక్ ఫండింగ్.

ఇక మరింత విస్తృతమైన ద్వైపాక్షిక ఆర్థిక, వాణిజ్య సంబంధాలు గురించి మాట్లాడుకుంటే, వాణిజ్య ఒప్పందాల చట్టం గుర్తింపు పొందిన దేశంగా తమను గుర్తించాలని, అమెరికా జనరలైజ్డ్ సిస్టమ్ ఆఫ్ ప్రిఫరెన్సెస్ ప్రోగ్రామ్ (సాధారణీకరించబడిన ప్రాధాన్యతా క్రమం) కింద భారత్ హోదాను పునరుద్ధరించాలని భారత్ చేసిన అభ్యర్థనను అమెరికా అంగీకరించలేదు.

భారత్‌లో ప్రజాస్వామ్యంపై దాడులు, మతపరమైన మైనారిటీల హక్కుల నిరాకరణ అంశాలను అమెరికా అధ్యక్షుడు బైడెన్ లేవనెత్తుతారా లేదా అన్న అంశంపై చాలా చర్చ జరిగింది. భారత్‌లో మానవ హక్కులు, ప్రజాస్వామ్య విలువలు పరిరక్షించాల్సిన అవసరాన్ని మోడీతో చర్చించాలంటూ 75 మంది అమెరికన్ కాంగ్రెస్ సభ్యులు బైడెన్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యంపై, మానవ హక్కులపై బైడెన్ ప్రభుత్వం మరింత దృఢంగా వుండాలని కొన్ని ఉదారవాద వర్గాలు భావించాయి. కానీ, ప్రజాస్వామ్యం, పరస్పరం పంచుకునే విలువల పట్ల మరింత నిబద్ధతతో ఏ అమెరికా ప్రభుత్వమైనా నిలబడాలని భావించడం కేవలం భ్రమ. వాస్తవానికి, మితవాద కమ్యూనిస్టు వ్యతిరేకులైన సైనిక నియంతలు, నిరంకుశ పాలకులతో వ్యవహరించడానికే అమెరికా ఎప్పుడూ ప్రాధాన్యత ఇస్తుంది. బైడెన్ ప్రభుత్వానికి సంబంధించినంతవరకు, గత అమెరికా ప్రభుత్వాల మాదిరిగానే, అమెరికా సామ్రాజ్యవాద భౌగోళిక, రాజకీయ ప్రయోజనాలే కీలకం. ఇక నరేంద్ర మోడీని చూసినట్లైతే, దేశీయంగా తన ప్రతిష్టను పెంచుకోవడానికి ఈ అమెరికా పర్యటన, ఫలితాలు కొంత ఉపయోగపడతాయి. ఆర్ఎస్ఎస్ ఎప్పుడూ సామ్రాజ్యవాద అనుకూలమే కాగా, బడా బూర్జువాల నేతృత్వంలోని భారత పాలక వర్గాలు అమెరికాతో వ్యూహాత్మక పొత్తు కోసం పాతుకుపోతున్నాయి. అమెరికా మిత్రపక్షంగా అన్నింటికీ లొంగివుండే కింది స్థాయి హోదా అయినా అదొక గొప్ప ఘన విజయంగా భావించే ఈ దృక్పథం కార్పొరేట్ మీడియాలో బాగా ప్రబలంగా వుంది.

మోడీ అమెరికా పర్యటన ఫలితంగా భారత్ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి మరింతగా తుడిచిపెట్టుకుపోయింది. తన స్వతంత్ర విదేశాంగ విధానానికి తనకు తానే సంకెళ్ళు వేసుకుంది. న్యూఢిల్లీలో జులైలో జరగాల్సిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) సదస్సు ఇప్పటికే ఆన్‌లైన్ సమావేశంగా మారిపోయింది. మోడీ ప్రభుత్వం అనుసరించిన అమెరికా అనుకూల వైఖరి...బహుళధృవ ప్రపంచంలో సృజనాత్మకమైన, స్వతంత్ర పాత్ర పోషించడం ద్వారా భారత్‌కు అందివచ్చిన మహత్తర అవకాశాన్ని కాలదన్నేలా వుంది.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

ప్రభుత్వ బీమా రంగ పరిరక్షణే లక్ష్యంగా....

సందర్భం

'ఒంటరితనం నుండి సంఘటిత దిశగా' అనే నినాదంతో 'ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్' (ఏఐఐఇఏ) 1951 జులై 1వ తేదీన ఆవిర్భవించింది. ఇన్సూరెన్స్ రంగ జాతీయీకరణ కోరుతూ మొదటి సమావేశంలోనే తీర్మానాన్ని ఆమోదించి...ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలను అన్నింటిని కలిపి జాతీయీకరణ చేసి 'లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా'గా ఏర్పాటు చేసేలా పోరాడిన చైతన్యపూరిత చరిత్ర 'ఏఐఐఇఏ'ది.

ఈ జనవరిలో కలకత్తాలో జరిగిన ఏఐఐఇఏ జాతీయ మహాసభలో సిఐటియు జాతీయ ప్రధాన కార్యదర్శి కా॥ తపన్‌సేన్ సందేశమిస్తూ... జీతభత్యాల గురించి, ఉద్యోగ భద్రత గురించి చర్చించుకోవడం సాధారణంగా మహాసభలలో జరుగుతుంటుంది. కానీ, సామాజిక స్పృహగల ఒక సంఘంగా సమాజంలోని రుగ్మతలకు కారణాలను చర్చించి వాటిని నివారించేందుకు అన్ని వర్గాలతో కలిసి ఏ విధంగా పోరాటం చేయాలో చర్చించటం ఏఐఐఇఏ విశిష్టత' అని పేర్కొనటం గమనార్హం.

జి. కిషోర్ కుమార్

ఏఐఐఇఏ తొమ్మిదవ మహాసభ 1978లో కలకత్తాలో జరిగినప్పుడు సోషలిజం స్థాపనే మన లక్ష్యమనే తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించిన చరిత్రాత్మక నేపథ్యం వుంది. అప్పటి ఎమర్జెన్సీకి కారణమైన ఇందిరా గాంధీ ప్రభుత్వానికి దేశ ప్రజలు చరమగీతం పాడి దేశ ప్రజాస్వామ్యంపై నమ్మకం, విశ్వాసం పాదుగొల్పిన గొప్ప సందర్భమది.

ఎల్ఐసిని ఐదు ముక్కలుగా విభజన చేయాలన్న బిల్లుకు వ్యతిరేకంగా ఏఐఐఇఏ సాగించిన పోరాటాన్ని పార్లమెంట్‌లో ప్రతిబింబించేలా వామపక్షాలు గొప్ప కృషి చేశాయి. ఏఐఐఇఏ సంయుక్త కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన కా॥ సునీల్ మైత్రా అప్పటి పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. నాటి ప్రధాని రాజీవ్ గాంధీని కలిసి ఎల్ఐసి విభజన బిల్లు దేశ సమగ్రతకు ఏ విధంగా విఘాతం కలిగిస్తుందో వివరించి ఆ బిల్లును పార్లమెంట్ నుంచి విరమించుకునేలా చేయడం యూనియన్ పోరాట ప్రస్థానంలో మరొక ముఖ్య ఘట్టం.

జులై 1 ఏఐఐఇఏ ఆవిర్భావ దినోత్సవం

> ఏఐఐఇఏ గత ఏడు దశాబ్దాలుగా సైద్ధాంతిక పునాదితో ఇన్సూరెన్స్ ఉద్యోగుల ఉద్యమాన్ని ప్రజాఉద్యమంతో అనుసంధానం చేస్తూ, ఎదురైన సవాళ్ళను అధిగమిస్తూ ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తన పోరాటాన్ని కొనసాగించటం, ఎల్ఐసిలో వాటాల ఉపసంహరణ కాకుండా కాపాడుకోవడం, పాలసీదారుల ప్రయోజనాలను ఎల్ఐసి సంరక్షిస్తుందని భరోసా ఇవ్వడం, వారి ప్రయోజనాల పరిరక్షణకు ట్రేడ్ యూనియన్ ఉద్యమ ప్రస్థానాన్ని కొనసాగించడం ఏఐఐఇఏ నేటి లక్ష్యంగా వుంది.

జాతీయ ఇన్సూరెన్స్ రంగాన్ని పరిరక్షించటానికి ఏఐఐఇఏ ఏడు దశాబ్దాలుగా నిరంతర పోరాటాన్ని కొనసాగించింది. 'ప్రజల సొమ్ము ప్రజల శ్రేయస్సు కోసమే' అనే ఇన్సూరెన్స్ జాతీయీకరణ లక్ష్యాల సాధన కోసం ప్రచార, పోరాట కార్యాచరణతో నిరంతరం సైద్ధాంతిక నిబద్ధతతో పయనించింది. ఎమర్జెన్సీ కాలంలోనే ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు గొంతెత్తి నినదించింది. ఎల్ఐసిని 5 స్వతంత్ర ప్రతిపత్తిగల కార్పొరేషన్‌గా విభజించాలన్న నాటి ప్రభుత్వ ప్రయత్నాలకు, మల్హోత్రా కమిటీ, బీమా రంగ సంస్కరణలు, ప్రైవేటీకరణ వంటి అంశాలకు వ్యతిరేకంగా కోటి యాభై లక్షల సంతకాల సేకరణతో విస్తృత ప్రజాభిప్రాయాన్ని కూడగట్టింది. బీమా రంగ ప్రైవేటీకరణ ప్రతిపాదనలకు వ్యతిరేకంగా 'పీపుల్స్ పిటిషన్' పేరుతో వాటిని పార్లమెంట్‌కు సమర్పించడం వంటి ప్రచార ఆందోళనా ఉద్యమాలను చేపట్టింది.

ఎల్ఐసి, ఇన్సూరెన్స్ చట్టసవరణ బిల్లుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా వివిధ రాజకీయ పార్టీల పార్లమెంట్ సభ్యులను కలిసి వివరించి పార్లమెంట్‌లో అనేక సార్లు జాతీయ ఇన్సూరెన్స్ రంగ పరిరక్షణ కోసం చర్చ జరిగేలా కృషి చేసింది.

ప్రభుత్వం చేపడుతున్న ప్రైవేటీకరణ విధానాలపై జాతీయ కార్మిక సంఘాలతో కలిసి సమ్మెలలో పాల్గొని సమర శంఖం పూరించింది. దీంతోపాటు వేతన సవరణలు, పెన్షన్ సాధనతో సహా అనేక సౌకర్యాలు, సదుపాయాలను సాధించి మెజారిటీ ఉద్యోగుల మన్ననలు పొందింది.

ఎల్ఐసి, జాతీయ సాధారణ బీమా పరిశ్రమల వ్యవస్థాగత లక్ష్యాలను పరిరక్షించడం, విశాల ఉద్యోగుల ఐక్యతను కాపాడడం, ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీల పోటీని ఎదుర్కొని సంస్థను మార్కెట్ లీడర్‌గా నిలపడం, ప్రభుత్వ ప్రైవేటీకరణ, డిజిన్వెస్ట్‌మెంట్ విధాన ప్రభావం నుంచి జాతీయ బీమా రంగాన్ని కాపాడుకోవడం, ఎల్ఐసి-ఐపీఓ అనంతర పరిణామాలపై పట్టాదారులకు భరోసా కల్పించడం వంటి అనేక రూపాలలో నేడు ఏఐఐఇఏ బహుముఖ సవాళ్ళను ఎదుర్కొంటోంది.

ప్రస్తుత సవాళ్ళు గతంలో ఎదుర్కొన్న వాటి కంటే పెద్దవి. ప్రభుత్వం అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాల ప్రభావమే ఇందుకు కారణం. ప్రజాస్వామిక భిన్నాభిప్రాయాన్ని, ప్రశ్నించే తత్వాన్ని ఆహ్వానించే పరిస్థితి కూడా నేడు లేదు.

ఏఐఐఇఏ గత ఏడు దశాబ్దాలుగా సైద్ధాంతిక పునాదితో ఇన్సూరెన్స్ ఉద్యోగుల ఉద్యమాన్ని ప్రజాఉద్యమంతో అనుసంధానం చేస్తూ ఎదురైన సవాళ్ళను అధిగమిస్తూ ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తన పోరాటాన్ని కొనసాగించటం, ఎల్ఐసిలో వాటాల ఉపసంహరణ కాకుండా కాపాడుకోవడం, పాలసీదారుల ప్రయోజనాలను ఎల్ఐసి సంరక్షిస్తుందని భరోసా ఇవ్వడం, వారి ప్రయోజనాల పరిరక్షణకు ట్రేడ్ యూనియన్ ఉద్యమ ప్రస్థానాన్ని కొనసాగించడం ఏఐఐఇఏ నేటి లక్ష్యంగా వుంది.

పాలక వర్గాల మతతత్వ, విచ్ఛిన్నకర పోకడలను, కార్మిక చట్టాల మార్పుల వంటి విధానాలను తిప్పికొట్టాలి. ఇన్సూరెన్స్ పరిశ్రమలో ఉద్యోగుల ఐక్యతకే పరిమితం కాక, విశాల కార్మిక వర్గ ఐక్యత-నిర్మాణం కోసం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేయాలి. ఈ లక్ష్యాల సాధనకు ఏఐఐఇఏ 73వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పునరంకితమవ్వడం దేశవ్యాప్తంగా ఇన్సూరెన్స్ ఉద్యోగుల నేటి కర్తవ్యం.

/వ్యాసకర్త ఎస్.సి.జడ్.ఐ.ఇ.ఎఫ్ ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ఎల్.ఐ.సి ఉద్యోగ సంఘం జాయింట్ సెక్రటరీ, సెల్: 9440905501/

అభిప్రాయం

ఆశ్రమాలా..నేర సామ్రాజ్యాలా..!

ఆశ్రమాల పేరుతో బాబాలు, స్వాములు, పీఠాధిపతులు ఏం చేస్తున్నారు? వారు ఏం ప్రభోదిస్తున్నారు? లోపల ఏం జరుగుతోంది? ఎవరికీ తెలియదు. నిన్న విశాఖపట్నం లోని వెంకోజిపాలెంలో రామానందాశ్రమ అధిపతి పరిపూర్ణానంద తన ఆశ్రమంలో ఉంటున్న మైనర్ బాలికపై అత్యాచారం కేసులో అరెస్టు అయ్యాడు. రక్షణగా ఉంటుందని భావించి దిక్కులేని బాలికను ఆశ్రమములో చేరిస్తే ఆశ్రమాధిపతి పరిపూర్ణానంద అత్యాచారం చేశాడు. బాబా వేషం వేసుకున్న ఇంకొకడు నంద్యాల జిల్లాలో చాగలమర్రిలో, యజమానికి రోగం నయం చేస్తానని తొమ్మిది లక్షల రూపాయలు కాజేశాడు. రోగం తగ్గలేదని అతని భార్య చెప్పగా ఆమెతో నగ్నపూజలు చెయ్యాలని బాబా ఆదేశించాడు. అనుమానం వచ్చి ఆమె పోలీసులకు సమాచారం ఇవ్వగా ఆ హుస్సేన్ బాబాను నిన్న అరెస్టు చెసారు. ఈ రకంగా నిత్యం ఎక్కడో ఒకచోట ఇలాంటి అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయి. ఆ మధ్య మదనపల్లిలో జరిగిన జంట హత్యల వెనుక ఒక అంతర్జాతీయ బాబా ప్రేరణ ఉన్నదని పత్రికలు, సంఘాలు కోడైకూసినా శోధించాల్సిన నిఘా వ్యవస్థలు పట్టించుకోలేదు. ఎవరూ ఏమీ చెయ్యలేరన్న ధీమాతో ఈ బాబాలు, పీఠాధిపతులు ప్రభుత్వ భూములు ఆక్రమించి ఆశ్రమాలు నడుపుతున్నారు. వాస్తవానికి ఇటుంటి ఆశ్రమాలన్నీ ఆధ్యాత్మికం పేరుతో నేర సామ్రాజ్యాలుగా మారిపోయాయి. రాజకీయ నాయకులను ఆశ్రయించి వారికి వీరు, వీరికి వారు క్విడ్ ప్రో కో అన్నట్లుగా తయారైనారు. నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం చేవూరులో రామదూత అనే దొంగస్వామి కోట్లాది రూపాయల విలువ చేసే చెరువుపోరంబోకును ఆక్రమించి, ఆశ్రమము పేరుతో రకరకాలుగా మోసం చేస్తున్నాడు. రెండు సంవత్సరాల క్రితం ప్రిన్సిపల్ సెక్రటరీ (రెవిన్యూ) ఉషారాణి గారు ఈ దొంగస్వామి ఆక్రమించిన భూమిని స్వాధీనం చేసుకొమ్మని జిల్లా కలెక్టరును ఆదేశించినా ఈ రోజు వరకు దిక్కులేదు. అధికారులలో కదలిక లేదు. ప్రభుత్వ భూములలో మందిరాలు మతపరమైన చిహ్నాలను నిర్మించరాదని, ఒకవేళ ఇప్పటికి ఉండి ఉంటే నిర్మొహమాటంగా తొలగించాలని సుప్రీంకోర్టు ఏనాడో చెప్పింది. కానీ ముఖ్యమంత్రులు, ఐఏఎస్ లు, ఐపీఎస్‌లు అధికారికంగా ఆశ్రమాల చుట్టూ తిరుగుతున్నారు. కొంతమంది ఆశ్రమాల గేట్ల దగ్గర కాపలా కాస్తున్నారు. కనుక ప్రజల ధనమాన ప్రాణాలను తీస్తున్న ఈ దొంగ బాబాలు, స్వాములు, పీఠాధిపతుల గుట్టు రట్టు చెయ్యాలి. ఆశ్రమాలను స్వాధీనం చేసుకొని, ఈ దొంగ బాబాలను కటకటాల వెనక్కి పంపాలి.

- నార్నె వెంకట సుబ్బయ్య.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ : editpageps@ gmail.com

విజయ స్థానంలో 'అమూల్'

• 4న సిఎంచే శంకుస్థాపన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:
రాయలసీమలో రత్నాలు రాసులుగా పోసి అమ్మేవారని నాటి వైభవాన్ని చూడలేదు గానీ.. 1978లో చిత్తూరు జిల్లా కేంద్రంలోని విజయ సహకార డెయిరీ పాలవెల్లువ మాత్రం అప్పటి యువకులు, ఇప్పటి వృద్ధులకు గుర్తుంటుంది. దాదాపు అరవై లీటర్ల పాల సామర్ధ్యంతో ప్రారంభమై రెండు లక్షల లీటర్ల పాల సేకరణతో దేశంలోనే అతిపెద్ద పాల డెయిరీగా విరాజిల్లిన విజయ సహకార డెయిరీ పేరు మసకబారింది. దేశంలో కరువు తాండవిస్తున్న తరుణంలో సహకారరంగంలో అతిపెద్ద పాలడెయిరీగా ఉన్న విజయ డెయిరీ జిల్లాలోని పాడిరైతులకు కల్పతరువుగా నిలిచి ఆదుకుంది.

అనంతరం అంచెలంచెలుగా ఎదిగిన విజయ డెయిరీ 2002 ఆగస్టు 31వ తేదీన హఠాత్తుగా మూతపడింది. డెయిరీ మూతపడటంతో దాదాపు 300 మందికి పైగా వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న కార్మికులు రోడ్డున పడ్డారు. సహకార రంగంలో నడుస్తున్న పాలడెయిరీలో జిల్లాలోని పాడి రైతులు భాగస్వాములుగా ఉండేవారు. 33ఏకరాల్లో ఏర్పాటు చేసిన పాలడెయిరీ ఆస్తులతో పాటు జిల్లాలో 9,140 పాలశీతలీకరణ కేంద్రాలు, పీలేరు, మదనపల్లి, శ్రీకాళహస్తి, పిచ్చాటూరు ప్రాంతాల్లో పాలశీతల కేంద్రాలు కూడా ఉండేవి. జిల్లాలో అతిపెద్ద సహకార డెయిరీ మూతపడడంలో ప్రయివేటు పాల డెయిరీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. విజయ డెయిరీని మూసివేయడాన్ని పాడిరైతులు, డెయిరీ కార్మికులు రాజకీయ పార్టీలు కార్మికసంఘాల పాటు ప్రత్యక్ష ఆందోళనలు జరిగాయి. ప్రభుత్వాలు మారినప్పటికి పాల డెయిరీ తెరిపిస్తామనే ఆశతో పాడి రైతులు ఎదురు చూశారు. విజయ డెయిరీని మూసివేయడాన్ని ప్రత్యక్షంగా చూసిన పెరుమాళ్లకండ్రిగకు చెందిన రైతు వెంకటాచలం నాయుడు 2004 నవంబర్ ఒకటో తేదిన డెయిరీ ఎదుట మళ్లీ డెయిరీ తెరిపించేంత వరకు చెప్పులు, చొక్క వేసుకోనంటూ దీక్ష పూని సుదీర్ఘ పోరాటాని నేటికీ కొనసాగిస్తున్నారు. ఇదే తరహాలో వీఆర్ఎస్ పొందకుండా ఎప్పటికైనా డెయిరీ తెరవకపోతారా అంటూ ఎదురు చూస్తున్న కార్మికులకు జగన్ సర్కార్ అమూల్‌కు అప్పగిస్తూ నిర్ణయించడంతో నిరాశే మిగిలింది. విజయ పాలడెయిరీలో నేటికీ భాగస్వాములుగా ఉన్న పాడి రైతులు, కార్మికులతో ఎలాంటి సంప్రదింపులు జరకుండా కోట్లాది రూపాయల విలువ చేసే విజయ సహకార డెయిరీ ఆస్తులను 99సంవత్సరాలు అమూల్ సంస్థకు అప్పగించడంపై పాడిరైతులు, కార్మికులు ప్రభుత్వ తీరుపై దుమ్మెత్తిపోస్తున్నారు.

ఇచ్చిన హామీ మరచిన జగన్

పాదయాత్ర సందర్భంగా చిత్తూరుకు వచ్చిన జగన్ మోహన్‌రెడ్డి జిల్లాలోని రేణిగుంట, చిత్తూరు సహకార చక్కెర ఫ్యాక్టరీలతో పాటు విజయ సహకార డెయిరీని అధికారంలోకి వచ్చిన ఆరు నెల్లలో పున:ప్రారంభిస్తామని మాట ఇచ్చి నేడు అమూల్‌కు అప్పగించడం జిల్లాలోని పాడి రైతులను మోసం చేయడమే అవుతుందని విజయ డెయిరీ కోసం చెప్పులు, చొక్క వదలి సుదీర్ఘ పోరాటం చేస్తున్న వెంకటాచలం నాయుడు తెలిపారు. 16 సంవత్సరాలు పాటు తాను డెయిరీ పున:ప్రారంభం కోసం పోరాటం చేశానని చిత్తూరులో ఏసమావేశం జరిగినా డెయిరీ సమస్యలను వారి దృష్టికి తీసుకుపోయానని, ఎప్పటికైనా తెరుస్తారనే ఆశతో ఎదురు చూశానని తెలిపారు. కానీ విజయ డెయిరీ విషయంలో గత పాలకులకు జగన్‌కు పెద్ద తేడా లేదని, వాళ్ళు తెరిపించకపోయినా ఆస్తులు కారు చౌకగా అప్పగించలేదని విమర్శించారు. జగన్ విజయ డెయిరీ ఆస్తులను కారుచౌకగా 99 సంవత్సరాలకు అమూల్‌కు అప్పగించడం జిల్లాలోని పాడి రైతులను ధగా చేయడమే అన్నారు.

డెయిరీ వ్యవస్థాపకుడి విగ్రహం తొలగింపు

సహకార విజయ డెయిరీ ఏర్పాటులో కీలపాత్ర పోషించి నాటి పాలకులను ఒప్పించి చిత్తూరు విజయ డెయిరీని జిల్లాకు తీసుకురావడానికి పాటుపడిన వెంకట కృష్ణమనాయుడు (చిత్తూరు సహకార సంస్థల ఏర్పాటుకు కృషి చేసిన వ్యక్తి) కుమారుడు వీర రాఘవులు నాయుడు మరణించాక జిల్లాలోని పాడి రైతులు డెయిరీకి పోసే పాలలో లీటరుకు పది పైసలు చొప్పున వీరరాఘవులు నాయుడు విగ్రహ ఏర్పాటుకు అందించారు. 1999లో విజయ డెయిరీ ప్రధాన ద్వారం ముందు వీరరాఘవులు నాయుడు నిలువెత్తు విగ్రహం ఏర్పాటు చేశారు. అయితే విజయ డెయిరీ ఆస్తులను అమూల్ అప్పగించనున్న నేపథ్యంలో సిఎం పర్యటన వారం రోజులుండగా బుధవారం హఠాత్తుగా విగ్రహాన్ని తొలగించడం పట్ల వీరరాఘవులు నాయుడు కుటుంబ సభ్యులు, బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సహకార డెయిరీ ఏర్పాటులో కీలపాత్ర పోషించిన వ్యక్తి విగ్రహం ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తొలగించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. తొలగించడానికి కారణాలు తెలుపుతూ రెండు రోజుల్లో విగ్రహం తిరిగి ఏర్పాటు చేయకుంటే జిల్లాకు విచ్చేయనున్న సిఎం దృష్టికి జిల్లాలోని పాడిరైతులతో కలిసి తీసుకుపోతామంటున్నారు.

గ్రీన్ ఛానల్ ద్వారా విశాఖకు కిడ్నీల తరలింపు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్
పోలీసుల నియంత్రిత గ్రీన్ ఛానల్ మార్గం ద్వారా మానవ మూత్రపిండాలను కాకినాడ నుంచి విశాఖపట్నంకు సకాలంలో చేరేలా సమన్వయం చేసిన ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్‌కు కాకినాడ అపోలో యాజమాన్యం అభినందనలు తెలిపింది. కాకినాడ అపోలో ఆస్పత్రిలో బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి ఉదయం 11.45 గంటలకు కాకినాడ నుంచి మానవ మూత్రపిండాలను అవయవ మార్పిడి నిమిత్తం తీసుకుని బయలుదేరిన అంబులెన్స్ విశాఖపట్నంకు కేవలం 2 గంటల వ్యవధిలోనే చేరుకునేలా ఎస్‌పి ట్రాఫిక్ మరియు శాంతి భద్రతల విభాగ పోలీసు అధికారులను సమన్వయం చేశారు. ఎస్‌పి చేసిన గ్రీన్ ఛానల్ ద్వారా మధ్యాహ్నం 1.45 గంటలకు సకాలంలో చేరి 2 గంటల ఆపరేషన్ నియమిత సమయంలో జరిగేలా సహకరించారు. రెండు జీవితాలను కాపాడడంతో సాయపడ్డారు. గ్రీన్ ఛానల్లో విధులు నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు.

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో రాస్తారోకో

ప్రజాశక్తి-రాయదుర్గం
రాయదుర్గం పట్టణంలో తాగునీటి సరఫరా అధ్వానంగా తయారైంది. వారానికోసారి కూడా ప్రజలకు తగినంత నీరు సరఫరా చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. పట్టణ తాగునీటి అవసరాల కోసం 13 ఏళ్ల క్రితం రూ. 50 కోట్ల వ్యయంతో డాక్టర్ వైఎస్ఆర్ రక్షిత తాగునీటి పథకాన్ని ఏర్పాటు చేశారు. అయితే పైపులైన్ల లీకేజీ, విద్యుత్ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడం, పైపులైన్ మరమ్మత్తులు, విద్యుత్ సరఫరాలో అంతరాయం, తదితర కారణాలతో తాగునీరు సక్రమంగా సరఫరా చేయడం లేదు. కొత్త మోటార్ల ఏర్పాటు, పైపులైన్ లీకేజీ మరమ్మత్తుల కారణంగా పట్టణంలో 3 రోజుల పాటు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుం దని పది రోజుల క్రితం అధికారులు ప్రకటించారు. అయితే 12 రోజులైనా చాలా ప్రాంతాల్లో తాగునీరు సరఫరా కావడం లేదు. దీంతో విసుగుచెందిన పట్టణంలోని హరిజనవాడ ప్రజలు మొలకాల్మూరు రోడ్డుపై ఖాళీ బిందెలతో రాస్తారోకో, నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 16 రోజులుగా కాలనీకి తాగునీరు సరఫరా కావడం లేదన్నారు. ట్యాంకర్లతో సరఫరా చేస్తున్న నీరు అవసరాలకు సరిపోవడం లేదన్నారు. వారానికోసారి అర్ధరాత్రి ఒంటి గంట సమయం లో కేవలం ఒక గంట నీరు వదులుతున్నారని మండిపడ్డారు. మున్సిపల్ అధికారులు తరచూ పైపులైన్ మరమ్మతులు, మోటార్ల ఏర్పాటు పనులు చేపడుతుండడంతో ఒక్కోసారి కనీసం వారం రోజులు సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. దీనికి తోడు నీరు రంగు మారి అపరిశుభ్రంగా వస్తున్నాయన్నారు. ఇకనైనా మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, పురపాలక మండలి సభ్యులు తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ధర్మవరంలో పవర్‌లూమ్స్ బంద్

ధర్మవరం టౌన్ : ధర్మవరం పట్టణంలో జూలై 1వతేదీ నుండి 31వతేదీ వరకు పవర్‌లూమ్స్‌లో చీరల తయారీ బంద్ చేస్తున్నట్టు పవర్ లూమ్స్ అసోషియేషన్ ప్రెసిడెంట్ పోలా వెంకటనారాయణ, జాయింట్ సెక్రటరీ పల్లా నవీన్‌కుమార్ తెలిపారు. పట్టణంలో చేనేత వ్యవస్థ ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చించి ఈ నిర్ణయంతీసుకున్నట్టు తెలిపారు. అంతేకాకుండా చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి దృష్టికి తీసుకురావడంతో ఆయన సూచనల మేరకు పవర్ లూమ్స్ బంద్ చేస్తున్నామన్నారు. అలాగే ఇతర ప్రాంతాల నుండి పవర్లూమ్స్ చీరలు రాకుండా ఆపాలని వారు కోరారు.

రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-ఖాజీపేట (వైఎస్ఆర్ జిల్లా)
అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన వైఎస్ఆర్ జిల్లా ఖాజీపేట మండలంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తుడు మలదిన్నె గ్రామానికి చెందిన రైతు సుబ్బారెడ్డి(45) వ్యవసాయంలో పంటల పెట్టుబడి నిమిత్తం అప్పులు చేశారు. పండిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం, రుణదాతల నుంచి ఒత్తిడి పెరగడం, తీసుకున్న అప్పులు తీర్చే మార్గం లేక ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

23 మెట్రిక్ టన్నుల పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్
కొవ్వూరు హైవే జంక్షన్ సమీపంలో లారీలో అక్రమంగా తరలిస్తున్న 23.70 మెట్రిక్ టన్నుల పిడిఎస్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌ఛార్జి ఎస్‌పి కె.కుమార్ ఈ వివరాలను వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాలోని కుసుమంచిలి నుంచి రాజమహేంద్రవరానికి ఒక లారీలో 474 ప్లాస్టిక్ బస్తాల్లో 23.70 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని తరలిస్తున్నారన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా వత్సవాయి మండలం గంగవోలు గ్రామానికి చెందిన లారీ యజమాని, డ్రైవర్ బత్తిన కొండలరావును అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ బియ్యం తెలంగాణ రాష్ట్రం కోదాడకు చెందిన షేక్ మీరావలీ తరలిస్తున్నాడన్నారు. కొవ్వూరుకు చెందిన ఇద్దరు విలేకర్ల సహకారంతో ఈ బియ్యాన్ని తరలిస్తున్నట్టు గుర్తించామన్నారు. బియ్యం విలువ రూ.17లక్షల వరకూ ఉంటుందన్నారు. బియ్యం యజమాని, లారీ యజమానులు, విలేకర్లపై క్రిమినల్ కేసుల నమోదుకు సిఫార్సు చేశామన్నారు.

OFFICE OF THE RECOVERY OFFICER-I
DEBTS RECOVERY TRIBUNAL
(Ministry of Finance, Government of India)
Ground & 1st Floor, 31-31-21, Narayana Bhavanam, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020, A.P.

FORM – 17
(See Rule No. 53 of the Second Schedule to the Income Tax Act, 1961)
NOTICE FOR SETTLING A SALE PROCLAMATION
R.P. No.137 of 2019 in OA No.767 of 2017
Canara Bank, Gudivakalanka Branch, West Godavari District.
Versus
Smt Bonu Munnisa Devakumari

To
(CD-1) Smt Bonu Munnisa Devakumari, W/o Sri. Bonu Seetha Ramulu, D.No. 2-81, Sudhimelle, Eluru Mandal, West Godavari District and also at D.No. 20-6-222/2, 6th Lane, Ramalingeswarapet, Vijayawada, Krishna District.

Whereas in execution of Recovery Certificate dated 27-12-2019 in O.A. No.767/2017 for **Rs.4,00,75,691/- (Rupees four crores seventy five thousand six hundred and ninety one only)** with future interest @ 10.65% p.a. with monthly rests from 23.08.2017 till date of payment /realization along with costs of Rs. 78,000/- forwarded by the Hon'ble Presiding Officer, Debts Recovery Tribunal, Visakhapatnam, the undersigned has ordered the sale of the under mentioned immovable properties.

You, the Certificate Debtors/ Defendants above named, are hereby informed that on or after fifteenth day from the date of service of this notice has been fixed for drawing up the proclamation of sale and settling the terms thereof. You are requested to bring to the notice of the undersigned any encumbrances, charges, claims or liabilities attaching to the said properties or any portion thereof.

SCHEDULE – A
Site measuring an extent of 326 Sq.yds together With RCC Roof shed bearing old D.No. 20-3-37/1, New D.No. 20-06-222/6, situated at R.S. No.107/1 of Ramalingeswarapeta, Kedareswarapet, Vijayawada, SRO Vijayawada, Krishna District, Andhra Pradesh, with the following boundaries: East: Municipal Road, West: Lane, South: Property of J. Uma Maheswara Rao, North: Property of N. Appalaswamy.

SCHEDULE – B
Movables:
1. Books Debts and Receivables of the Defendants
2. Fish Crops at the place of doing Farming Business by the defendants

(Given under my hand and seal of this Tribunal at Visakhapatnam on the 23rd May, 2023)
(Avasarala Anil) Recovery Officer-I
Debts Recovery Tribunal, Visakhapatnam

FORM NO.14
{See Regulation 33(2)}
OFFICE OF THE RECOVERY OFFICER-I
DEBTS RECOVERY TRIBUNAL
(Department of Financial Services, Ministry of Finance, Government of India)
Ground & 1st Floor, 31-31-21, Sri Narayana Bhawan, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020.

DEMAND NOTICE
(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961)

RC/847/2019 in OA 529 of 2017 **11.05.2023**
Canara Bank, Chandramouli Nagar Branch, Guntur District
Versus
M/s Pujya Sree Cotton and Seeds & others

To
(CD 1) M/s Pujya Sree Cotton and Seeds Rep by its Prop. Smt Kommineni Pamulamma, D.No. 4-22-22/2, Flat No. S1, 2nd floor, PSR Homes, Sowbhagya Nagar, Guntur District.
(CD-2) Smt Kommineni Pamulamma, D.No. 4-22-22/2, Flat No. S1, 2nd floor, PSR Homes, Sowbhagya Nagar, Guntur District.
(CD-3) Sri Kommineni Venkata Krishna Rao, S/o K. Koteswara Rao, D.No.4-89, PSR Homes, Sowbhagya Nagar, Guntur District.
(CD-4) Sri Kommineni Sambasiva Rao, S/o K. Koteswara Rao, D.No.4-89, PSR Homes, Sowbhagya Nagar, Guntur District.

This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Presiding Officer, Debts Recovery Tribunal Vishakhapatnam in **OA/847/2019 an amount of Rs.84,26,385/- (Rupees eighty- four lakhs twenty-six thousand three hundred and eighty five only)** along with pendentellite and future interest @ 13.20% pa compounded with monthly rests from 27.06.2017 till realization/date of payment along with costs of Rs. 1,21,000/- has become due against you (Fully/Limited).
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on **10.07.2023** at **10:30 a.m**. for further proceedings.
5. In addition to the sum aforesaid you will be liable to pay,
(a) such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings;
(b) all costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount.

Given under my hand and the seal of the Tribunal on this date 11.05.2023
(Avasarala Anil), Recovery Officer-I
Debts Recovery Tribunal, Visakhapatnam

OFFICE OF THE RECOVERY OFFICER-II
DEBTS RECOVERY TRIBUNAL
ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల ఇంటర్న్‌షిప్ కోసం జర్మనీలో ఆ దేశ స్కాలర్‌షిప్, మంచి ఉద్యోగంతో పాటు ఉన్నత విద్యనభ్యసించేందుకు జర్మనీ విశ్వవిద్యాలయాలతో ఎంఒయు కుదుర్చుకున్నట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ తెలిపారు. గత నెలలో జర్మనీ విశ్వ విద్యాలయాలను తమ కళాశాల ఆంగ్ల విభాగాధిపతి భూపతిరాజు నాగవెంకట లక్ష్మితో కలిసి సందర్శించినట్లు అయన వెల్లడించారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం మీడియాకు అందించారు. ఇండో యూరోపియన్ సింక్రనైసేషన్ (ఐస్) సహకారంతో జర్మనీ యూనివర్సిటీల అధికారులతో సమావేశం జరిపి ఎంఒయు కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా నాలెడ్జ్ ట్రాన్స్ఫర్, స్కిల్ ట్రాన్స్ఫర్‌తో పాటు ఉద్యోగావకాశాలు కూడా ఉన్నాయని తెలిపారు. ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్, డిజైన్ థింకింగ్, రోబోటిక్స్, 5జి వంటి అంశాలపై జర్మన్ అధ్యాపకులు నిర్వహించే ఆన్‌లైన్ ప్రోగ్రామ్స్‌కు హాజరవ్వాలని తెలిపారు. వేసవిలో జర్మనీకి సమ్మర్ ఇంటెన్సివ్ రెండు వారాలు హాజరైతే అక్కడ పరిశ్రమలు, ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్స్ వంటివి చూపించి పంపుతారన్నారు. ఇక్కడకు వచ్చిన తరువాత విద్యార్థి సమగ్రమైన ప్రాజెక్టు తయారుజేసి పంపితే దానికి కూడా సర్టిఫికెట్ ఉంటుందన్నారు. జర్మనీలో మాస్టర్ డిగ్రీ చేసేందుకు నెలకు రెండు లక్షల స్టైఫండ్‌తో అవకాశం కల్పిస్తారన్నారు.

పాలగుమ్మి సాయినాథ్‌కు చింతా రవీంద్రన్ పురస్కారం



కోజికోడ్ : భారత గ్రామీణ జీవన స్థితిగతులను వెలుగులోకి తీసుకొచ్చిన ప్రఖ్యాత పాత్రికేయులు పాలగుమ్మి సాయినాథ్‌కు మరో పురస్కారం లభించింది. 2023 సంవత్సరానికి గాను చింతా రవీంద్రన్ పురస్కారానికి ఆయన ఎంపికయ్యారు. ఈ మేరకు చింతా రవీంద్రన్ ఫౌండేషన్ గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. పురస్కారం కింద రూ.50 వేలు నగదు, జ్ఞాపిక అందజేస్తారు. జులై 8న కోజికోడ్‌లోని కెపి కేశవ మీనన్ హాలులో నిర్వహించే చింతా రవీంద్రన్ స్మారక సభలో ఈ పురస్కారాన్ని సాయినాథ్‌కు అందజేయనున్నారు. ఈ సందర్భంగా 'అఖండ భారత్ – దక్షిణాసియా పున్ణచిత్రన' అనే అంశంపై ప్రముఖ పాత్రికేయులు, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ మాజీ అధిపతి ఆకార్ పటేల్ ..రవీంద్రన్ స్మారకోపన్యాసం చేయనున్నారు.

'కమలం'లో ట్వీట్ వార్

- అగ్గి రాజేసిన జితేందర్‌రెడ్డి పోస్టు

ప్రజాశక్తి –హైదరాబాద్ బ్యూరో

కమలం పార్టీలో అంతర్గ పోరు ఇప్పట్లో సర్దుమణిగేలా లేదు. అధిష్ఠానం రాష్ట్ర నేతలకు ఎంత హితబోధ చేసి పంపినా వివాదాస్పద వ్యాఖ్యలు, ట్వీట్లతో నిప్పుల కుంపటి రాజుకుంటూనే ఉన్నది. ట్విట్టర్ వేదికగా మాజీ ఎంపి జితేందర్ రెడ్డి తాజాగా చేసిన పోస్టు ఆ పార్టీలో దుమారం రేపుతున్నది. సతాయిస్తున్న బర్రెను వెనుకనుంచి తన్ని మరీ ఆటోలో ఎక్కిస్తున్న ఫొటో పెట్టి..పార్టీలో మాట వినని నేతలకు ఇలాగే ట్రీట్‌మెంట్ చేయాలంటూ సోషల్‌మీడియా వేదికగా వదిలిన పోస్టు వివాదాస్పదమైంది. ఆ పోస్టును కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, అధ్యక్షులు జెపి నడ్డా, ముఖ్యనేత సంతోష్‌జీ, రాష్ట్ర ఇన్‌చార్జి సునిల్ బన్సల్‌కు ట్యాగ్ చేశారు. ఈ పోస్టుపై బిజెపి నేతలంతా ఏమైంది? అని ఆరా తీస్తుండగానే...జితేందర్‌రెడ్డి తొలగించేశారు. మళ్లీ రెండు గంటల తర్వాత అదే పోస్టును రీ ట్వీట్ చేశారు. దానికి అదనంగా '..... బండి సంజయ్ నాయకత్వాన్ని ప్రశ్నించేటోళ్లకు ఎలాంటి ట్రీట్మెంట్ ఇవ్వాల్నో చెప్పే ప్రయత్నాన్ని తప్పుగా అర్థం చేసుకునే ఊరకుక్కల్లారా..బిస్కెట్ల కోసం బరితెగించకుర్రి' అనే వ్యాఖ్యల్ని జోడించారు.

గాయకుడు సాయిచంద్ హఠాన్మరణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గాయకుడు, తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ ఛైర్మన్ సాయిచంద్ (39) గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. బుధవారం సాయంత్రం కుటుంబ సభ్యులతో కలిసి నాగర్‌కర్నూల్ జిల్లా కారుకొండలోని తన ఫామ్‌హౌస్‌కు వెళ్లారు. అర్ధరాత్రి గుండెపోటు రావడంతో నాగర్‌కర్నూల్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. చికిత్స పొందుతూ ఆయన మృతిచెందారు. సాయిచంద్‌కు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని గురవారం రంగారెడ్డి జిల్లా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న గుర్రంగూడలోని సాయిచంద్ నివాసానికి తరలించారు. సాయిచంద్ మృతదేహానికి తెలంగాణ ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సాయిచంద్ భార్య రజనీ "సార్ సాయిని పిలువండి. లెమ్మనండి.. మీరు పిలిస్తే లేచివస్తాడు..సార్.." అంటూ హృదయవిదారకంగా రోదించడంతో కెసిఆర్ భావోద్వేగానికి గురై కన్నీరు పెట్టుకున్నారు. సాయిచంద్ తండ్రిని సీఎం అక్కున చేర్చుకొని ఓదార్చారు. సాయిచంద్ మృతి విషయం తెలుసుకున్న అభిమానులు, కళాకారులు, ప్రజలు వేలాదిగా తరలివచ్చి నివాళు లర్పించారు. సాయిచంద్ మృతదేహానికి బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సాహెబ్‌నగర్ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. సాయిచంద్ మరణం పట్ల సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది.

రాహుల్‌పై కేసు కొట్టివేతకు కర్ణాటక హైకోర్టు తిరస్కరణ

బెంగళూరు : కాపీరైట్ ఉల్లంఘనల కింద కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఇతర నేతలపై దాఖలైన కేసును కొట్టివేసేందుకు కర్ణాటక హైకోర్టు తిరస్కరించింది. నష్టపరిహారం కోరుతూ ఎంటిఆర్ మ్యూజిక్ ఇప్పటికే సివిల్ పిటిషన్ వేసినందున... ఈ అంశంపై క్రిమినల్ కేసు నమోదు చేయడంపై చట్టబద్ధతను ప్రశ్నిస్తూ కాంగ్రెస్ నేతలు దాఖలు చేసిన ఉమ్మడి పిటిషన్‌ను కూడా కోర్టు కొట్టివేసింది. జస్టిస్ ఎం.నాగప్రసన్న బుధవారం ఈ తీర్పుని వెలువరించారు. పిటిషనర్ల అనుమతి లేకుండా సోర్స్ కోడ్‌ను తారుమారు చేసి, ఆడియోను ప్లే చేయడం నిస్సందేహంగా కాపీరైట్‌ని ఉల్లంఘించడమే అవుతుందని కోర్టు పేర్కొంది. ఈ నెల 23న ఈ కేసులో విచారణను ముగించి తీర్పును రిజర్వ్ చేసిన సంగతి తెలిసిందే. కన్నడ సూపర్‌హిట్ సినిమా అయిన కెజిఎఫ్–2 లోని ఓ పాటను భారత్ జోడోయాత్ర ప్రచారం కోసం వినియోగించడంతో కాపీరైట్ ఉల్లంఘన కింద ఎంటిఆర్ మ్యూజిక్ కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, జైరాం రమేష్, సుప్రియా శ్రీనేత్‌లపై కేసు నమోదు చేసింది.

జైళ్లలో పెరుగుతున్న మరణాలు

- సిబ్బంది కొరతే కారణం.. వైద్యాధికారుల ఖాళీలు అధికం
- ఎన్‌హెచ్‌ఆర్‌సి ఆందోళన

న్యూఢిల్లీ : భారత్‌లోని జైళ్ళలో ఖైదీల మరణాలు ఆందోళనను కలిగిస్తున్నాయి. ఈ మరణాల సంఖ్య నానాటికీ పెరిగిపోతున్నది. ప్రభుత్వ సంస్థ అయిన నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో (ఎన్‌హెచ్‌ఆర్‌సి) 2000 ఏడాది నుంచి ప్రతి ఏడాదీ చివరలో భారతీయ జైళ్లలో సంభవించే మరణాలపై సమాచారాన్ని ప్రచురిస్తుంది. ఇది జైళ్లలో మరణాలకు సంబంధించి బహిరంగంగా అందుబాటులో ఉన్న ఏకైక సమాచారం. అయితే ఇలాంటి మరణాలకు అడ్డుకట్ట వేయటంలో ప్రభుత్వాలు మాత్రం తగిన శ్రద్ధను చూపటం లేదు. మరణాలను ఆపటం కోసం జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) పలు సలహాలను, సూచనలను చేసింది. ఖైదీల మరణాలపై ఆందోళన వ్యక్తం చేసింది. జైళ్లలో వైద్యాధికారులు, సిబ్బంది కొరతను లేవనెత్తింది. నిఘాను పెంచాలని సూచించింది.

మానసిక ఆరోగ్య సమస్యలతో ఆత్మహత్యలు

సహజ, అసహజ మరణాల కింద ప్రతి ఏడాదీ భారతీయ జైళ్లలో 1800 మంది చనిపోతున్నారు. 2021లో ఈ సంఖ్య పెరిగి 2116కు చేరింది. భారతీయ జైళ్లలో భయంకరంగా పెరుగుతున్న ఈ మరణాలకు అడ్డుకట్ట వేయటం కోసం 21 పేజీలతో కూడిన సలహాలతో ఎన్‌హెచ్చార్సీ ముందుకొచ్చింది. ఈ సలహా ఖైదీల స్వీయ–హానీ, ఆత్మహత్యాయత్నాలను తగ్గించే మార్గాలపై దృష్టి పెడుతుంది. జైళ్లలో జరిగే ఆత్మహత్యలు.. వైద్యపరమైన, మానసిక ఆరోగ్య సమస్యల వల్ల ఉత్పన్నమవుతున్నాయనే విషయాన్ని నొక్కి చెప్పింది. జైళ్లలో సిబ్బంది సంఖ్యను పెంచాలనీ, సిబ్బందికి తగిన శిక్షణను ఇవ్వాలని కోరింది. జైలులో ఉన్న వ్యక్తులను ప్రవేశస్థాయిలో పరీక్షించాలనీ, జైళ్లలో ఆత్మహత్యలను తగ్గించడానికి సహకార ఫ్రేమ్‌వర్క్‌తో పాటు 'అధిక ప్రమాదం' ఉన్న ఖైదీల పర్యవేక్షణకు ఇది సూచించింది. కాగా, ఇదే సలహాను ఎన్‌హెచ్‌ఆర్‌సి 2014లోనూ ఇచ్చింది. అయితే, దశాబ్ద కాలంలో ఈ మరణాలు తగ్గుముఖం పట్టకపోవటం గమనార్హం. దీంతో ఈ సారి మరింత సమగ్రమైన మార్గదర్శకాలను జారీ చేయాలన్న ఒత్తిడి కమిషన్‌పై పెరిగింది.

ఉన్న సిబ్బందిపై పని భారం

ఎన్‌హెచ్‌ఆర్‌సి ఇచ్చిన సలహాలో ప్రధానమైనది సిబ్బంది కొరత. 2021 ఎన్సీఆర్బీ సమాచారం ప్రకారం.. దేశవ్యాప్తంగా ఉన్న 1319 జైళ్లలో వైద్య అధికారుల కోసం మొత్తం మంజూరైన స్థానాల సంఖ్య 3,497గా ఉన్నది. దీంతో సగటున రోజువారీన ఒక్క వైద్య అధికారికి 122 మందికి పైగా ఖైదీలను చూసుకోవాల్సిన బాధ్యత ఉంటుంది. అయితే, ప్రస్తుతమున్న మెడికల్ అధికారుల సంఖ్య 2080 కాగా.. ఒక్కో ఆఫీసర్‌కు 276 మంది ఖైదీల ఆరోగ్య సంరక్షణను చూసుకోవాల్సిన బాధ్యత ఉంటుంది. దీంతో అధికారులు, సిబ్బందిపై పని భారం పెరుగుతున్నది.

బయటి ఆస్పత్రులకు ఖైదీలు

జైళ్లలో వైద్యాధికారులు లేకపోవటంతో ఖైదీలను తరచూ బయటి ఆస్పత్రులకు తరలించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఎన్సీఆర్బీ సమాచారం ప్రకారం.. 2021లో 4,36,732 మంది ఖైదీలను బయటి ఆస్పత్రులకు తీసుకెళ్లారు. జైలులో సంభవించే మరణాలలో దాదాపు అన్నీ సహజ మరణాలుగా పేర్కొనబడుతున్నాయి. మొత్తం ఖైదీలలో 9,180 మంది మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారు. ఆత్మహత్యలను ఎదుర్కోవడానికి మరిన్ని సిసిటివిలు, ఖైదీలపై 24 గంటల నిఘా ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్చార్సీ సూచించింది.

గొర్రెలు కొనాలంటేనే భయం

- బక్రీద్‌నూ వదలని బిజెపి నేతలు

న్యూఢిల్లీ : ఉమ్మడి పౌరస్మృతి (యుసిసి)కి అనుకూలంగా ప్రజాభిప్రాయాన్ని మార్చేందుకు ఓ వైపు ప్రయత్నిస్తూనే మరోవైపు ముస్లింలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విద్వేషపూరిత వాతావరణాన్ని సృష్టించేందుకు సంఘ్ పరివార్, బిజెపి నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. బక్రీద్ సందర్భంగా గొర్రెలను కొనుగోలు చేసేందుకు సైతం ముస్లింలు భయపడే పరిస్థితిని కల్పించారు. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలోనూ, పారిశ్రామిక నగరం కాన్పూర్‌లోనూ, ఉత్తరాఖండ్‌లోని భొవాలీ నగరంలోనూ నివసిస్తున్న ముస్లింలకు భయపెట్టేలా సందేశాలు పంపుతున్నారు. బక్రీద్ సందర్భంగా గొర్రెలను కొనుగోలు చేసి ఇంటికి తెచ్చినందుకు ముంబయిలోని జెపి ఇన్‌ఫ్రా సొసైటీ ప్రాంతంలో 11 మందిపై కేసులు నమోదు చేశారు. ఆ ప్రాంతంలో భక్తులుగా చెప్పుకుంటున్న కొందరు వ్యక్తులు కవ్వింపు చర్యలకు దిగుతూ హనుమాన్ చాలీసా పారాయణం మొదలు పెట్టారు. దానిని వీడియో తీసి సామాజిక మాధ్యమాలలో వైరల్ చేశారు. ఇంకేముంది? వార్తా ఛానల్స్‌కు మేత దొరికింది. హిందూ–ముస్లిం చర్చలు ప్రారంభించాయి. తమ విలేకరులను కొన్ని సొసైటీలలో నియమించి, ఎక్కడైనా గొర్రెలు కన్పిస్తాయేమో చూడండంటూ పురమాయించాయి. అది 'ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం' అట. హిందూత్వకు బ్రాండ్ అంబాసిడర్‌గా చెప్పుకునే యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ రంగంలోకి దిగారు. సున్నితమైన, సమస్యాత్మకమైన ప్రాంతాలలో భద్రతను కట్టుదిట్టం చేయాలని, అసాంఘిక శక్తుల ఆట కట్టించాలని అధికారులను ఆదేశించారు. ఆదిత్యనాథ్ ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసు అధికారులు మొరాదాబాద్‌లోని ఓ కాలనీకి చేరుకొని జంతువులేవీ లోపల కన్పించకూడదని హుకుం జారీ చేశారు. ఒకవేళ దొరికితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దేశంలో కులం, మతం ప్రాతిపదికన ఎవరి పైనా వివక్ష చూపబోమంటూ ప్రధాని మోడీ అమెరికాలో చేసిన ప్రకటనను ఈ పరిణామాలు అపహాస్యం చేస్తున్నాయి. బక్రీద్ రోజు ముస్లింలు తమ మత విశ్వాసాలలో భాగంగా గొర్రెలను త్యాగం చేస్తారు. మరి ఇప్పుడు మోడీజీ, యోగీజీ చేస్తున్నదేమిటి? గొర్రెలను కొనుగోలు చేసేందుకే ముస్లింలు భయపడేటట్లు చేస్తున్నారు. గోవా నుండి హిమాచల్ ప్రదేశ్, ఉత్తరప్రదేశ్ వరకూ ఎక్కడ చూసినా ఇదే వాతావరణం.

పంద్రాగస్టు నుంచి పంచాయతీల్లో డిజిటల్ చెల్లింపులు తప్పనిసరి

కేంద్ర పంచాయతీరాజ్ శాఖ వెల్లడి

న్యూఢిల్లీ : దేశంలోని అన్ని పంచాయతీలూ డిజిటల్ చెల్లింపుల వినియోగాన్ని కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేయనుంది. వచ్చే స్వాతంత్ర్య దినోత్సవం రోజున పంచాయితీలన్నీ యుపిఐ ఆధారిత చెల్లింపులకు అనువైనవిగా ప్రకటించి, అదే రోజు నుంచి డిజిటల్ చెల్లింపులను తప్పనిసరి చేయనున్నట్లు కేంద్ర పంచాయితీరాజ్ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ మేరకు రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఒక లేఖ రాసింది. వివిధ రకాల అభివృద్ధి పనులకు చెల్లింపులు, రెవెన్యూ బిల్లుల సేకరణ అన్నీ కూడా డిజిటల్ పద్ధతిలోనూ జరగాలని నిర్దేశించనున్నట్లు తెలిపింది. ముఖ్యమంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలను ఆహ్వానించి స్వాతంత్ర్య దినోత్సవం రోజున అన్ని పంచాయితీలు ఈ మేరకు ప్రకటన చేయాలని సూచించింది. ఇప్పటికే 98 శాతం పంచాయితీలు యుపిఐ ఆధారిత చెల్లింపులు చేస్తున్నట్లు పంచాయితీ రాజ్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి సునీల్ కుమార్ చెప్పారు.

బ్రెజిల్ పునరాగమనం !

- బహుళ ధ్రువ ప్రపంచం సాకారం దిశగా అడుగులు
- బ్రిక్స్ సదస్సుకు ముందు మిత్రకూటమి ఏర్పాటుకు సన్నాహాలు

బ్రెసిలియ : ఈ సంవత్సరారంభంలో బ్రెజిల్ అధ్యక్షునిగా ఎన్నికైన వర్కర్స్ పార్టీ నేత లూయిజ్ ఇనాషియో లూలా డిసిల్వా తాను గత రెండుసార్లు అధికారంలో ఉన్నప్పటిలా (2003–2010) క్రియాశీల విదేశాంగ విధానాన్ని అనుసరిస్తున్నారు. బోల్సొనారో పాలనలో అనేక సంవత్సరాలుగా ఒంటరిగా మిగిలిపోయిన బ్రెజిల్ ఇప్పుడు అంతర్జాతీయ యవనికపైకి 'బ్రెజిల్ పునరాగమనం' అనే నినాదంతో ముందుకు వచ్చింది.

అమెరికా, చైనా, ఫ్రాన్స్‌లతో సహా పది దేశాల్లో పర్యటించిన లూలా అమెరికా, ఐరోపాల ఆధిపత్యాన్ని అధిగమించటానికి 'బహుళ ధ్రువ ప్రపంచం' ఆవిర్భవించటమే ఏకైక మార్గమని చెబుతున్నారు. తన ప్రయత్నంలో భాగంగా మే 30న బ్రాసిలియాలో 12దక్షిణ అమెరికా దేశాల అధ్యక్షుల, అధికారుల సదస్సును నిర్వహించారు. ఇది 2008లో ఏర్పాటైన దక్షిణ అమెరికా దేశాల యూనియన్‌ను పోలివుంది. ఇది అప్పటి వామపక్ష ప్రభుత్వాల కృషితో ఏర్పడింది. గత దశాబ్దం ద్వితియార్థంలో లాటిన్ అమెరికాలో ప్రగతి నిరోధక ప్రభుత్వాలు ఏర్పడటంతో ఈ యూనియన్ నిర్వీర్యమైంది. ఆ తరువాత అర్జంటీనా, కొలంబియావంటి దేశాల్లో వామపక్ష ప్రభుత్వాలు ఏర్పడిన తరువాత ఈ యూనియన్ తిరిగి ఊపిరిపోసుకుంది.

అయితే ఈ దక్షిణ అమెరికా దేశాల యూనియన్ పున్ణప్రతిష్ట చేయటానికిగల ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులు 15సంవత్సరాల క్రితంకంటే పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. 21వ శతాబ్దం ఆరంభంలో లాటిన్ అమెరికా దేశాలు చైనాతో వాణిజ్య సంబంధాలు పెట్టుకుని బాగా లాభపడ్డాయి. కోవిడ్ మహమ్మారి కారణంగా నేటి దక్షిణ అమెరికాలో సామాజిక అసమానతలు తీవ్రంగా పెరిగాయి. అంతేకాకుండా అమెరికా, నాటో దేశాల దన్నుతో నడుస్తున్న ఉక్రెయిన్ యుద్ధంవల్ల ఈ ప్రాంతంలో ఆర్థిక, సామాజిక, రాజకీయ ఒత్తిడులు ఎక్కువయ్యాయి. దక్షిణ అమెరికాలోని ప్రతి దేశాధ్యక్షులు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. సైన్యంతో ఘర్షణ పడుతున్నారు. చైనాతో, కొంతవరకు రష్యాతో కూడా తమకున్న వాణిజ్య సంబంధాలను కొనసాగించటానికి అడ్డంకిగావున్న సామ్రాజ్యవాదాన్ని అధిగమించటానికి నానా తంటాలు పడుతున్నారు.

దక్షిణ అమెరికా దేశాల యూనియన్ "గ్లోబల్ సౌత్"గా పిలువబడే అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాలను ప్రతిబింబిస్తుందని లూలా అన్నారు. లూలా అవగాహనలో ఇది సంపన్న దేశాలకు ఉపయోగపడే ప్రస్తుతమున్న ప్రపంచ వాణిజ్య సంస్థవంటి 'గ్లోబల్ పాలనా ఫోరమ్‌ల'కు భిన్నమైనది. లాటిన్ అమెరికా 4ట్రిల్లియన్ డాలర్ల(ఒక ట్రిల్లియన్ 1000 బిలియన్లు. ఒక బిలియన్ 100కోట్లు) ఆర్థిక వ్యవస్థ. ఈ దేశాల జనాభా 45కోట్లు. కావలసినన్ని సహజవనరులు, పారిశ్రామిక అభివృద్ధికి అవసరమైన ఖనిజ సంపద ఈ దేశాల్లో ఉన్నాయి. "మారుతున్న ప్రపంచం"లో దక్షిణ అమెరికా తనదైన పాత్రను పోషించటానికి ఇది చాలని లూలా అభిప్రాయపడుతున్నారు.

బ్రిక్స్ బ్యాంకు పేరుతో పిలువబడుతున్న న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు(ఎన్‌డిబి) వార్షిక సమావేశం జరుగుతున్న నేపథ్యంలో బ్రెజిల్‌లో దక్షిణ అమెరికా దేశాల సదస్సు జరిగింది. బ్రిక్స్ దేశాల వార్షిక సమావేశం ఆగస్టు నెలలో దక్షిణ ఆఫ్రికాలో జరగనుంది. ఈ బ్రిక్స్ వార్షిక సమావేశంలో బ్రిక్స్ దేశాలకు ఒకే ఒక కరెన్సీని ఏర్పాటుచేసుకోగలిగే సాధ్యత గురించి చర్చ జరుగుతుంది. ఇది అమెరికన్ డాలర్‌కు ప్రత్యామ్నాయ పాత్రను పోషించటంవల్ల వివిధ దేశాల మధ్య వాణిజ్య విస్తరణను వేగవంతం చేస్తుంది. బ్రిక్స్ లోను, ఎన్‌డిబిలోను సభ్యత్వాన్ని పెంచటానికి ఉపయోగపడుతుంది. ఇప్పటికే అనేక దేశాలు బ్రిక్స్ లో చేరటానికి సిద్ధంగా ఉన్నాయి.

ఒకవైపు అమెరికా ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపకుండా దీర్ఘకాలం కొనసాగేలా చేయటానికి ప్రయత్నించటాన్ని, మరోవైపు తైవాన్ సమస్యపైన చైనాను పదేపదే రెచ్చగొట్టటాన్ని చూస్తుంటే లాటిన్ అమెరికాను తన కబంధ హస్తాలనుంచి అమెరికా అంతతేలికగా చేజారనీయదనేది సుస్పష్టం. ఏదో ఒక ప్రళయాన్ని సృష్టించకుండా అంత తేలికగా అమెరికా తన ఆధిపత్యాన్ని(ఏక ధ్రువ ప్రపంచం) వదులుకుని 'బహుళ ధ్రువ ప్రపంచం' ఆవిర్భవించటాన్ని చూస్తూ ఊరుకోదు. గత శతాబ్దంలో సంభవించిన రెండు ప్రపంచ యుద్ధాల కష్టనష్టాల నుంచి తప్పించుకున్న దక్షిణ అమెరికా ఈ శతాబ్దంలో జరుగుతున్న సామ్రాజ్యవాద యుద్ధాల పర్యవసానాలను తప్పించుకోజాలదు. అయితే ఈ శతాబ్దంలో జరిగిన, జరుగుతున్న యుద్ధాలు అమెరికా ఆర్థిక వ్యవస్థను సంక్షుభితం చేయటంతోపాటుగా ప్రపంచం మీద అమెరికా సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని బలహీనపరుస్తున్నాయి. అదే దక్షిణ అమెరికా స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలకు ఆశాకిరణం అవుతుంది.

దక్షిణ అమెరికాలో వడగాల్పులు

- 17 మంది మృతి

హ్యూస్టన్ : దక్షిణ అమెరికా రాష్ట్రాల్లో గత కొన్ని రోజుల నుంచి వడగాల్పులు ప్రతాపం చూపుతున్నాయి. వడదెబ్బకు గురై 17 మంది మరణించారు. వీరిలో 11 మంది 60 ఏళ్లు పైబడినవారే. ఈ విషయాన్ని టెక్సాస్‌లోని మెడికల్ ఎగ్జామినర్ డాక్టర్ కోరిన్నీ స్టెర్న్ తెలిపారు. 'ఇంతకు ముందు ఎన్నడూ ఇంతటి ఉష్ణోగ్రతలను చూడలేదు' అని కోరిన్నీ చెప్పారు. కాగా వడదెబ్బకు గురైనవారిలో 14 ఏళ్ల బాలుడు కూడా ఉన్నాడు. గత శుక్రవారం టెక్సాస్‌లోని బిగ్ బెండ్ నేషనల్ పార్క్‌లో సదరు బాలుడు మరణించాడు. ఆ రోజున 48 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదయింది. ఇది టెక్సాస్ రాష్ట్ర చరిత్రలోనే రెండో అత్యధిక ఉష్ణోగ్రత. మరోవైపు వివిధ జైళ్లలో ఉన్న తొమ్మిది మంది ఖైదీలు గుండెపోటు లేదా గుర్తు తెలియని కారణాలతో మరణించారు. వీరిలో కొంతమంది వడదెబ్బకు సంబంధించిన కారణాలతో కూడా మరణించి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. 11 ఏళ్ల కిందట కూడా అధిక ఉష్ణోగ్రతల కారణంగా అమెరికాలోని పలు జైళ్లలో ఖైదీలు చనిపోయారు.

మెక్సికో సరిహద్దు ప్రాంతాల్లోనూ వడదెబ్బ మరణాలు సంభవిస్తున్నాయి. మెక్సికో సరిహద్దుకు సమీపంలోని సన్‌ల్యాండ్ పార్క్ ప్రాంతంలో గత వారం నుంచి ఐదు మృతదేహాలను గుర్తించారు. ఇవి వలసదారులవా.. కాదా.. అనే విషయాన్ని గుర్తించాల్సివుంది. మరొకొన్ని ప్రాంతాలకు వేడిగాలులు విస్తరిస్తాయని, రాబోయే ఆరురోజుల పాటు ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయని యుఎస్ నేషనల్ వెదర్ సర్వీస్ అంచనా వేసింది. వేడి గాలులతో విద్యుత్ వినియోగం ఆల్‌టైమ్ గరిష్ట స్థాయికి చేరుకుంటుంది.

మాంద్యం ముంగిట అమెరికా, పశ్చిమ దేశాలు

- హెచ్ఎస్‌బిసి

న్యూయార్క్ : అమెరికాలో ఈ ఏడాది 4వ త్రైమాసికంలో మాంద్యం సంభవించే అవకాశం ఉందని బ్రిటిష్ బ్యాంకు హెచ్ఎస్‌బీసీ పేర్కొంది. వచ్చే సంవత్సరంలో పశ్చిమ ఐరోపాలోనూ మాంద్యం ఏర్పడే అవకాశం ఉందని కూడా హెచ్ఎస్‌బిసి అంటోంది. అనేక ఆర్థిక వ్యవస్థల స్టాక్, బాండ్ మార్కెట్లు విత్త, ద్రవ్య విధానాలతో సరిపోలకపోవటంవల్ల మాంద్యం ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్ఎస్‌బిసి ఎస్సెట్ మేనేజ్‌మెంట్ సంవత్సరం మధ్యలో అంచనా వేసింది. ఆర్థిక వ్యవస్థలో ఇప్పటికీ కొన్ని విభాగాలు పటిష్టంగా ఉన్నప్పటికీ మిగిలిన విభాగాల క్షీణత మాంద్యం సంభవించే అవకాశాన్ని చూచిస్తోంది. అమెరికాతో పోల్చినప్పుడు ఐరోపా పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ స్థూలంగా చూసినప్పుడు వీటి మధ్య సారూప్యత కనపడుతోందని హెచ్ఎస్‌బీసీ గ్లోబల్ చీఫ్ స్ట్రాటజిస్ట్, జోసెఫ్ లిటిల్ తన నివేదికలో పేర్కొన్నారు.

బ్రిటిష్ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసిన ద్రవ్యోల్బణాన్ని అరికట్టటం కోసం బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ (బిఒఇ) తన వడ్డీరేటును గత 15 సంవత్సరాలలో ఎన్నడూలేనంతగా 5శాతానికి పెంచిన తరువాత వారానికి ఈ హెచ్చరికను చేయటం జరిగింది. మే నెలలో అమెరికా ఫెడరల్ రిజర్వ్ మరోసారి వడ్డీరేటును 5.25శాతానికి పెంచింది. ఇది 2007 తరువాత అత్యంత అధికం. ఇదే కాలంలో యూరో జోన్‌లో ద్రవ్యోల్బణాన్ని అరికట్టటానికి యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ (ఇసిబి) యూరోజోన్ వడ్డీరేటును 3.75 శాతానికి పెంచింది. ఇవన్నీ పశ్చిమ దేశాలలో మాంద్యం ఆగమనానికి సూచికలుగా ఉన్నాయి.

అమెరికానే దెబ్బతీస్తున్న ఆంక్షల వ్యసనం

న్యూయార్క్ : వివిధ సంస్థలపై ఆంక్షలు విధించుకుంటూ వెళుతున్న అమెరికా ప్రభుత్వ వ్యసనం చివరికి ఆ దేశ వ్యవస్థనే దెబ్బతీస్తోందని వాషింగ్టన్ పోస్ట్ ఒక కథనంలో వెల్లడించింది. ఈ ఏడాది ప్రారంభం నాటికి అమెరికా ప్రభుత్వ ఆంక్షల చట్రం కింద సుమారు 12 వేల సంస్థలు ఉన్నట్లు ఈ కథనం వెల్లడించింది. 2021 చివరి నాటికి ట్రెజరీ విభాగం అంచనా ప్రకారం 9,421 సంస్థలపై ఆంక్షలు విధించారు. గత 20 ఏళ్ల నుంచి ఇది సుమారు 900 శాతం పెరిగింది. 2022లో ట్రెజరీ విభాగం కొత్తగా 2,549 సంస్థలపై ఆంక్షలు విధించింది. కేవలం 225 సంస్థలపై ఆంక్షలను తొలగించింది. ఆంక్షల కారణంగా ఎగుమతులు లేకపోవడం, పన్నులు పెంచాల్సి రావడం, విదేశీ పెట్టుబడులు క్షీణించడం వంటి ఇబ్బందులను అమెరికా ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటుంది.

ట్రాన్స్‌జెండర్లకు 'గౌరవం'

- ఉపాధి కల్పనకు కేరళ కొత్త పథకం

తిరువనంతపురం : ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి కల్పించేందుకు 'గౌరవం' (ప్రైడ్) పేరుతో కేరళలోని వామపక్ష ప్రజాతంత్ర కూటమి (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వం కొత్త పథకాన్ని ప్రారంభించింది. ఈ ప్రాజెక్టును ముఖ్యమంత్రి పినరయి విజయన్ బుధవారం నాడు లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను ఆయన సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. 'ప్రైడ్' ప్రాజెక్టు ద్వారా ట్రాన్స్‌జెండర్లకు వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రాయోజిత నాలెడ్జ్ ఎకానమీ మిషన్, సామాజిక న్యాయ శాఖ సంయుక్త నిర్వహణలో ఈ 'ప్రైడ్' ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. 2026 నాటికి 20 లక్షల మందికి ఉపాధి కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించి ఆ దిశగా వివిధ వినూత్న పథకాలను ప్రవేశపెడుతున్న సంగతి విదితమే. ప్రైడ్ కూడా ఇందులో భాగంగానే రూపొందించారు. ట్రాన్స్‌జెండర్లకు సమాజంలో అందరితో పాటే సమాన గౌరవం దక్కాలనే ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించినట్లు విజయన్ తెలిపారు. 'ఉపాధి కోసం ట్రాన్స్‌జెండర్లు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకూ ప్రైడ్ ప్రాజెక్టు పరిష్కారం చూపుతుంది. సమాజంలో మంచి ఉపాధి అవకాశాలు పొందాలనే ట్రాన్స్‌జెండర్ల ఆకాంక్షను ఈ పథకం సాకారం చేస్తుంది' అని విజయన్ పేర్కొన్నారు. ట్రాన్స్‌జెండర్ల సామాజిక తరగతి అభ్యున్నతికి కేరళ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ పథకం ఎంతో దోహదం చేస్తుందని సిపిఎం అభినందనలు తెలిపింది. ఈ మేరకు ఫేస్‌బుక్ అధికారిక పేజీల్లో ఆ పార్టీ పోస్టు చేసింది.

యుసిసిపై విస్తృత చర్చలు అవసరం

- అన్ని మతాల పైన ప్రభావం చూపుతుంది
- దానిని మత రాజకీయాల నుండి విడదీయండి
- ఆంగ్ల పత్రికల సంపాదకీయాల్లో వెల్లడి

న్యూఢిల్లీ : ఉమ్మడి పౌరస్మృతి (యుసిసి) కేవలం ముస్లింల పైన మాత్రమే ప్రభావం చూపదని ఆంగ్ల పత్రికల సంపాదకులు అభిప్రాయపడ్డారు. అది అన్ని మతాల వారి పైన ప్రభావం చూపుతుందని, అందువల్ల దానిపై ఏ నిర్ణయమైనా తీసుకునే ముందు విస్తృత స్థాయిలో చర్చించాల్సి ఉంటుందని వారు సూచించారు. యూసీసీని మత రాజకీయాల నుండి వేరు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. యుసిసిపై అభిప్రాయాలు తెలియజేయాల్సిందిగా జాతీయ లా కమిషన్ ఇటీవలే దేశ ప్రజలను కోరింది. ఈ నేపథ్యంలో వివిధ ఆంగ్ల పత్రికలు దానిపై సంపాదకీయాలు ప్రచురించాయి. దేశ పౌరులందరి పైనా ప్రభావం చూపే ఇలాంటి అంశాలను రాజకీయ నిర్బంధాలు శాసించకూడదని సంపాదకులు స్పష్టం చేశారు.

ఒకే గాట కట్టొద్దు

రామమందిర నిర్మాణం, ఆర్టికల్ 370 రద్దు హామీలను, యుసిసిని ఒకేలా చూడరాదని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక తెలిపింది. 'మిగిలిన రెండు హామీలను నెరవేర్చిన విధంగానే లోక్‌సభ ఎన్నికల లోగా మూడో హామీని కూడా నెరవేర్చాలని బిజెపి అత్యుత్సాహం ప్రదర్శిస్తోంది. అయితే యూసీసీ భిన్నమైనదని ఆ పార్టీ గుర్తించాలి. దీనిపై నిర్ణయం తీసుకునే ముందు సంప్రదింపులు జరపాల్సిన అవసరం ఉంది. యూసీసీ భిన్నమైనదన్న విషయాన్ని బిజెపి నాయకత్వం గుర్తించాలి. ఎందుకంటే అది దేశ పౌరులందరినీ స్పృశిస్తుంది. వారి జీవన విధానంలోకి, వ్యక్తిగత జీవితాలలోకి తొంగిచూస్తుంది. మత రాజకీయాలతో కూడిన వాతావరణంలో గుడ్డిగా నిర్ణయాలు తీసుకోకుండా సంయమనం పాటిస్తూ, అందరినీ సంప్రదించి నిర్ణయానికి రావాలి. యూసీసీ అనేది ముస్లింల పైనే కాదు. హిందువులు, ఇతర మైనారిటీలు, గిరిజనుల పైన కూడా ప్రభావం చూపుతుంది' అని తన సంపాదకీయంలో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ అభిప్రాయం వ్యక్తం చేసింది.

తొందరపాటు తగదు

ఆధిపత్య మతానికి సంబంధించిన చట్టాలకు యుసిసి బ్లూప్రింట్ మాదిరిగా పనిచేస్తుందన్న ఆందోళన ఉందని హిందుస్థాన్ టైమ్స్ తన సంపాదకీయంలో వ్యాఖ్యానించింది. మైనారిటీలు తమ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోకుండా ఇది నిరోధిస్తుందని తెలిపింది. 'వివాహం, విడాకులు, వారసత్వం, నిర్వహణ వంటి విషయాలలో మహిళలను బలహీనుల్ని చేస్తుంది. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను వ్యక్తిగత చట్టాలు ఉల్లంఘించేలా ఉండకూడదు. యూసీసీపై నిర్ణయం తీసుకునే ముందు విస్తృతంగా సంప్రదింపులు జరపాల్సిన అవసరం ఉంది. తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదు. జాగరూకతతో, అనుభవంతో, రాజనీతిజ్ఞతతో, దయతో ముందడుగు వేయాల్సి ఉంటుంది' అని హిందుస్థాన్ టైమ్స్ సంపాదకీయం తెలిపింది.

పెరుగుతున్న అడవుల నరికివేత

న్యూఢిల్లీ : ప్రపంచ దేశాలలో అడవుల నరికివేత పెరుగుతూనే ఉంది. అడవుల సంరక్షణకు ఇచ్చిన పాలకులు హామీలు నీటి మూటలుగా మిగిలిపోతున్నాయి. గ్లోబల్ ఫారెస్ట్ వాచ్ (జీఎఫ్‌డబ్ల్యూ) అనే సంస్థ అందించిన నివేదిక ప్రకారం బ్రెజిల్‌లో అమెజాన్ అడవుల నరికివేత యథేచ్ఛగా సాగుతోంది. గత సంవత్సరం 3,900 చదరపు మైళ్ల విస్తీర్ణంలోని అడవులు అదృశ్యమయ్యాయి. ప్రతి ఐదు సెకన్లకు ఫుట్‌బాల్ పిచ్ విస్తీర్ణమంత అడవులు కనుమరుగవుతున్నాయి. గత సంవత్సరంతో పోలిస్తే అడవుల నరికివేత ఈ ఏడాది 10% పెరగడం ఆందోళన కలిగిస్తోంది. మొత్తంమీద గత సంవత్సరం 15,800 చదరపు మైళ్ల ఉష్ణ మండలపు వర్షాధార అడవులు అదృశ్యమయ్యాయని జీఎఫ్‌డబ్ల్యూ నివేదిక తెలిపింది. పురాతన అడవులు వాతావరణాన్ని పరిరక్షించడంలో క్రియాశీలక పాత్ర పోషిస్తాయని నివేదిక వివరించింది. ఈ దశాబ్దం చివరి నాటికి అడవుల నరికివేతను నిలువరిస్తామని గత సంవత్సరం 145 దేశాలు ప్రతినబూనాయి. అయితే అనుకున్నదొకటి అయింది మరొకటి అన్న చందంగా అడవుల నరికివేత కొనసాగుతూనే ఉంది. బ్రెజిల్ తర్వాత కాంగో, బొలీవియా దేశాలలో అడవుల నరికివేత అధికంగా జరుగుతోంది. బొలీవియాలో వ్యవసాయాధారిత వ్యాపారాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తుండడంతో అక్కడ అడవులను యథేచ్ఛగా నరుకుతున్నారు. ఈ నేపథ్యంలో అడవుల నరికివేతకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇథియోపియోలో ఆకలిచావులు

- అమెరికా సాయం నిలిచిపోవడంతో 700 మంది మృతి

న్యూయార్క్ : అమెరికా, ఐక్యరాజ్య సమితి ఆహార సాయం నిలిపివేయడంతో ఇథియోపియోలోని ఉత్తర టిగ్రే ప్రాంతంలో ఆకలి కేకలు విజృంభిస్తున్నాయి. ఆకలితో 700 మంది పైగా మరణించారని స్థానిక అధికారులు తెలిపారు. ఆహార సాయంగా అందిస్తున్న గోధుమలు, ఇతర పదార్థాలు దొంగతానికి గురవుతున్నాయని పేర్కొంటూ ఈ ఏడాది మార్చిలో టిగ్రేకు ఆహార సాయాన్ని అమెరికా, ఐరాస నిలిపివేశాయి. ఈ నిలిపివేతను జూన్‌లోనూ పొడిగించారు. దీంతో సుమారు 2 కోట్ల మంది ప్రభావితమయ్యారని అధికారులు తెలిపారు. ఆహార సాయం నిలిపివేసినప్పటి నుంచి ఇప్పటి వరకూ టిగ్రేలో 728 మంది మరణించారని చెప్పారు. ఇంకా అనేక మంది చావు బతుకుల మధ్య ఉన్నారని చెప్పారు. అలాగే అనేక మంది ఇతర ప్రాంతాలకు ఆహారం కోసం తరలివెళ్లిపోతున్నారని తెలిపారు. అంతర్యుద్ధం కారణంగా సమారు రెండేళ్ల నుంచి ఇథియోపియోలో ఆహార సంక్షోభం ఏర్పడింది. సాయంగా అందచేసిన ఆహార పదార్థాలు స్థానిక మార్కెట్లలో విక్రయించడానికి సిద్ధంగా ఉంటూ దొరికాయని చెబుతూ అమెరికా, ఐరాసలు ఆహార సాయాన్ని నిలిపివేశాయి.

మణిపూర్‌లో రాహుల్

(మొదటి పేజీ తరువాయి)

హింసాత్మక ఘటనలు పునరావృతమయ్యే అవకాశముందంటూ రాహుల్ కాన్వాయ్‌ను బిష్ణుపూర్‌లో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో రాహుల్ తిరిగి ఇంఫాల్‌కు వచ్చి, అక్కడి నుంచి హెలికాప్టర్‌లో చురాచాంద్‌పుర్‌కు వెళ్లారు..

ముందు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం రాహుల్ చురాచాంద్‌పుర్ శిబిరాల్లో తలదాచుకుంటున్న ప్రజలతో మొదట మాట్లాడతారు. శుక్రవారం ఇంఫాల్‌లోని శిబిరాల్లో ఉన్న ప్రజలను పరామర్శించనున్నారు. మణిపూర్‌లో మే 3 నుంచి హింసాకాండ కొనసాగుతున్న సంగతి తెలిసిందే.

ప్రజాస్వామ్యంలో ఇలాంటి ఘటనలకు తావు లేదు : కాంగ్రెస్

మణిపూర్‌లో రాహుల్‌గాంధీ పర్యటనను పోలీసులు అడ్డుకోవడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. ప్రజాస్వామ్యంలో ఇలాంటి ఘటనలకు తావు లేదని పేర్కొంది. బిజెపి నిరంకుశ పద్ధతులను అనుసరిస్తుందని, 'మణిపూర్‌లో సహాయక శిబిరాల్లో ఉంటున్న ప్రజలను కలవడానికి వెళ్లిన రాహుల్‌ను అడ్డుకోవడం అప్రజాస్వామికమని వ్యాఖ్యానించింది. మణిపూర్‌పై ప్రధాని మోడీ మూగనోము పాటిస్తున్నారు. కనీసం అటువైపు తొంగిచూడడానికి కూడా ఇష్టపడడం లేదు. ఈ పరిస్థితుల్లో రాహుల్ గాంధీ వారిని ఊరడించేందుకు వెళితే ఆయనను అడ్డుకుంటున్నారని కాంగ్రెస్ విమర్శించింది. 'ఇలాంటి చర్యలు రాజ్యాంగ, ప్రజాస్వామ్య విలువలను విచ్ఛిన్నం చేస్తాయి' అని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ట్వీట్ చేశారు.

మీ కోసం

ఒక గ్లాసు నీళ్లల్లో నాలుగు వెల్లుల్లి రెబ్బలను దంచి వేసి ఈగలు వస్తున్న ప్రదేశంలో పెడితే ఈగల బెడద ఉండదు.

జీవన సౌరభం

లక్ష్యముండటమే కాదు, దాన్ని ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా సాధించుకునే వ్యూహ నైపుణ్యం కూడా ఉండాలి.

తెలివైన కోతి



ఒక అడవిలో సింహం, నక్క స్నేహంగా ఉండేవి. అయితే, ఇవి రెండూ స్నేహితులన్న విషయం మిగతా జంతువులకు, పక్షులకు తెలియదు. నక్క అడవిలోని జంతువులకు మాయమాటలు చెప్పి సింహం గుహ వైపు వెళ్లేలా పన్నాగం పన్నేది. అలా అనేక జంతువులను సింహానికి ఎరగా వేసేది. సింహం తినగా, మిగిలిన మాంసాన్ని అది తినేది.

ఒకరోజు కుందేలు వస్తుండగా నక్క చూసింది. దాని దగ్గరికి వెళ్లి 'అయ్యో మిత్రమా... నీ బిడ్డ చిట్టి కుందేలు ఇప్పుడే సింహం గుహ వైపు వెళ్లటం చూశాను. తొందరగా వెళ్లి కాపాడుకో' అని జాలిగా చెప్పింది. ఆ మాటలు నమ్మిన కుందేలు వేగంగా సింహం గుహ వైపు పరుగెత్తింది. బండరాయిపై కూర్చుని ఉన్న సింహం ఒక్క ఉదుటన కుందేలు మీదకి దూకి తినేసింది. 'మిత్రమా నీ తెలివి వల్ల ఈ రోజు రుచికరమైన ఆహారం దొరికింది' అన్నది సింహం. ఆ మాటలకు ఉప్పొంగి పోయింది నక్క.

చెట్టు పైన కూర్చున్న కోతి ఇదంతా గమనించసాగింది. కుందేలు సింహానికి బలవడం చూసి చాలా బాధపడింది. ఈ విషయాన్ని అడవిలోని జంతువులకు చెప్పింది. నక్కతో జాగ్రత్తగా ఉండమని హెచ్చరించింది.

ఒక రోజు కోతి సీతాఫల పండ్లను తింటూ చెట్టు కొమ్మపై కూర్చుని ఉంది. దానిని చూసింది నక్క., 'ఈరోజు ఎలాగైనా కోతి మాంసం తినాలి' అని మనసులో అనుకుంది. 'కోతి బావ... నువ్విక్కడ తీరిక పండ్లు తింటూ కూర్చున్నావు. నీ బిడ్డ సింహం గుహ వైపు వెళుతుంది. వెళ్లి కాపాడుకో' అన్నది. నక్క బుద్ధిని గ్రహించిన కోతి ఎలాగైనా దానికి గుణపాఠం చెప్పాలనుకుంది.

కోతి బండరాయి పక్కన బావికి దగ్గరగా నిల్చోని ఉంది. సింహం ఒక్క ఉదుటన దానిపై దూకింది. అప్రమత్తంగా ఉన్న కోతి చెంగున చెట్టు మీదికి ఎగిరింది. సింహం పట్టు తప్పి పక్కనే ఉన్న బావిలో జారి పడింది. పైకి రాలేక నీళ్లలో మునిగి చనిపోయింది. మిగిలిన జంతువులు నక్కను అడవి నుంచి తరిమేశాయి. కోతి తెలివికి జంతువులన్నీ సంబరపడిపోయాయి.

- షేక్ రిజ్వానా
9 వ తరగతి, జెడ్‌పిహెచ్‌ఎస్, మేళ్ళచెరువు.

దారి చూపండి

చిన్నారులూ, ఇక్కడ ఉన్న కప్పకు బాగా ఆకలిగా ఉందట. ఈగలను తినేందుకు వెళుతుంది. మరి ఏ దారి గుండా వెళుతుందో చూపరూ!



నేను గీసిన బొమ్మ

-శిశిర రావిపాటి,
యూకేజీ,
డీన్స్ అకాడమీ,
బెంగళూరు,
కర్ణాటక.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పాత షూలకు కొత్త షో ...

'నాలుగు నెలల క్రితం కొన్న షూ అప్పడే పై భాగం ఊడిపోయింది...', 'సంవత్సరం వాడినా చెప్ప అడుగుభాగం అరగలేదు, కాని పై పట్టీలు ఊడిపోయాయి...'

ఇటువంటి అనుభవాలు చాలామందికి ఎదురవుతూనే ఉంటాయి. అప్పడు వాటిని పారేయలేము. అలా అని వాడకోవడానికీ ఉపయోగపడవు. కానీ, గ్రీన్‌సోల్ సంస్థకు ఇస్తే వారు వాటిని రీ మోడలింగ్ చేసి, కొత్త పాదరక్షలుగా మార్చి పేదవాళ్లకు, స్కూలు విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. క్రీడాకారులైన శ్రీయాన్స్, రమేష్ తొమ్మిదేళ్ల నుంచి ఈ మంచి పని చేస్తున్నారు.

ముంబైలో బ్యాచలర్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కోర్సు చదువుకోవడానికి వచ్చిన శ్రియాన్స్‌కి, రమేష్‌కి ఓ క్రీడా ప్రాంగణంలో పరిచయం ఏర్పడింది. ఓ కోచ్ దగ్గర ఇద్దరూ శిక్షణ పొందారు. వారి అభిప్రాయాలు, ఆలోచనలు ఒకటే కావడంతో స్నేహం బలపడింది. షూస్, బట్టలు పంచుకుంటూ పోటీల్లో పాల్గొనేవారు. అప్పటికే శ్రియాన్స్ విదేశాల్లో జరిగే పోటీల్లో పాల్గొని 100కి పైగా బహుమతులు గెలుచుకున్నాడు. దాంతో తరుచూ షూష్ కొనాల్సివచ్చేది. అవి నాలుగు, ఐదు నెలల కంటే ఎక్కువ రోజులు వచ్చేవి కావు. వాటిని పారేసి, కొత్తవి కొనుక్కునేవాడు. రమేష్ మాత్రం పాత షూస్‌ని చెప్పులుగా మార్చుకుని వాడుకునేవాడు. అవి మోడల్‌గా కనిపించడంతో శ్రియాన్స్‌కు కొత్త ఆలోచన వచ్చింది. క్రీడాకారులైనందున ప్రతి సంవత్సరం మూడు, నాలుగు ఖరీదైన షూస్‌లను కొనాల్సి వచ్చేది. వాటిని తిరిగి ఎలా వాడుకోవాలో అర్థం అయ్యేది కాదు. పై భాగం తొలగించి, సాధారణ చెప్పల్‌గా మార్చి వాడుకుంటున్న రమేష్ ఉపాయాన్ని చూసి శ్రియాన్స్‌లో ఆసక్తి కలిగింది. ఆ విధంగా 'గ్రీన్ సోల్' సంస్థకు పునాది ఏర్పడింది.

ప్రతి సంవత్సరం 35 కోట్ల జతల నాన్ బయోడిగ్రేడబుల్ బూట్లు వృథా అవుతున్నాయని తెలుసుకున్నారు. అదే క్రమంలో ఒకటిన్నర కోటి మంది పాదరక్షలు లేకుండానే తిరుగుతున్నారని, ఆ కారణంగా పాదాల ద్వారా సంక్రమించే వివిధ వ్యాధులతో బాధపడుతున్నారని గ్రహించారు. కార్బన్ ఉద్గారాల నుంచి పర్యావరణాన్ని రక్షించేలా వ్యాపారం ప్రారంభించి, పేదలకు పాదరక్షలు అందించాలనుకున్నారు.

ఇంటిని అద్దెకు తీసుకుని ...

2014లో ముంబైలో జరిగిన పోటీల్లో పాల్గొని, గెలుచుకున్న ఐదు లక్షల నగదుని షూ తయారీపై పరిశోధనలు మొదలు పెట్టారు. కొన్ని షూ కంపెనీల దగ్గర శిక్షణ కూడా తీసుకున్నారు. అప్పటికే రమేష్ ఓ సీనియర్ క్రీడాకారుడు దగ్గర అసిస్టెంట్‌గా నెలకు రూ.4,500 జీతానికి పని చేస్తున్నాడు. దాంతో థక్కర్ భప్పా కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. పాదరక్షల తయారీదారుల్లో అనుభవం ఉన్న ఐదుగురు కార్మికులతో కలిసి పని ప్రారంభించాడు. పాత బూట్లను పెద్ద మొత్తంలో సేకరించి, రంగురంగుల స్లిప్పర్స్‌గా పునర్నిర్మిస్తున్నారు. వీటిలో అద్భుతంగా ఉన్నవాటిని ఆన్‌లైన్ ద్వారా అమ్ముతున్నారు. ఆ నగదుతోనే వర్కర్లకు జీతాలు ఇస్తున్నారు. ఎక్కువ మొత్తంలో తయారుచేసిన చెప్పల్స్‌ను విద్యార్థులకు, వృద్ధులకు విరాళంగా ఇస్తున్నారు. 'గ్రీన్ సోల్' కంపెనీ ద్వారా రమేష్, శ్రీయాన్ మహారాష్ట్ర, గుజరాత్‌లో పల్లె గ్రామాలకు, స్కూళ్లకు వెళుతున్నారు. ప్రతి ఏటా పేదలకు, విద్యార్థులకు 25 వేల జతల పాదరక్షలు విరాళంగా అందిస్తున్నారు.

దాతల సహాయంతో ...

రమేష్, శ్రియాన్‌ల సేవలను గుర్తించిన తోటి క్రీడాకారులు, స్థానికులకు తమ దగ్గర ఉన్న పాత షూస్‌లను, పాత పాదరక్షలను అందిస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న కొత్తమంది కొరియర్ ద్వారా పంపిస్తున్నారు. కొన్ని ప్రయివేటు షూ కంపెనీలు ముందుకు వచ్చి వీరిని ప్రోత్సహిస్తున్నాయి. ఈ కంపెనీ స్థాపన వెనక ఉన్న ఉద్దేశాన్ని తెలుసుకున్న వినియోగదార్లు ఆన్‌లైన్లలో వీరి షూస్‌ని ఉత్సాహంగా కొనుగోలు చేసి ఆర్థికంగా సహాయం అందిస్తున్నారు. ఇలా దేశంలో ఉన్న పేద క్రీడాకారులకు, బడుగు బలహీన వర్గాల వారికి పాదరక్షలను అందించడమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్న శ్రీయాన్, రమేష్‌లను పలువురు అభినందిస్తున్నారు.

వర్షం వేళ ... బైక్ జాగ్రత్త!

కుండపోతగా వర్షాలు పడినప్పుడు వీధులన్నీ జలమయం అవుతాయి. నాలాలు పొంగిపొర్లుతుంటాయి. ఈ సమయంలో వాహనదారులు చాలా జాగ్రత్తలు ప్రయాణించాలి. రోడ్ల మీద నీళ్లు ఎక్కువగా ఉండటం వల్ల బైక్ జారి కింద పడే అవకాశం ఉంటుంది.. అందుకే వర్షాలు రాకముందే కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ప్రమాదాలను తగ్గించవచ్చు.

- వర్షాకాలం రాకముందే వాహనాలను చెక్ చేయించాలి. ఏదైనా లోపాలు ఉంటే సర్వీసు చేయించాలి.
- పాత టైర్లు అరిగిపోయినట్లయితే వెంటనే మార్పించుకోవాలి. అలా చెయ్యకపోతే టైర్లకు పంక్చర్ అవుతుంది. నీళ్లల్లో వెళ్లేటప్పుడు పాత టైర్లు పట్టును కోల్పోయి స్కిడ్ అయ్యే ప్రమాదం ఉంటుంది.
- ఇండికేటర్ పనితీరును కూడా ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకుంటూ ఉండాలి. ఇతరత్రా ఏదేని మరమ్మతులు ఉన్నా వెంటనే చేయించుకోవాలి.
- వర్షం కారణంగా చీకటిగా ఉంటుంది. హెడ్ లైట్, టెయిల్ లైట్లు పనిచేయకపోతే ఇలాంటి సమయంలో ఇబ్బంది పడే అవకాశం ఉంటుంది. కాబట్టి లైట్ల పనితీరును పరిశీలించుకుని కొత్తవి అమర్చుకోవాలి.
- అలాగే బ్రేక్లను చెక్ చేయించుకోవాలి. ఒక్కొక్కసారి బ్రేకులు గట్టిగా బిగుసుకుపోయి బైక్ సమయానికి ఆగదు. దీనివల్ల కూడా బైక్ స్కిడ్ అవుతూ ఉంటుంది. కాబట్టి బైక్ సర్వీసింగ్ చేయించుకోవడం మంచిది.
- హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి. రోడ్లపై నీళ్లు, తడిగా ఉండటం వల్ల బైక్ స్కిడ్ అయ్యే ప్రమాదం ఉంటుంది కాబట్టి హెల్మెట్ ఉంటే ప్రమాదం బారిన పడకుండా ఉండొచ్చు.

17 ఏళ్ల తరువాత ...

ప్రస్తుతం సీనియర్ హీరోయిన్ త్రిష వరుస అవకాశాలతో బిజీగా ఉన్నారు. తాజా సమాచారం ప్రకారం చిరంజీవి రాబోయే సినిమాలో త్రిష నటించనున్నట్లు తెలుస్తోంది. దీంతో మొదటిసారి 'స్టాలిన్'లో చిరంజీవితో కలిసి నటించిన త్రిష 17 సంవత్సరాల విరామం తరువాత మళ్లీ ఇప్పుడు నటించబోతున్నారు. 'సోగ్గాడే చిన్ని నాయనా', 'బంగార్రాజు' చిత్రాల దర్శకుడు కళ్యాణ్ కృష్ణ దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రాన్ని చిరంజీవి కుమార్తె సుస్మితా కొణిదెల నిర్మించబోతున్నట్లు సమాచారం. తండ్రి కొడుకుల కథతో తెరకెక్కనున్న ఈ సినిమాలో చిరంజీవి తండ్రిగా నటిస్తున్నారని, ఆయనకు జోడీగా త్రిషను ఎంపిక చేశారని వార్తలు వస్తున్నాయి.

రామ్ కొత్త లుక్

హీరో రామ్ పోతినేని ప్రస్తుతం బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఒక భారీ మాస్ యాక్షన్ పాన్ ఇండియన్ మూవీ చేస్తున్న సంగతి తెలిసిందే. నటి శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీని శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్ పై శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్నారు. థమన్ సంగీతం అందిస్తున్నారు. సినిమా షూటింగ్ వేగంగా జరుగుతుంది. ఈ క్రమంలో రామ్ స్టైల్ లుక్‌లో కనిపించారు. బ్లాక్ ఔట్ ఫిట్స్‌తో పాటు స్టైల్ అద్దాలు పెట్టుకున్న రామ్ పిక్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ లుక్ దేనికోసం అంటూ అభిమానులు ఉత్సాహం కనబరుస్తున్నారు. సెప్టెంబర్ 15న పలు భాషల్లో థియేటర్లలో విడుదల కానుంది.

ఆస్కార్ కమిటీలో 'ఆర్ఆర్ఆర్' బృందం

రాజమౌళి తెరకెక్కించిన 'ఆర్ఆర్ఆర్' చిత్ర బృందానికి అరుదైన గౌరవం దక్కింది. తాజాగా ఈ చిత్రబృందం లోని ఆరుగురు సభ్యులకు ఆస్కార్ కమిటీలో చోటు కల్పించారు. 'ద అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్' కొత్తగా ఆస్కార్ కమిటీలో 398 మందికి సభ్యత్వం కల్పించింది. ఇందులో 'ఆర్ఆర్ఆర్' టీమ్ సభ్యులకు అవకాశం వచ్చింది. రామ్ చరణ్, ఎన్టీఆర్‌తో పాటు సంగీత దర్శకుడు కీరవాణి, గేయ రచయిత చంద్రబోస్, ఛాయాగ్రాహకుడు కె.కె.సెంథిల్, ప్రొడక్షన్ డిజైనర్ సాబు సిరిల్‌లకు ఆస్కార్ కమిటీలో స్థానం దక్కింది. ప్రస్తుతం ఆస్కార్ కమిటీలో పది వేల మందికి పైగా సభ్యులు ఉన్నారు. కొత్తగా ఆహ్వానాలు అందుకున్న వారితో కలిపితే 10,817 మందికి చేరుతుంది. ఇందులో ఓటు వేసే హక్కు 9375 మందికి ఉంటుంది. 96వ ఆస్కార్ అవార్డు వేడుకను వచ్చే ఏడాది మార్చి 10న నిర్వహించనున్నారు. దర్శకుడు మణిరత్నం, బాలీవుడ్ నుంచి కరణ్‌జోహార్‌లకు కూడా ఆస్కార్ కమిటీ ఆహ్వానం పలికింది.

'శ్రీ రంగనీతులు' ఫస్ట్‌లుక్ పోస్టర్

సుహాస్, కార్తిక్ రత్నం, రుహాని శర్మ ప్రధాన పాత్రలలో నటిస్తోన్న చిత్రం శ్రీరంగనీతులు. ఈ క్రమంలో తొలి ఏకాదశి పండగ సందర్భంగా మేకర్స్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. సుహాస్, కార్తిక్ రత్నం, రుహాని శర్మలతో కూడిన ఈ పోస్టర్ సినిమాపై అంచనాలు పెంచేలా ఉంది. రాధావి ఎంటర్టైన్‌మెంట్స్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం.1గా వెంకటేశ్వరరావు బల్మూరి నిర్మిస్తున్నారు. న్యూ ఏజ్ కామెడీ డ్రామాగా తెరకెక్కుతోన్న ఈ సినిమాతో ప్రవీణ్ కుమార్ వీఎస్ఎస్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ చిత్రంనిర్మాణాంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. అజయ్ అర్సాడ సంగీతం అందిస్తున్నారు. విరాజ్ అశ్విన్, తనికెళ్ల భరణి, గీత భాస్కర్, శ్రీనివాస్ అవసరాల కీలక పాత్రలలో కనిపించనున్నారు.

'భారతీయుడు-2' ప్రమోషన్స్‌లో..



కమల్ హాసన్ హీరోగా 1996లో వచ్చిన 'భారతీయుడు' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతున్నదే 'భారతీయుడు 2' రాబోతుంది. కమల్ హాసన్ – శంకర్ కాంబోలో రానున్న ఈ చిత్రం షూటింగ్ చివరిదశలో ఉంది. దీంతో చిత్రబృందం ప్రమోషన్స్ జోరు పెంచింది. ఈ నేపథ్యంలో ఉదయనిధి స్టాలిన్ ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. అందులో ఆయన మాట్లాడుతూ.. 'కథ పరంగా ఈ సినిమా కోసం షూట్ చేసిన కొన్ని సన్నివేశాలను 'భారతీయుడు2'లో ఉపయోగించలేదని, వాటితో 'భారతీయుడు 3' తీసే ఆలోచనలో ఉన్నారు. అయితే ఈ విషయాన్ని ఇంకా ఖరారు చేయలేదని చెప్పారు. ప్రస్తుత చిత్రంపై కమల్ హాసన్, శంకర్ ఇద్దరూ చాలా సంతోషంగా ఉన్నారని చెప్పారు. కాజల్ అగర్వాల్, రకుల్‌ప్రీత్ సింగ్ హీరోయిన్లగా కనిపించనున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

నాకైతే అర్థం కాలేదు!

రహానెకు వైస్ కెప్టెన్సీపై గంగూలీ



కోల్‌కత : కరేబియన్ పర్యటనలో భారత టెస్టు జట్టుకు అజింక్య రహానె వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. సుమారు 18 నెలలు జాతీయ జట్టుకు దూరమైన అజింక్య రహానె.. ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో తిరిగి చోటు దక్కించుకున్నాడు. డబ్ల్యూటీసీ ఫైనల్లో భారత్ తరపున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచిన రహానెకు వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్‌లో ప్రమోషన్ లభించింది. ఏడాదిన్నర పాటు అవసరం లేదని పక్కనపెట్టిన ఆటగాడికి పునరాగమనంలోనే వైస్ కెప్టెన్సీ అందించడానికి వెనుక ఉన్న కారణాలు నాకు అర్థం కాలేదని భారత మాజీ కెప్టెన్, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ అన్నాడు. గురువారం కోల్‌కతలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న గంగూలీ చర్చాగోష్టిలో మాట్లాడారు. 'యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ వంటి వారిని నాయకత్వ గ్రూప్‌లోకి తీసుకోవాలనే ఆలోచనతో ఏకీభవిస్తాను. రహానెను 18 నెలలు పక్కనపెట్టారు. ఇప్పుడు పునరాగమనంలో వైస్ కెప్టెన్‌ను చేశారు. దీని వెనుక సెలక్షన్ కమిటీ ఆలోచనలు నాకు అర్థం కాలేదు. సెలక్షన్ కమిటీ నిర్ణయాలు ఎప్పుడూ హాట్ అండ్ కోల్డ్ తరహాలో ఉండకూడదు. జట్టు ఎంపికలో నిలకడ, కొనసాగింపు అవసరం.జట్టులో సీనియర్ ఆటగాడు రవీంద్ర జడేజా అందుబాటులో ఉన్నాడు. టెస్టు జట్టులో అతడు నిలకడగా రాణిస్తున్నాడు. జడేజాకు ఆ బాధ్యతలు అప్పగించాల్సిందని' గంగూలీ అన్నాడు.

ఇక చతేశ్వర్ పుజారాను తప్పించటం వెనుక సెలక్షన్ కమిటీ ఉద్దేశాలు కనిపిస్తున్నాయి. వందకు పైగా టెస్టులు ఆడిన సీనియర్ ఆటగాడిని తప్పించాలనుకున్నప్పుడు ఆ సమాచారం స్పష్టంగా తెలియజేయాలి. పుజారా వంటి ఆటగాడిని ఇప్పుడు తప్పించి, మళ్లీ జట్టులోకి తీసుకోవటం సరికాదు. ఇదే రూల్ అజింక్య రహానెకు సైతం వర్తిస్తుంది. యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలనుకున్నప్పుడు ఆ విషయం స్పష్టం చేసి.. ముందుకు సాగాలి. సీనియర్ ఆటగాళ్లతో సెలక్షన్ డైలామా ఉండకూడదు. ఇక సర్ఫరాజ్ ఖాన్ పేస్ బౌలింగ్‌ను ఆడలేడనే వాదనలో నిజం లేదు. పేస్‌ను ఎదుర్కోలేనిదే.. రంజీ ట్రోఫీలో ఇన్ని పరుగులు చేయలేడు. యువ ఆటగాడు యశస్వి జైస్వాల్ దేశవాళీలో గొప్ప ప్రదర్శన చేశాడు. సెలక్షన్ కమిటీ జైస్వాల్‌ను ఎంపిక చేసి మంచి పని చేసింది. సర్ఫరాజ్ ఖాన్‌కు సైతం సెలక్షన్ కమిటీ అవకాశం కల్పించాలని గంగూలీ పేర్కొన్నాడు.

టాప్-100లో భారత్

ఐదేళ్లలో తొలిసారి వందలో..

న్యూఢిల్లీ : భారత ఫుట్‌బాల్ జట్టు ఫిఫా ర్యాంకింగ్స్‌లో ఎగబాకింది. గత ఐదేళ్లలో తొలిసారి టాప్–100లోకి అడుగుపెట్టింది. గత ఏడాది ఇదే సమయంలో 104వ స్థానంలో నిలిచిన భారత్.. తాజాగా వరుసగా రెండు ఎఫ్ఎ టోర్నీలో ఆడేందుకు రంగం సిద్ధం చేసుకుంది. ఫిఫా తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో భారత ఫుట్‌బాల్ జట్టు (మెన్స్) 100వ స్థానంలో నిలిచింది. లెబనాన్, న్యూజిలాండ్‌లను వెనక్కి నెట్టిన టీమ్ ఇండియా..ఐదేళ్లలో అత్యుత్తమ ర్యాంక్ సాధించింది. ఫిఫా ప్రపంచకప్ చాంపియన్ అర్జెంటీనా అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. ఫ్రాన్స్, బ్రెజిల్, ఇంగ్లాండ్, బెల్జియం, క్రోయేషియా, నెదర్లాండ్స్, ఇటలీ, పోర్చుగల్, స్పెయిన్ టాప్–10లో కొనసాగుతున్నాయి.

ఆసియా కప్ బరిలో బుమ్రా, కెఎల్

బెంగుళూరు : గాయం కారణంగా జాతీయ క్రికెట్ అకాడమీలో విశ్రాంతి తీసుకుంటున్న భారత స్టార్ ఆటగాళ్లు జస్ప్రీత్ బుమ్రా, కేఎల్ రాహుల్ త్వరలోనే మైదానంలోకి దిగబోతున్నారు. ఆగస్ట్ 31 నుంచి ప్రారంభమయ్యే ఆసియా కప్‌లో బరిలోకి దిగుతారని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. ఆసియా కప్ కోసం జట్టు ఎంపికకు వీరిద్దరూ అందుబాటులో ఉంటారని తెలుస్తోంది. అయితే, బీసీసీఐ నుంచి లేదా ఎన్‌సీఏ నుంచి అధికారికంగా ఎలాంటి ప్రకటనా వెలువడలేదు. గతేడాది సెప్టెంబర్ నుంచి బుమ్రా క్రికెట్ ఆడటం లేదు. డబ్ల్యూటీసీ ఫైనల్.. ఇలా వరుసగా కీలకమైన టోర్నీల్లోనూ వెన్ను నొప్పి కారణంగా వైదొలిగాడు. ఐపీఎల్ 2023 సీజన్ మధ్యలో మోకాలి గాయం కారణంగా వైదొలిగిన కేఎల్ రాహుల్ కూడా కోలుకుంటున్నాడు. తాజాగా జిమ్‌లో శ్రమిస్తోన్న ఫొటోలను రాహుల్ తన సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తున్నాడు. శ్రేయస్ అయ్యర్ విషయంలోనూ సెలక్షన్ కమిటీ ఆచితూచి వ్యవహరిస్తోందని.. ఒకవేళ పూర్తిగా కోలుకోని పక్షంలో సంజూశాంసన్ లేదా సూర్యకుమార్ యాదవ్‌ను పరిశీలించే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

బంగ్లా పర్యటనకు అమ్మాయిలు

మూడు వన్డేలు, మూడు టీ20ల సిరీస్

ముంబయి : భారత మహిళల క్రికెట్ జట్టు బంగ్లాదేశ్ గడ్డపై తొలిసారి వన్డే సిరీస్ ఆడనుంది. జులై తొలి వారంలో బంగ్లాదేశ్ పర్యటనకు వెళ్లనున్న భారత వైట్‌బాల్ జట్టు.. అక్కడ మూడు వన్డేలు, మూడు టీ20ల సిరీస్‌లో పోటీపడనుంది. జులై 9న తొలి టీ20తో పొట్టి సిరీస్ ఆరంభం కానుండగా.. జులై 16, 19, 22న వన్డేలు జరుగనున్నాయి. గత తొమ్మిదేండ్లలో బంగ్లాదేశ్ పర్యటనకు వెళ్లటం భారత్‌కు ఇది తొలిసారి. గత పర్యటనలో టీ20 సిరీస్‌ను 3-0తో స్వీప్ చేసిన టీమ్ ఇండియా అమ్మాయిలు.. ఈ సారి వన్డే సిరీస్‌లోనూ ఆడనున్నారు. చీఫ్ కోచ్‌గా మజుందార్! : రమేశ్ పోవార్ నేషనల్ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)కు బదిలీ అనంతరం.. భారత మహిళల జట్టుకు చీఫ్ కోచ్ లేదు. హృషికేశ్‌కు తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. ఈ ఏడాది టీ20 ప్రపంచకప్ (ఫిబ్రవరి) సెమీఫైనల్లో ఓడిన భారత్.. ఆ తర్వాత మరో సిరీస్ ఆడలేదు. తాజాగా క్రికెట్ సలహా సంఘం (సీఏసీ) నిర్వహించిన ఇంటర్వ్యూకు మాజీ క్రికెటర్లు అమోల్ ముజుందార్, తుషార్ అరోతె, జాన్ లెవిస్‌లు హాజరయ్యారు. ముంబయి మాజీ కోచ్ అమోల్ ముజుందార్ చీఫ్ కోచ్‌గా ఎంపికయ్యే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. బంగ్లా పర్యటనకు చీఫ్ కోచ్‌తోనే భారత జట్టు వెళ్లనుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68